


ESTD: 1999
www.voodayam.com

# వుదయం

హైదరాబాద్ 12-04-2026 ఆదివారం సంపుటి : 27 | సంచిక : 40 SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY రూ. 3.00 | పేజీలు : 12 VOODAYAM Telugu DAily

Simultaneously Published from Hyderabad, Adilabad, Karimnagar, Khammam, Guntur & Warangal Follow us on




## ట్రంప్ హెచ్చరికల పడగ నీడలో

# పాక్‌లో చర్చలు షురూ

- ఇస్లామాబాద్ లో మొదలైన శాంతి సంభాషణలు
- అమెరికా సీనియర్ అధికారులతో చర్చలు జరుపుతున్నట్లు ఇరాన్ మీడియా వెల్లడి
- తమ ఆస్తులు విడుదల చేయాలని లెబనాన్ లో కాల్పులు విరమించాలని కోరిన ఇరాన్
- లెబనాన్ తో చర్చలకు రెడీ, హిజ్బుల్లాతో కాదు : ఇజ్రాయెల్
- ఆరు బిలియన్ డాలర్ల ఇరాన్ ఆస్తుల విడుదల వార్త అవాస్తవం : అమెరికా



**వుదయం డెస్క్, ఏప్రిల్ 11:** ప్రపంచమంతా ఉత్కంఠతో ఎదురు చూస్తున్న యుఎస్, ఇరాన్ మధ్య చర్చలు పాకిస్తాన్ రాజధాని ఇస్లామాబాద్‌లో ప్రారంభమయ్యాయి. కొనసాగుతున్న ప్రాం తీయ ఉద్రిక్తతల నడుమ ఒక కీలక దౌత్యపరిణామంగా దీనిని ప్రపంచం పరిగణిస్తోంది. ఒకవేళ చర్చలు పురోగమించడంలో విఫలమైతే, నిర్ణయాత్మక చర్యలు తీసుకోవడానికి వాషింగ్టన్ సిద్ధంగా ఉందని యుఎస్ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చర్చలను ఖరారు చేస్తూ పేర్కొన్నారు. కాగా, మధ్యప్రాచ్యాన్ని హింసలో ముంచివేసి, ప్రపంచ ఆర్థిక వ్యవస్థను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిన యుద్ధానికి ముగింపు పలికే ప్రయత్నంలో భాగంగా, ఇరాన్, అమెరికాకు చెందిన సీనియర్ అధికారులు శనివారం పాకిస్థాన్ లో చర్చలు ప్రారంభించినట్లు ఇరాన్ మీడియా వెల్లడించింది. తొలుత చర్చలపై సందేహాలు తలెత్తినప్పటికీ, ఇరాన్ ప్రతినిధి బృందం, యుఎస్ బృందం పాకిస్తాన్ చేరుకోవడంతో చర్చలు జరుగుతున్నాయనే భావన కలిగింది. 1979 ఇస్లామిక్ విప్లవం తర్వాత వాషింగ్టన్, టెహ్రాన్‌ల మధ్య జరుగుతున్న ప్రత్యక్ష చర్చలు ఇవి. ఇరాన్ మీడియా నివేదికల ప్రకారం, తమకు ఆతిథ్యమిచ్చిన పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌తో చర్చించిన తర్వాత ఇరాన్ ప్రతినిధి బృందం చర్చలను ప్రారంభించింది. ఇరాన్ ప్రతినిధి బృందానికి పార్లమెంటరీ స్పీకర్ మహమ్మద్ బఘేర్ ఘలీబాఫ్ నాయకత్వం వహించగా, వాన్స్ తో పాటు వైట్‌హౌజ్ రాయబారి స్టీవ్ విట్కాఫ్, జారేద్ కుష్నర్ ఉన్నారు. ఈ ఘర్షణకు శాశ్వత ముగింపునివ్వడానికి జరిగే ఏ ఒప్పందంలో అయినా ఆంక్షలు

మిగతా 2లో

## ఒప్పందం కుదరకపోతే ఇరాన్‌ను పేల్చివేస్తాం



**వుదయం డెస్క్, ఏప్రిల్ 11 :** పాకిస్తాన్‌లో చర్చలు ఏ ఒప్పందానికీ దారి తీయకపోతే ఇరాన్‌పై దాడి చేసేందుకు యుఎస్ యుద్ధ నౌకలలో ఆయుధాలను నింపుతున్నామని యుఎస్ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇస్లామాబాద్‌లో చర్చలకు కొద్ది గంటలకు ముందు ప్రకటించారు. ఒకవేళ ఒప్పందం కుదరకపోతే, అమెరికా ఆయుధాలను సమర్థవంతంగా ఉపయోగిస్తుందని ఆయన స్పష్టం చేశారు. న్యూయార్క్ పోస్ట్‌కు ఇంటర్వ్యూ ఇస్తూ, రీసెట్ జరుగుతోందని, ఉత్తమమైన ఆయుధాలతో ఓడలను నింపుతున్నామని, వారు ఒప్పందానికి అంగీకరించకపోతే, వాళ్లని పేల్చివేస్తామన్నారు.

మిగతా 2లో

# దక్షిణాదిని బలహీనపరిచే కుట్ర

- 2011 జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన అశాస్త్రీయం
- సామాజిక మార్పున కు దక్షిణాది రాష్ట్రాలు కేంద్రంపై ఒత్తిడి చేస్తున్నాయి
- దక్షిణాది రాష్ట్రాలను బలహీన పర్చేందుకు కేంద్రం కుట్ర పన్నుతుంది
- ద్రవిడ రాష్ట్రాలకు పన్నుల రూపంలో వచ్చే వాటాను తగ్గించింది
- రాష్ట్రంలో ఫ్యూడల్ శక్తుల పునరేకీకరణ ప్రయత్నం జరుగుతుంది
- బహుజనులు ఏకమై ప్రజా ప్రభుత్వాన్ని కాపాడుకోవాలి
- బీసీ సబ్ ప్లాన్ అంశంపై ఆలోచన చేస్తాం
- బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లు కేంద్ర వద్ద పెండింగ్లో ఉంది

డిప్యూటీ సీఎం భట్టి



**హైదరాబాద్, ఏప్రిల్ 11 (వుదయం ప్రతినిధి) :** కుల గణన చేస్తామని ప్రకటించిన కేంద్రం ఆ లెక్కలు పరిగణలోకి తీసుకోకుండా 2011 జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన చేపడితే దక్షిణాది రాష్ట్రాల ఉనికే ప్రశ్నార్థకంగా మారుతుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం రవీంద్ర భారతితో మహాత్మా పూలే ద్విశతాబ్ది జయంతి వేడుకల్లో ఆయన మాట్లాడారు. 2011 జనాభా లెక్కల ప్రకారం మాత్రమే పరిగణలో తీసుకొని నియోజకవర్గాల పునర్విభజన చేపడితే దక్షిణాది రాష్ట్రాల అవసరం లేకుండానే కేంద్రంలో ప్రభుత్వాలు ఏర్పడతాయని తెలిపారు. కుల గణన చేయకుండా నియోజకవర్గాల విభజన చేపడితే ఫలితం మరోరకంగా ఉంటుందని డిప్యూటీ సీఎం అన్నారు. దక్షిణాది రాష్ట్రాలు పెద్ద ఎత్తున సామాజిక మార్పునకు నాంది పలుకుతున్నాయని చెప్పారు. కేంద్రంపై ఒత్తిడి తెస్తున్నాయన్నారు. ద్రవిడ రాష్ట్రాలను బలహీన పరిచేందుకు కేంద్రం నుంచి వచ్చే పన్నుల వాటాలో భారీగా తగ్గింపులు చేశా రని డిప్యూటీ సీఎం వివరించారు. తెలంగాణ నుంచి పన్నుల రూపేనా ఒక రూపాయి కేంద్రా నికి వెళితే తిరిగి రాష్ట్రా నికి 37 పైసలు మాత్రమే వస్తుం దని ఆవేదన వ్యక్తం చేశారు. తమిళనాడు నుంచి రూపాయి వెళితే తిరిగి ఆ రాష్ట్రానికి 29 పైసలు, కేరళ నుంచి రూపాయి వెళితే తిరిగి ఆ రాష్ట్రానికి 61 పైసలు మాత్రమే వస్తున్నాయని తెలిపారు. అదే ఉత్తరాది రాష్ట్రాలైన బీహార్ నుంచి కేంద్రానికి రూపాయి వెళితే తిరిగి కేంద్రం నుంచి ఆ రాష్ట్రానికి 6.53 రూపాయలు వెళుతున్నాయని,

మిగతా 2లో

## బీఆర్ఎస్ రుణమాఫీ వడ్డీలకే సరి

రుణమాఫీ, రైతు భరోసా విషయంలో హరీశ్ రావు అసత్య ప్రచారం

మంత్రి తుమ్మల నాగేశ్వర రావు

**హైదరాబాద్, ఏప్రిల్ 11 (ఎంఎంస్) :** గత పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన రైతు రుణమాఫీ వడ్డీలకే సరిపోయిందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. శనివారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. రుణమాఫీ, రైతు భరోసా విషయంలో మాజీ మంత్రి హరీశ్ రావు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. 25 లక్షల మంది రైతులకు రూ.2 లక్షల చొప్పున రుణమాఫీ చేశామని తుమ్మల స్పష్టత ఇచ్చారు. ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నా రుణమాఫీ చేశామని చెప్పారు.

## అపురూప కలయిక



### అధినేతతో ప్రతిపక్ష నేత

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 11 (వుదయం) :** శనివారం నాడు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ మధ్య ఒక అరుదైన, సరదా సందర్భం చోటుచేసుకుంది. వారి స్నేహపూర్వక సంభాషణకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో విస్తృతంగా చక్కర్లు కొడుతోంది. సామాజిక సంస్కర్త మహాత్మా జ్యోతిబా పూలే 200వ జయంతి సందర్భంగా పుష్పాంజలి ఘటించేందుకు పార్లమెంటు సముదాయంలోని ప్రేరణా స్థలానికి ప్రధాని మోడీ విచ్చేశారు. కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ అప్పటికే అక్కడ ఉన్నారు.

**రాహుల్ యోగక్షేమాలు తెలుసుకున్న మోడీ**

లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, రాహుల్ గాంధీ, కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్, రాజ్యసభ మాజీ డిప్యూటీ చైర్మన్ సహా పలువురు ప్రధానికి స్వాగతం పలికారు. కాగా, ఇరువురి నాయకుల మధ్య సంభాషణ గురించి ఇంటర్నెట్ హోరెత్తిపోతోంది.

మిగతా 2లో

# నారీ వందన్ ను స్వాగతించండి

- 2029 ఎన్నికల్లో
- మహిళా రిజర్వేషన్ అమలు
- అందుకే ఈ నెల 16 నుంచి
- 18 వరకు పార్లమెంట్ సమావేశాలు
- మహిళలకు 33 రిజర్వేషన్ కల్పనకు
- చిత్తశుద్ధితో కేంద్రం యత్నిస్తోంది
- మీడియాతో మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ



**హైదరాబాద్, ఏప్రిల్ 11 (ఎంఎంస్) :** నారీ శక్తి వందన్ అధినియం చట్టాన్ని తీసుకువచ్చి మహిళలకు 33 రిజర్వేషన్ కల్పించాలనే చిత్తశుద్ధితో ప్రధాని నరేంద్ర మోడీ ముందుకు వెళ్తున్నారని ఎంపీ డీకే అరుణ స్పష్టం చేశారు. 2029 సాధారణ ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్ అమలు చేసేందుకు ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు పార్లమెంట్ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఎన్నో ఏళ్లుగా ఎవరు చేయని పని ప్రధాని మోడీ చేస్తున్నారని కితాబిచ్చారు. శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. బిల్లు అమలు చేసినప్పుడే దానికి సార్థకత ఏర్పడుతుందన్నారు. పార్లమెంట్ సమావేశాల్లో అన్ని పార్టీల సభ్యులు పార్టీలకు అతీతంగా మహిళా రిజర్వేషన్ బిల్లును మద్దతు తెలపాలని, 2029లో మహిళా రిజర్వేషన్ బిల్లు అమలులోకి వచ్చేలా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

మిగతా 2లో

# వాట్సాప్ ద్వారా పౌర సేవలు

- వాట్సాప్ ద్వారా రిజిస్ట్రేషన్, స్టాంపుల విభాగం సేవలు
- భూమి పత్రాలు, సర్టిఫైడ్ కాపీల కోసం రిజిస్ట్రార్ కార్యాలయాలకు వెళ్లకుండా చర్యలు
- సమాచార హక్కు చట్టం దరఖాస్తుల స్వీకరణ
- 8096958096 ఫోన్ నంబర్‌పై 'హాయ్' అంటే సేవలు షురూ

**హైదరాబాద్, ఏప్రిల్ 11 (ఎంఎంస్) :** రాష్ట్ర సర్కార్ మరో కీలక నిర్ణయం తీసుకుంది. డిజిటల్ విప్లవంలో భాగంగా.. సామాన్యులకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేస్తూ రిజిస్ట్రేషన్, స్టాంపుల విభాగం సేవలను ఇప్పుడు నేరుగా వాట్సాప్ ద్వారా పొందే వెసులుబాటును కల్పించింది. ఇకపై భూమి పత్రాల కోసం, సర్టిఫైడ్ కాపీల కోసం రిజిస్ట్రార్ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా.. మొబైల్ ఫోన్ నుండే పనులను చక్కబెట్టుకోవచ్చని మీసేవ కమిషనర్ టి.రవి కిరణ్ శనివారం వెల్లడించారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు.. పౌర సేవలను సులభతరం చేసేందుకు 'మీ సేవ వాట్సాప్ చాట్‌బాట్' సేవలను విస్తరించారు. నవంబర్ 18, 2025న ప్రారంభమైన ఈ వినూత్న సేవలకు ప్రజల నుండి విశేష స్పందన లభిస్తోంది. దళారుల ప్రమేయం లేకుండా, పారదర్శకంగా భూమి సంబంధిత వివరాలను ఎక్కడి నుంచైనా డౌన్‌లోడ్ చేసుకునే వీలు కల్పించారు.

మిగతా 2లో

## ఉప కోటా కోసం ఉద్యమం

- కేంద్రం వెన్నులో వణుకు పుట్టిస్తాం
- చట్టసభల్లో బీసీ మహిళల ఉపకోటా కోసం ఉద్యమిస్తాం
- పూలే జయంతి వేడుకల్లో జాగృతి అధ్యక్షురాలు కవిత
- బీసీ ఉపకోటా లేకపోవడమంటే పాలకులకు భయం లేనట్టే

2



# గ్లోబల్ సామర్థ్య కేంద్రం హైదరాబాద్

- ప్రముఖ కంపెనీలను ఆకర్షిస్తోన్న వనరులు
- జీసీసీ ఏర్పాటుకు ముందుకు వచ్చిన పికో టెక్నాలజీ ఇండియా :
- మంత్రి శ్రీధర్ బాబు



**హైదరాబాద్, ఏప్రిల్ 11 (వుదయం ప్రతినిధి) :** ప్రపంచంలోని దిగ్గజ ఫైనాన్స్ సంస్థలన్నీ తమ గ్లోబల్ సామర్థ్య కేంద్రాల ఏర్పాటుకు హైదరాబాద్ నగరాన్ని గమ్యస్థానంగా ఎంచుకున్నాయని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. నైపుణ్యాలతో కూడిన టేలెంట్ పూల్, అంతర్జాతీయ స్థాయి మౌలిక సదుపాయాలు, ట్రాఫిక్ సమస్య లేని రోడ్లు, అందుబాటులో ఉండే అద్దెలు ప్రముఖ కంపెనీలను ఆకర్షిస్తున్నాయని ఆయన తెలిపారు. న్యూయార్క్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహించే పికో టెక్నాలజి సంస్థప్రతినిధులు శనివారం బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో శ్రీధర్ బాబు, రోడ్లు, భవనాల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో భేటీ అయ్యారు. ఫైనాన్సియల్ మార్కెట్‌కు

మిగతా 2లో

# సైబర్ మోసాల యెడల జాగ్రత్త

## హైదరాబాద్ వాసులకు సీపీ సజ్జనార్ సూచన

### అనుమానాస్పద ఏపీకే లింక్‌ను డౌన్ లోడ్ చేయొద్దు



**హైదరాబాద్, ఏప్రిల్ 11 (వుదయం ప్రతినిధి) :** నీటి బిల్లుల పేరుతో జరుగుతున్న సైబర్ మోసాలపై హైదరాబాద్ వాసులు అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ సూచించారు. ప్రజల్లో ఉండే భయాన్ని పెట్టుబడిగా పెట్టి.. వారి పర్సనల్ సమాచారంతో పాటు.. బ్యాంక్ అకౌంట్ డేటాను తీసుకుని.. డబ్బులు దోచుకునే ఇలాంటి తరహా మోసాలపై అప్రమత్తంగా ఉండాలని ఎక్స్ వేదికగా వేదికగా నగరవాసులను అప్రమత్తం చేశారు. ఇటీవల హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు పేరుతో నగరంలో జరుగుతున్న సైబర్ మోసాలను గుర్తించినట్లు సజ్జనార్ తెలిపారు. ఎవరైనా ఫోన్, మెసేజ్ చేసి.. వాటర్ బిల్లులు చెల్లించలేదని.. చాలా రోజులుగా పెండింగ్‌లో ఉన్నాయని చెబుతూ.. నీటి కనెక్షన్ కట్ చేస్తామంటూ బెదిరింపులకు గురి చేస్తారని పేర్కొన్నారు. అలాంటి మెసేజ్, కాల్స్‌కు భయపడవద్దని వెల్లడించారు. మొదట సైబర్ నేరగాళ్లు.. ఫోన్ చేసి నీటి బిల్లు బకాయి ఉందని.. వెంటనే చెల్లించకపోతే కనెక్షన్ కట్ చేస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారని సీపీ తెలిపారు. ఇలా జనాల్లో భయాన్ని తీసుకువచ్చి.. ఒత్తిడి తీసుకువస్తున్నారని పేర్కొన్నారు. ఆ తర్వాత 'HMWSSB WATER BILL UP-DATE.apk' అనే పేరుతో ఒక అనుమానాస్పద ఏపీకే లింక్‌ను పంపిస్తున్నారని..

మిగతా 2లో

# సిఎం భూ దందా

## ఫ్యూచర్ లేని నాయకుడు ఫ్యూచర్ సిటీ కడతానంటున్నడు

- ఉన్న సిటీనే పట్టించుకునే తెలివి లేదు
- 14వేల ఎకరాల ఫార్మా సిటీ భూములు రైతులకు ఇవ్వకుండా మోసం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 11 (వుదయం ప్రతినిధి) :** ఫార్మా సిటీ పేరుతో సీఎం రేవంత్ రెడ్డి భూముల దందా చేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఫ్యూచరే లేని నాయకుడు మళ్లీ ఫ్యూచర్ సిటీ కడతా అంటే ప్రజలు నవ్వుతున్నారని ఎద్దేవా చేశారు. ఎన్నికలకు ముందు గత ప్రభుత్వం సేకరించిన 14వేల ఎకరాల ఫార్మా సిటీ భూములను తిరిగి రైతన్నలకు ఇస్తామని చెప్పి వారితో ఓట్లు వేయించుకున్నారని విమర్శించారు. ఇప్పుడు ఫోర్త్ సిటీ పేరుతో మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. శనివారం ఇబ్రహీంపట్నంలో బీఆర్ఎస్ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న కేటీఆర్, ఇటీవల మున్సిపల్ ఎన్నికల్లో గెలిచిన చైర్‌పర్సన్, కౌన్సిలర్లను, సర్పంచ్‌లను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకవైపు ఫార్మా సిటీ కేసు కోర్టులో ఉందని చెబుతూ, బయటకు వచ్చి అవే భూముల్లో ఫోర్త్ సిటీ కడతామని చెబుతుందన్నారని మండిపడ్డారు. గతంలో ఫార్మా సిటీ భూముల్లో అప్పటి సీఎల్పీ నాయకుడిగా ఉన్న భట్టి విక్రమార్క, మంత్రి సీతక్క, కోమటిరెడ్డి వెంకటరెడ్డి పాదయాత్ర చేసి.. తమకు ఓటు వేస్తే మీ భూములు మీకు తిరిగి అప్పజెపుతామని హామీ ఇచ్చారన్నారు. రెండున్నరేండ్ల తర్వాత మరో 16వేల ఎకరాల అదనపు

మిగతా 2లో

# ఉప కోటా కోసం ఉద్యమం

**చట్టసభల్లో బీసీ మహిళల ఉపకోటా కోసం ఉద్యమిస్తాం**

**పూలే జయంతి వేడుకల్లో జాగృతి అధ్యక్షురాలు కవిత**

**బీసీ ఉపకోటా లేకపోవడమంటే పాలకులకు భయం లేనట్టే**

**హైదరాబాద్, ఏప్రిల్ 11 (వుదయం ప్రతినిధి) :** బీసీ మహిళలకు చట్టసభల్లో ఉప కోటా దక్కే వరకు తెలంగాణ జాగృతి విశ్రమించబోదని ఆ సంస్థ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. పూలే జయంతిని పురస్కరించుకుని శనివారం బంజారాహిల్స్‌లోని జాగృతి కార్యాలయంలో జ్యోతిబా పూలే విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ బిల్లు వచ్చినప్పటికీ, అందులో బీసీ మహిళలకు ఉపకోటా లేకపోవడంపై కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీ ఉపకోటా లేకపోవడమంటే పాలకులకు భయం లేనట్లేనని చెప్పారు. కేంద్రం వెన్నులో వణుకు పుట్టేలా జాగృతి ఉద్యమిస్తుందన్న కవిత.. పూలే మళ్లీ పుట్టారా అన్నట్లుగా ఈ పోరాటం ఉంటుందన్నారు. ఈ నెల 16, 17, 18 తేదీల్లో మహిళా బిల్లుపై పార్లమెంట్‌లో చర్చ జరగనున్న నేపథ్యంలో తాను ఢిల్లీ కి వెళ్లి అన్ని రాజకీయ పార్టీల నేతలతో మాట్లాడతానని వెల్లడించారు. ఎంపీల బలం ఉందని బిల్లును అలాగే పాస్ చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ఇటు రాష్ట్ర ప్రభుత్వమూ పూలే విగ్రహ ఏర్పాటులో జాప్యం చేస్తోందని మండిపడ్డారు. అసెంబ్లీలో పూలే విగ్రహం పెట్టాలని కోరితే ట్యాంక్ బండ్ వద్ద పెడతామని ప్రభుత్వం చెప్పిందన్నారు. అయినా ఇప్పటి వరకు ఆ పనులు పూర్తి కాలేదని విమర్శించారు. అంబేడ్కర్ జయంతి నాటికైనా విగ్రహాన్ని పూర్తి చేయాలని ఆమె డిమాండ్ చేశారు.

**ఆర్టిజన్లకు జాగృతి మద్దతు..** విద్యుత్ శాఖలో పనిచేస్తున్న ఆర్టిజన్ల క్రమబద్ధీకరణ కోసం జాగృతి పూర్తి మద్దతు ప్రకటిస్తున్నట్లు కవిత తెలిపారు. ఆర్టిజన్లపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం చూస్తోందని, దీనికి నిరసనగా కొత్తగూడెంలో జరుగుతున్న ఆందోళనలో జాగృతి నాయకులు పాల్గొంటారని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఆటిజన్ల జీతాలు రూ.40 వేలకు పెంచడంలో జాగృతి కీలక పాత్ర పోషించిందని ఆమె గుర్తు చేశారు. సమాజంలో మార్పు రావాలంటే అది మన నుంచే మొదలు కావాలని అన్నారు. పూలే ఎన్ని అవమానాలు ఎదురైనా వెన్ను చూపకుండా పోరాడారని గుర్తు చేశారు. సామాజిక న్యాయం కోసం అహర్నిశలు పనిచేయడమే ఆయనకు మనం ఇచ్చే నిజమైన నివాళి అని కవిత పిలుపునిచ్చారు.

# సైబర్ మోసాల యెడల జాగ్రత్త

మొదటి పేజీ తరువాయి



దాన్ని డౌన్‌లోడ్ చేసి ఇన్‌స్టాల్ చేయాలని సూచిస్తున్నారని తెలిపారు. ఆ యాప్ డౌన్‌లోడ్ చేస్తే.. మన సమాచారం మొత్తం సైబర్ నేరగాళ్లకు వెళ్లిపోతుందని సజ్జనార్ వివరించారు. ఇలాంటి నకిలీ ఏపీకే ఫైల్‌ను ఇన్‌స్టాల్ చేసిన వెంటనే మన ఫోన్ సైబర్ నేరగాళ్ల కంట్రోల్‌లోకి వెళ్తుందని సజ్జనార్ తెలిపారు. ఆ తర్వాత ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, ఓటీపీలు సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి వెళ్తుందన్నారు. అదే సమయంలో బ్యాంకింగ్ యాప్‌లను కూడా గమనించాలని పేర్కొన్నారు. మనకు తెలియకుండానే సైబర్ నేరగాళ్లు ట్రాన్సాక్షన్లు చేస్తారని చెప్పారు. దీంతో క్షణాల్లోనే బ్యాంక్ అకౌంట్లు ఖాళీ అయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. గుర్తు తెలియని వ్యక్తుల నుంచి పంపించే ఏ ఏపీకే ఫైల్‌ను కూడా ఇన్‌స్టాల్ చేయకూడదని స్పష్టం చేశారు. నీటి బిల్లులు పెండింగ్‌లో ఉంటే.. ప్రజలు కేవలం అధికారిక వెబ్‌సైట్ లేదా అధికారిక మొబైల్ యాప్‌ల ద్వారానే చెల్లించాలని హితవు పలికారు. ఇలాంటి ఫోన్ కాల్స్ వస్తే వెంటనే స్పందించకుండా సైబర్ క్రైం పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఒకవేళ పొరపాటున ఏపీకే ఫైల్ ఓపెన్ చేసినా.. దాంతో డబ్బులు పోయినా ఆలస్యం చేయకుండా వెంటనే సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. నేషనల్ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కి కాల్ చేసి వెంటనే ఫిర్యాదు చేయాలని వెల్లడించారు. లేకపోతే ఆన్‌లైన్‌లో cybercrime.gov.in పోర్టల్‌లో వివరాలను నమోదు చేయాలని సూచించారు.

# గ్లోబల్ సామర్థ్య కేంద్రం హైదరాబాద్

మొదటి పేజీ తరువాయి

సంబంధించిన సేవలు అందించే పికో టెక్నాలజీ ఇండియా అనుబంధ కంపెనీ ద్వారా ఇక్కడ జీసీసీ ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చింది. ఈ సంసర్భంగా ఇక్కడి అవకాశాలు, మౌలిక వసతుల గురించి మంత్రులకు వివరించారు. ఈ సందర్భంగా శ్రీధర్ బాబు మాట్లాడుతూ రానున్న 20 ఏండ్ల అవసరాలకు తగిన విధంగా మౌలిక సదుపాయాలు మెరుగు పర్చేందుకు ప్రణాళికలు అమలు చేస్తున్నట్టు తెలిపారు. బెంగళూరు, ముంబాయి నగరాలతో పోలిస్తే ఇక్కడ ఆఫీసు స్థలాల ఆక్యుపెన్సీ 73 శాతం ఉందని చెప్పారు. ముంబయిలో అది 52 శాతం మాత్రమేనని తెలిపారు. బెంగళూరు, ముంబయి మెట్రో నగరాల్లో ట్రాఫిక్, వాయు కాలుష్యం ప్రధాన సమస్యలుగా మారినందున ఐటి సంస్థలు, జీసీసీలు హైదరాబాద్ కు తరలి వస్తున్నాయని తెలిపారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ ఇప్పుడున్న నెహ్రూ రింగ్ రోడ్డుకు 30 కిలో వెలుపల రీజనల్ రింగ్ రోడ్డు నిర్మిస్తున్నట్టు వెల్లడించారు. దానికి అనుబంధంగా రేడియల్ రోడ్లు ఏర్పాటవుతున్నాయిని వివరించారు. రింగ్ రోడ్ల పక్కన రైలు మార్గాన్ని కూడా ఏర్పాటు చేసి రవాణా సదుపాయాలను ప్రపంచంలోని పెద్ద నగరాలను తలదన్నేలా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. హయత్ నగర్– ఎల్బీనగర్ ల మధ్య డబుల్ డెక్కర్ రోడ్డు నిర్మిస్తున్నట్టు వివరించారు. కింది రోడ్డు స్థానిక ట్రాఫిక్ అవసరాలకు వినియోగిస్తామని పైన ఉండే రెండు అందు అంతస్తుల రోడ్లు నగరం నుంచి వెలుపలకు, లోపలకి వచ్చే వాహనాల కోసం ప్రత్యేకిస్తామని చెప్పారు. నాగపూర్ తర్వాత డబుల్ డెక్కర్ రోడ్లు నిర్మిస్తున్న నగరం ఇదేనని అన్నారు. రెండు నెలల్లో టెండర్ ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో పికో టెక్నాలజీ వ్యవస్థాపక సిఇఓ జారొడ్ యుస్టర్, పికో ఇండియా సిఇఓ హరి కోదండరామన్, డైరెక్టర్ సీతారాం పాల్గొన్నారు,



# అపురూప కలయిక

మొదటి పేజీ తరువాయి

అక్కడ ఉన్న నాయకులను పలకరించిన తర్వాత, రాహుల్ గాంధీ దగ్గరకు వెళ్లి ప్రధాని మోడీ అతడి యోగక్షేమాలు విచారించారు. రాహుల్ కూడా చిరునవ్వుతో ప్రధానికి సమాధానమిచ్చారు. ఈ చిత్రాన్ని కొంతమంది నెటిజన్లు ప్రజాస్వామ్యపు అందమైన చిత్రంగా అభివర్ణించారు.

**తీవ్ర పోటీ నడుమ అరుదైన క్షణాలు**

ఇటీవల ముగిసిన పార్లమెంటు సమావేశాలలో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య తీవ్రమైన వాదప్రతివాదాలు జరిగిన కొద్ది రోజుల తర్వాత ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని, ప్రధాని మోడీ మహాత్మా జ్యోతిరావ్ పూలేకి నివాళులు అర్పిస్తూ, సమానత్వం, న్యాయం, విద్య అనే ఆదర్శాల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన సామాజిక సంస్కర్తగా ఆయనను అభివర్ణించారు. అనంతరం ఎక్స్‌పై చేసిన పోస్టులో మహిళలు, బలహీనవర్గాల హక్కుల కోసం పోరాడిన యోధుడిగా ఆయనను అభివర్ణించారు. సామాజిక పురోగతి దిశగా మా కృషికి ఆయన ఆలోచనలు మార్గదర్శకంగా ఉంటాయని అన్నారు.

# సిఎం భూ దందా

మొదటి పేజీ తరువాయి



భూమిని రైతుల నుంచి గుంజుకొని ఫోర్త్ సిటీని, భారత్ ఫ్యూచర్ సిటీని కడతానని నాటకాలు ఆడుతున్నారని దుయ్యబట్టారు. కేవలం తన అనుచరులకు, తన కుటుంబ సభ్యులు సోదరులకి భూములు కట్టబెట్టడం కోసమే ఈ ఫ్యూచర్ సిటీ డ్రామాను రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ తెరలేపిందన్నారు.పేదల భూములను దౌర్జన్యంగా గుంజుకుంటున్న సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ చరిత్రలో ఒక చరిత్రహీనుడిగా మిగిలిపోతాడని చెప్పారు. తెలంగాణ సమాజం కాంగ్రెస్ పార్టీని, రేవంత్ రెడ్డిని చీత్కరించే రోజులు దగ్గర పడ్డాయన్నారు. రేవంత్ రెడ్డి పదవి దిగిపోయిన తర్వాత కనీసం పలకరించే నాధుడు కూడా ఉండడని అన్నారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, ఆ విషయం మర్చిపోయి అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్న రేవంత్ రెడ్డికి ప్రజలు ఖచ్చితంగా బుద్ధి చెబుతారన్నారు. మున్సిపల్ ఎన్నికల అనంతరం దాదాపు రెండు నెలల పాటు అన్ని రకాల అన్యాయాలు, అక్రమాలు చేసిన తర్వాత ఇబ్రహీంపట్నం, క్యాతనపల్లి మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్ సమితి గులాబీ జెండా ఎగిరిందన్న విషయాన్ని రేవంత్ రెడ్డి గుర్తుంచుకోవాలన్నారు. మెజారిటీ కౌన్సిలర్లు బీఆర్ఎస్ వాళ్లు గెలిచిన తర్వాత కూడా కాంగ్రెస్ పార్టీ అక్రమంగా చైర్మన్ పదవులను తీసుకునేందుకు అనేక దురాగతాలకు పాల్పడిందనీ చివరికి న్యాయం గెలిచిందని కేటీఆర్ అన్నారు.

**ఉన్న సిటీనే పట్టించుకునే తెలివి లేదు**

ఉన్న సిటీనే పట్టించుకునే తెలివి లేని రేవంత్ రెడ్డికి ఫోర్త్ సిటీని, భారత్ ఫ్యూచర్ సిటీ ఆలోచన ఎక్కడ్నుంచి వచ్చిందోనని ఎద్దేవా చేశారు. ఉన్న సిటీలో దోమలు కుట్టి జనం చనిపోతుంటే పట్టించుకునే పరిస్థితి లేదని మండిపడ్డారు. గత ప్రభుత్వం కోహెడలో 178 ఎకరాల భారీ విస్తీర్ణంలో అతిపెద్ద పండ్ల మార్కెట్ కడతామని అంటే, వాటిని మళ్ళీ ఇప్పుడు రాచకొండ గుట్టలకో, రామోజీ ఫిలిం సిటీ అవతలకో పోవాలని చెప్పి ప్రభుత్వం చెబుతుందన్నారు. ఈ ఉన్న 178 ఎకరాలను అమ్ముకునేందుకు రేవంత్ రెడ్డి ప్రయత్నం చేస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. ఒకప్పుడు నిషేధిత భూముల జాబితాను తగ్గించి భూమి సమస్యలను పరిష్కరిస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ, అధికారంలోకి వచ్చిన తర్వాత 16 లక్షలు ఉన్న నిషేధిత భూముల సంఖ్యను కోటి ఎకరాలకు పెంచి, అందరినీ బ్లాక్ మెయిల్ చేస్తూ భూముల దందా చేస్తోందని కేటీఆర్ విమర్శించారు. ఈ నిషేధిత జాబితాను అడ్డుపెట్టుకొని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ పెద్దలు కలెక్టర్లకు ఫోన్లు చేసి ప్రజలను ఇబ్బందులు పెడుతూ భూముల దందా సెటిల్మెంట్లకు పాల్పడుతున్నారన్నారు.

# దక్షిణాదిని బలహీనపరిచే కుట్ర

మొదటి పేజీ తరువాయి

ఉత్తరప్రదేశ్ నుంచి కేంద్ర ప్రభుత్వానికి రూపాయి వెళితే తిరిగి ఆ రాష్ట్రానికి పన్నుల వాటాల రూపంలో 2.17 రూపాయలు వెళుతున్నాయని వివరించారు. దక్షిణాది రాష్ట్రాల పట్ల జరుగుతున్న వివక్ష, కేంద్రం ఉద్యమాలను కట్టడి చేస్తున్న తీరు, నియోజకవర్గాల పునర్విభజన అంశంపై కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో ఇటీవల పెద్ద ఎత్తున చర్చ జరిగిందని డిప్యూటీ సీఎం తెలిపారు. నియోజకవర్గాల పునర్విభజనలో కుల గణన ను పరిగణలోకి తీసుకోకపోతే యావత్ భారత దేశంలోని బలహీన వర్గాలకు నష్టం జరుగుతుందని, మనకోసం మనం పోరాడాల్సిన అవసరం ఏర్పడిందని డిప్యూటీ సీఎం తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి ప్రజా ప్రభుత్వం బడ్జెట్లో పెద్ద ఎత్తున ప్రజలే కేంద్రంగా నిధులు కేటాయించిందన్నారు. ఇదే జరిగితే తమకు పెద్ద ఎత్తున నష్టం జరుగుతుందని భావించి రాష్ట్రంలో ఫ్యూడల్ శక్తుల పునరేకికరణ ప్రయత్నం జరుగుతుందని డిప్యూటీ సీఎం హెచ్చరించారు.

**బీసీ సబ్ ప్లాన్ పై ఆలోచన చేస్తున్నాం**

ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టాన్ని కాంగ్రెస్ అమల్లోకి తీసుకువచ్చిందన్న భట్టి విక్రమార్క బీసీ సబ్ ప్లాన్ అమలుపై వచ్చిన డిమాండ్ ను పరిగణలోకి తీసుకుంటామని వెల్లడించారు. బీసీ సబ్ ప్లాన్ అమలుకు ఆలోచన చేస్తామని హామీ ఇచ్చారు. అంతరాలు లేని సమాజం కోసం జనాభా ఆధారంగా నిధులు కేటాయించాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. జనాభా దామాషా ప్రకారం నిధులు ఖర్చు చేసినప్పుడే సకల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు. తమ ప్రభుత్వం సామాజిక న్యాయం కోసం కట్టుబడి ఉందన్నారు. ఎన్ని అవాంతరాలు వచ్చినా నిటారుగా నిలబడుతుందని స్పష్టం చేశారు. అధికారంలోకి రాగానే కుల సర్వే చేపడతామని రాహుల్ గాంధీ ఎన్నికల ముందు ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రజా ప్రభుత్వం అధికా



రంలోకి రాగానే కుల సర్వే చేసి రాష్ట్రంలో 56శాతం మంది బీసీలు ఉన్నారని తమ ప్రభుత్వం లెక్క కట్టి చెప్పిందన్నారు. వంద సంవత్సరాల క్రితం బ్రిటిష్ వారు కుల సర్వే చేశారు ఆ తర్వాత దేశంలో కుల సర్వే చేసిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అని అన్నారు. కుల సర్వే ఆధారంగా స్థానిక సంస్థల్లో, విద్యా ఉద్యోగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు అసెంబ్లీలో ఏకగ్రీవంగా తీర్మానం చేసి బిల్లును గవర్నర్ కు పంపామనీ ఆయన కేంద్ర ప్రభుత్వానికి పంపగా అక్కడ బిల్లు పెండింగ్ లో ఉందని తెలిపారు. కేంద్రం ఆమోదించి పంపితే కుల సర్వే ప్రకారం చేయాల్సిన కార్యక్రమాలు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. ప్రజా ప్రభుత్వం సామాజిక స్పృహతో పాలన అందిస్తుందని భట్టి స్పష్టం చేశారు. ఏ చిన్న అవకాశం దక్కిన, ప్రతి సందర్భంలో పూర్తిస్థాయిలో మహాత్మ పూలే ఆలోచనలను తమ ప్రభుత్వం అమలు చేస్తుందని తెలిపారు. మార్పు కోసం మనం అంతా నడుం బిగించి అవకాశం దొరికిన ప్రతి సందర్భాన్ని వినియోగించుకోవాలి అన్నారు. అంతరాలు లేని సమాజం విద్యుత్ ద్వారానే సాధ్యమని చెప్పారు. అందుకోసం చిన్ననాటి నుంచే పునాదులు వేయాలని లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ ఓసి అన్ని వర్గాల పిల్లలు 12వ తరగతి వరకు ఒకే చోట చదువుకునేలా అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తోందన్నారు. అధికారంలోకి రాగానే 40 శాతం డైట్, 200శాతం కాస్మోటిక్ చార్జీలు పెంచామన్నారు. ఎవరు అర్థాకలితో ఉండకూడదనే ఉద్దేశంతో ప్రతిరోజు నాణ్యమైన డైట్ ను అందించడంతో పాటు వాటిని పర్యవేక్షించేందుకు చీఫ్ సెక్రటరీ నుంచి మండల స్థాయి అధికారి వరకు సీఎం నుంచి సర్పంచి వరకు గురుకులాలు సంక్షేమ వసతి గృహాలు సందర్శించాలని నిబంధన పెట్టామని భట్టి విక్రమార్క తెలిపారు. అవసరమైతే అక్కడే నిద్రించాలని నిబంధన పెట్టి ఎప్పటికప్పుడు నివేదికలు తీసుకుంటున్నట్టు వివరించారు. మరోవైపు జూన్ 2 నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో 20 లక్షల మంది విద్యార్థులకు అల్పాహారం పథకం ప్రారంభిస్తున్నామనీ ప్రతి నియోజకవర్గంలో రూ.15 కోట్లతో సకల సౌకర్యాలతో తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ప్రారంభిస్తున్నామని ప్రకటించారు. అక్షరాన్ని ఆయుధంగా చేసుకుంటేనే అంతరాలు లేని సమ సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని నమ్మిన ప్రజా ప్రభుత్వం తాజా బడ్జెట్లో విద్యా శాఖకు 13.5శాతం నిధులు కేటాయించినట్లు చెప్పారు. ఆత్మగౌరవ భవనాల నిర్మాణానికి పూర్తిస్థాయిలో నిధులు కేటాయించామని తెలిపారు. కుల వృత్తులపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వారికి ఉచితంగా విద్యుత్తు అందిస్తున్నామని తెలిపారు.

# నారీ వందన్ ను స్వాగతించండి

మొదటి పేజీ తరువాయి

ఇది ఒక సాధారణ బిల్లు కాదన్న డీకే అరుణ... కోట్లాది మంది ఆడబిడ్డల ఆశయమని చెప్పారు. కేంద్రం అమలు చేయనున్న ఈ బిల్లు రాజకీయాల్లో కొత్త నాంది పలుకుతుందని అభిప్రాయపడ్డారు. మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు అయితే.. నియోజకవర్గాల పునర్విభజన తర్వాత.. పార్లమెంట్ స్థానాలు 17 స్థానాల నుంచి 26 స్థానాలకు పెరుగుతాయని అరుణ చెప్పారు అందులో 9 మంది ఎంపీలు తెలంగాణ నుంచి ఉంటారన్నారు. 273 మంది మహిళలు దేశవ్యాప్తంగా పార్లమెంట్‌కి వస్తారన్నారు. తెలంగాణ అసెంబ్లీ స్థానాలు 180కి పెరుగుతాయనీ అందులో 60 మంది మహిళా ఎమ్మెల్యేలు అసెంబ్లీలో కూర్చునే అవకాశం దక్కుతుందన్నారు. అసెంబ్లీ, పార్లమెంట్ చట్టసభల్లో పెద్ద సంఖ్యలో మహిళల ప్రతినిధ్యం పెరుగుతుందన్న డీకే అరుణ.. దేశ రాజకీయాల్లోకి మహిళలు పెద్ద ఎత్తున వచ్చే అవకాశం కల్పిస్తోందని చెప్పారు. గతంలో వంటింటికి పరిమితమైన మహిళలు.. అనేక రంగాలలో వచ్చిన అవకాశాలను తన శక్తిని నిరూపించుకుందన్నారు. దేశ రాజకీయాల్లో అనేక మార్పులు వస్తాయని వివరించారు. పెద్ద ఎత్తున అభివృద్ధి వైపు అడుగులు వేయగలుగుతామన్న డీకే అరుణ ఒక తల్లిగా కుటుంబాన్ని అన్ని రకాలుగా ముందుకు తీసుకెళ్లడంలో సమర్థవంతంగా, చక్కగా వ్యవహరిస్తూ ప్రతి మహిళ ముందుకు వెళ్తోందన్నారు. చట్ట సభలో మహిళల సంఖ్య పెరిగితే మహిళా ఆర్థిక, ఉపాధి, రక్షణలలో కీలక మార్పులు వస్తాయని చెప్పారు. అనేక మంది మహిళలు రాజకీయాల్లో తమ నాయకత్వాన్ని రుజువు చేసుకున్నారన్న ఆమె.. ఏ రంగంలో అయినా రాణించగలం అని రుజువు చేస్తున్నారన్నారు.. 40 ఏళ్లుగా మహిళా సాధికారత అని ప్రగల్భాలు పలుకుతోన్న కాంగ్రెస్ కనీసం ఇప్పుడైనా మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ మద్దతు తెలపాలని కోరారు. మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకోవాలని అనేక మంది కుట్రలు పన్నుతున్నారని చెప్పారు.

**పేద కుటుంబాల్లో గుణాత్మక మార్పు**

కేంద్రంలో మోడీ నేతృత్వంలోని సర్కార్ మహిళల ఆత్మగౌరవాన్ని పెంచేలా ఎన్నో కార్యక్రమాలు, పథకాలు అమలు చేశారని డీకే అరుణ అన్నారు.. స్వచ్ భారత కింద 12వేల కోట్ల ఇండ్లకు టాయిలెట్స్ నిర్మాణం, పేద మహిళలకు ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు, జన్ ధన్ యోజన, స్టార్టాప్ కంపెనీలను ప్రోత్సహించేందుకు ముద్ర రుణాలు అందిస్తున్నట్లు వివరించారు. వికాసిత్ భారత్ 2027 లక్ష్యం తో ముందుకు వెళ్తున్నామన్న ఆమె.. దేశ జీడీపీ పెరుగుతుందని అంటే.. మహిళల భాగస్వామ్యం కీలకం అన్నారు. మహిళా శక్తి కి రాజకీయ శక్తి తోడైతే.. గ్రామీణ ప్రాంతాల్లో,రైతు, పేద కుటుంబాల్లో గుణాత్మక మార్పు వస్తుందని అభిప్రాయపడ్డారు. ప్రపంచ దేశాల్లో అభివృద్ధి చెందిన దేశంగా నిలబడాలి అంటే.. మహిళాల భాగస్వామ్యం అవసరమని చెప్పారు. మహిళలను విద్య, ఆరోగ్యం, ఉపాధి, రక్షణ అన్నింటిలో ప్రోత్సాహకం కల్పిస్తున్నట్టు చెప్పారు. గర్భిణీ, బాలింతల కు పోషకాహారం, క్యాన్సర్ బారిన కడకుండా.. వాక్సినేషన్ బాలికలకు అందిస్తున్నట్లు వివరించారు. బీజేపీకి పేరువస్తుందని.. ప్రత్యర్థులు కుళ్ళు బుద్ధితో ఈ బిల్లును అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. మహిళలకు డ్రోన్ ట్రైనింగ్, స్టాండప్ ఇండియా కింద ప్రోత్సహిస్తుందనీ దీదీ లక్పతి పథకం ఇలా అనేక పథకాలతో ప్రోత్సహిస్తుందన్నారు. గతంలో కేసీఆర్ మాదిరి ఉత్తర, దక్షిణ రాష్ట్రాలని.. మాట్లాడారో అలాగే రేవంత్ రెడ్డి కూడా మాట్లాడుతున్నారన్నారు.

# పాక్ లో చర్చలు షురూ

మొదటి పేజీ తరువాయి



విధించిన ఇరాన్ ఆస్తులను విడుదల చేసే అంశం, దానితో పాటుగా లెబనాన్‌లో హిజ్బుల్లాపై ఇజ్రాయెల్ యుద్ధాన్ని ముగించాలనే అంశం కూడా పొందుపరచాలని ఇరాన్ పేర్కొంది. కాగా, ఈ అంశాలపై ఇస్లామబాద్‌లో చర్చ జరగదని వాన్స్ స్పష్టం చేశారు. ఈ అంశాలపై సాధించిన పురోగతి కారణంగానే, ఈ చర్చలు ముందుకు తీసుకువెళ్లేందుకు ఇరాన్‌కు ఆత్మవిశ్వాసం కలిగిందని ఇరాన్ మీడియా పేర్కొంది. లెబనాన్‌తో చర్చలు జరిపేందుకు ఇజ్రాయెల్ అంగీకరించినప్పటికీ, హిజ్బుల్లాతో చర్చించే ప్రసక్తే లేదని పేర్కొంది. ఇరు వర్గాలూ, కీలక అంశాలపై పరస్పర విరుద్ధ అభిప్రాయాలతో ఉన్నట్టు కనిపిస్తోంది. ముఖ్యంగా, ఆంక్షలు, లెబనాన్, హొర్ముజ్ జలసంధిని తిరిగి తెరవడం అన్న అంశాలపై పరస్పరం ఉన్న అనుమానాలు దాచుకునే ప్రయత్నం చేయడం లేదు. యుఎస్, ఇరాన్ ప్రతినిధి వర్గాల మధ్య పాకిస్తానీ మధ్యవర్తులు సందేశాలను అందిస్తున్నారని, ఈ చర్చలను పరోక్షంగా నిర్వహిస్తున్నారని తొలి నివేదికలు వచ్చాయి. కాగా, రెండు ప్రతినిధి వర్గాలూ ప్రత్యక్ష చర్చలకు దిగాయని అల్ జజీరా పేర్కొంది. అంతకు ముందు, ఇరు ప్రతినిధి బృందాలూ వేర్వేరుగా పాకిస్తానీ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్‌తో చర్చలు జరిపారు.

**కాల్పుల విరమణ ప్రాంతీయ పరిణామాలు**

లెబనాన్‌తో సహా ఆ ప్రాంతంలో కొనసాగుతున్న ఉద్రిక్తతల నడుమ సున్నితమైన కాల్పుల విరమణ నేపథ్యంలో చర్చలు జరుగుతున్నాయి. ఈ చర్చల ఫలితాలు ఎలా ఉంటాయని ప్రపంచం నిశితంగా గమనిస్తోంది. ఈ ఫలితాలే మధ్య ప్రాచ్య స్థిరత్వానికీ, ప్రపంచ ఇంధన మార్గాలు, ప్రధానంగా హొర్ముజ్ జలసంధిపై అవి చూపే ప్రభావాల కారణంగా ఉత్కంఠ నెలకొని ఉంది.

**ఇరాన్కు చెందిన 6బిలియన్ డాలర్ల విడుదల వార్తలను ఖండించిన వైట్ హౌజ్**

కాల్పుల విరమణ చర్చల కోసం యుఎస్, ఇరాన్ ఇస్లామాబాద్‌లో చర్చలు జరుపనున్న నేపథ్యంలో ఖతార్‌లో, ఇతర సంస్థలలో ఫ్రీజ్ చేసిన ఇరానియన్ నిధులను విడుదల చేసేందుకు అమెరికా అంగీకరించిందన్న వార్తలను శనివారం వైట్ హౌజ్ తిరస్కరించింది. హొర్ముజ్‌లో రవాణా హామీల కోసం ఈ చర్య చేపట్టనున్నట్టు ఇరాన్ కు చెందిన కొన్ని వర్గాలు పేర్కొన్నాయి. ఈ ఆరు బిలియన్ డాలర్లను 2018లో ఫ్రీజ్ చేసి, 2023లో కొద్దికాలం విడుదల చేసినప్పటికీ, అక్టోబర్ 7న హమాస్ దాడుల తర్వాత తిరిగి ఫ్రీజ్ చేశారు.

## ఒప్పందం కుదరకపోతే ఇరాన్‌ను పేల్చివేస్తాం

మొదటి పేజీ తరువాయి

ఇరానియన్ల వద్ద కార్డులేం లేవని, అంతర్జాతీయ జలమార్గాల ద్వారా ప్రపంచం నుంచి బలవంతపు వసూళ్లను మాత్రమే చేయగలదని ట్రూత్ సోషల్ లో పోస్ట్ చేశారు. వారు నేడు సజీవంగా ఉన్నారంటే సంప్రదింపులకు మాత్రమే అని ట్రంప్ పేర్కొన్నారు.

**చర్చల గురించి సానుకూలంగా ఉన్న వాన్స్**

ఇరాన్ అధికారులతో పాకిస్తాన్‌లో ఉన్నత స్థాయి చర్చల కోసం యుఎస్ ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ బయలుదేరిన తర్వాత ట్రంప్ వ్యాఖ్యలు వెలువడ్డాయి. ఈ చర్చలు సానుకూల ఫలితాన్ని ఇస్తాయని తాను నమ్ముతున్నట్టు బయలుదేరే ముందు ఆయన పేర్కొన్నారు. కానీ, యుఎస్‌తో ఇరాన్ ఆడుకునే ప్రయత్నం చేస్తే, సంప్రదింపుల బృందం అంత సానుకూలంగా ఉండదని స్పష్టం చేశారు.

**ఘలీబాఫ్ హెచ్చరిక** : ఇలా ఉండగా, లెబనాన్‌తో కాల్పుల విరమణకు, జప్తు చేసిన ఇరాన్ ఆస్తుల విడుదలను అమలు చేయవలసి ఉందని, దీనిపై పరస్పర అంగీకారం కుదిరిందని ఇరాన్ పార్లమెంటు స్పీకర్ మహమ్మద్ బఘేర్ ఘలీబాఫ్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు చర్చలు ప్రారంభమయ్యే ముందే ఈ రెండు విషయాలను నెరవేర్చాలని అన్నారు. ఇజ్రాయెల్, హిజ్బుల్లా మధ్య దాడులు కొనసాగుతున్న నేపథ్యంలోనూ, హొర్ముజ్ జలసంధిపై ఇరాన్ నియంత్రణ కొనసాగుతున్న క్రమంలో చర్చలు జరుగుతున్నాయి. లెబనాన్‌పై దాడులను ఇజ్రాయెల్ ఆపనంత వరకూ చర్చలు జరగవని ఇరాన్ నొక్కి చెప్పింది. వచ్చేవారంలో ఇజ్రాయెల్, లెబనాన్ మధ్య చర్చలు జరగనున్నాయి. ఇస్లామాబాద్‌లోని కీలక ప్రాంతాలను చర్చల ముందు లాక్ డౌన్ చేశారు. ప్రతినిధి బృందాలు విమానాశ్రయం నుంచి నగరానికి వచ్చే మార్గాలంతా బారికేడ్లను నెలకొల్పారు.

**హొర్ముజ్ జలసంధి పరిస్థితి** : సంఘర్షణ ప్రారంభమయ్యే ముందు ఈ జలసంధి ద్వారా వందకు పైగా నౌకలు ఆసియాకు చమురు మోసుకువెళ్లేవి. కాల్పుల విరమణ ప్రకటించిన తర్వాత కూడా 12 మాత్రమే దాని ద్వారా వెళ్లాయి.

ఈ విషయమైన ట్రంప్ తన సోషల్ మీడియా వేదికపై ఇరాన్ హొర్ముజ్ జలసంధి గుండా చమురు వెళ్లేందుకు అనుమతించడం లేదని, తమ మధ్య ఉన్న అంగీకారం అది కాదని పేర్కొన్నారు.

# వాట్సాప్ ద్వారా పౌర సేవలు

మొదటి పేజీ తరువాయి

సేవలు అవసరమైన వారు తమ ఫోన్లలో 8096958096 నంబర్‌ను సేవ్ చేసుకుని.. వాట్సాప్‌లో 'హాయ్' అని మెసేజ్ పంపడం ద్వారా ఈ సేవలను ప్రారంభించవచ్చు. ఇందులో ప్రధానంగా రిజిస్ట్రేషన్ పత్రం సర్టిఫైడ్ కాపీ, ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్, స్టాంపుల కొనుగోలు, ఫ్రాంకింగ్, డెఫిసిట్ చెల్లింపులు, సొసైటీలు, ఫర్మ్‌ల రిజిస్ట్రేషన్, అపరాధ రుసుం చెల్లింపు, సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తులు వంటివి అందుబాటులో ఉంటాయి.

**ఆన్ లైన్ లోనే రుసుము..** వాట్సాప్‌లో కావలసిన సేవను ఎంచుకుని, అవసరమైన ఫామ్ నింపిన తర్వాత ఆన్‌లైన్ ద్వారానే రుసుము చెల్లించవచ్చు. సర్టిఫైడ్ కాపీలకు సంబంధించి, అధికారులు ఆమోదం తెలిపిన వెంటనే ఆ పత్రాలు నేరుగా వాట్సాప్‌కే అందుతాయి. ఈసీని మీసేవ కేంద్రాల నుండి పొందవచ్చు. స్టాంప్స్, పెనాల్టీ చెల్లించిన వారు సంబంధిత పత్రాలను సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్వీకరించవచ్చునని అధికారులు తెలిపారు. ఈ సరికొత్త విధానం వల్ల సమయం ఆదా అవ్వడమే కాకుండా రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో రద్దీ కూడా తగ్గనుంది.

**యూజర్ ఛార్జీలు పెంపు..**


మీసేవ కేంద్రాల్లో యూజర్ ఛార్జీలను భారీగా పెంచుతూ తెలంగాణ ప్రభుత్వం ఇటీవల నిర్ణయం తీసుకుంది. ఐటీ శాఖ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం.. గతంలో రూ. 35 ఉన్న కనీస సర్వీస్ ఛార్జీని రూ. 62కు పెంచారు. ముఖ్యంగా విద్యార్థులకు అవసరమయ్యే కుల, ఆదాయ, నివాస ధృవీకరణ పత్రాల ధరలను రూ. 80కి పెంచడం గమనార్హం. అలాగే జనన ధృవీకరణ పత్రం ప్రింట్‌కు రూ. 62 వసూలు చేస్తున్నారు. పెరిగిన ఈ ధరలు ఏప్రిల్ 1 నుంచే అమలులోకి వచ్చాయి. విద్యా ప్రవేశాలు, ఉద్యోగ నోటిఫికేషన్ల సమయంలో ఈ పత్రాలు తప్పనిసరి కావడంతో.. తాజా పెంపు పేద, మధ్యతరగతి విద్యార్థులపై తీవ్ర ఆర్థిక భారాన్ని మోపనుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# నవ్వుల పాలు కావొద్దు

**జీవన్ రెడ్డికి టీపీసీసీ చీఫ్ సూచన**

**తన నిర్ణయం వెనక్కి తీసుకుంటేనే రాజకీయ భవిష్యత్తు**

**కేసీఆర్ అవినీతిపై పోరాటం చేసి ఆయన పక్కనే కూర్చున్నరు**



**హైదరాబాద్, ఏప్రిల్ 11 (వుదయం ప్రతినిధి)** : ఇన్నేళ్లుగా కేసీఆర్ అవినీతిపై పోరాటం చేసిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జీవన్ రెడ్డి.. ఇప్పుడు అదే కేసీఆర్ పక్కన కూర్చోవడాన్ని చూసి జనం నవ్వుకుంటున్నారని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ చెప్పారు. ఇలాంటి నవ్వుల పాలయ్యే పనులు జీవన్ రెడ్డి స్థాయికి తగవని వ్యాఖ్యానించారు. శనివారం గాంధీభవన్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. జీవన్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీలో ఎప్పుడూ సముచిత గౌరవం దక్కిందన్నారు. జీవన్ రెడ్డి పార్టీ వీడినప్పటికీ ఆయనపై తమకు ఇంకా గౌరవం ఉందన్నారు.. కేవలం స్థానికంగా ఉన్న చిన్నపాటి సమస్యల కారణంగా దశాబ్దాల అనుబంధం ఉన్న పార్టీని వీడటం సరికాదని ఆయన హితవు పలికారు. తాను తీసుకున్న నిర్ణయంపై జీవన్ రెడ్డి పునరాలోచన చేయాలని కోరారు. తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటే పార్టీకి, ఆయన రాజకీయ భవిష్యత్తుకు మంచిదని సూచించారు.



# గ్రేటర్ హైదరాబాద్



## పూలే సేవలు చిరస్మరణీయం

**తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు కాసాని వీరేష్**



**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 11 (వుదయం ప్రతినిధి) :** మహిళా విద్యా, వికాసం, అణగారిన వర్గాల అభివృద్ధి కొరకు పోరాడిన గొప్ప సంఘ సంస్కర్త జ్యోతిరావు పూలే 199వ జయంతి వేడుకలు బాచుపల్లి, నిజాంపేట్ తదితర ప్రాంతాలలో కాసాని యువ సేన, సాయి నగర్ లో బిఆర్ఎస్ అధ్యక్షులు ఎండీ జహంగీర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు కాసాని వీరేష్ ముదిరాజ్ హాజరై జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా జయంతి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతికి, విద్యా విస్తరణకు పూలే చేసిన సేవలు చిరస్మరణీయమని, వారు చూపిన మార్గంలో నేటి యువత పయనించి విద్యా, సమాన హక్కుల కోసం కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ ఆర్గనైజషన్ సెక్రటరీ సాంబా శివారెడ్డి, సీనియర్ నాయకులు సత్యనారాయణ, వెంకటేష్, శ్రీనివాస్ చారి, ఎండీ సలీం, జలగం చంద్రయ్య, రామ్ నర్సయ్య, రాజు, నర్సింగ్ రావు, నరేందర్, మహిళా నాయకులు భారతి, కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

## గోడ పత్రిక ఆవిష్కరణ




**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 11 (వుదయం ప్రతినిధి) :** దుండిగల్ మున్సిపల్ పరిధిలోని గండి మైసమ్మ బస్తీలో ఈనెల 18 శనివారం సాయంత్రం 6 గంటలకు జరుగనున్న హిందూ సమ్మేళన కార్యక్రమానికి సంబంధించిన గోడ పత్రిక, కరపత్రాలను మండ్ల మహేందర్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని శ్రీ భక్తాంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలో కమిటీ సభ్యులు కాలనీ వాసుల సమక్షంలో ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి గోడ పత్రిక ఆవిష్కరణ చేసారు. ఈ సందర్భంగా మహేందర్ రెడ్డి మాట్లాడుతూ హిందూ బంధువులు భారీగా కార్యక్రమానికి హాజరై హిందూ సమ్మేళనం కార్యక్రమాన్ని దిగ్విజయం చేయవలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బి.నవీన్ రెడ్డి, శ్రీకాంత్ యాదవ్, పి.గోపి గౌడ్, డి.శ్రీనివాస్, బి హేమంత్ రెడ్డి, జి. మోహన్ రెడ్డి, టి సంతోష్‌కుమార్, బి.సంతోష్‌రెడ్డి, హరిప్రసాద్ రాజు, అక్కిరెడ్డి, సుదర్శన్ చారి, బుచ్చయ్య, ఆచార్య, శ్రీ భక్తాంజనేయస్వామి ప్రధాన అర్చకులు జి.ఆర్.కిరణ్ స్వామి, బి తిరుపతిరెడ్డి, బస్తీ వాసులు పాల్గొన్నారు.

## పూలే దీనజనుల జీవితాల్లో వెలుగు నింపిన మహానుభావుడు

**శంకర్‌పల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ సాతా ప్రవీణ్ కుమార్**



**శంకర్‌పల్లి, ఏప్రిల్ 11 (వుదయం) :** సామాజిక అసమానతలను రూపుమాపి బడుగు బలహీన వర్గాల జీవితాల్లో వెలుగు నింపిన మహానుభావుడు మహాత్మా జ్యోతిబా పూలే అని శంకర్‌పల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ సాతా ప్రవీణ్ కుమార్ అన్నారు. శనివారం శంకర్‌పల్లి మున్సిపల్ కార్యాలయంలో జ్యోతిబా పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయ ప్రాంగణాన్ని ప్రత్యేకంగా అలంకరించి పూలే చిత్రపటాన్ని ఏర్పాటు చేశారు. చైర్‌పర్సన్ ప్రవీణ్ కుమార్ పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కౌన్సిలర్లు, అధికారులు, మున్సిపల్ సిబ్బంది కూడా పూలే చిత్రపటానికి పూలు సమర్పించి ఘనంగా స్మరించారు. ఈ వేడుకలు ఉత్సాహంగా కొనసాగడంతో మున్సిపల్ కార్యాలయం పరిసర ప్రాంతం మొత్తం పూలే నినాదాలతో మార్మోగింది. చైర్‌పర్సన్ మాట్లాడుతూ జ్యోతిబా పూలే ఒక వ్యక్తి మాత్రమే కాదని, సామాజిక విప్లవానికి ప్రతీక అని పేర్కొన్నారు. కార్యక్రమంలో శంకర్‌పల్లి ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రకాష్, నాయకులు పార్శి బాలకృష్ణ, జూలకంటి పాండురంగారెడ్డి, మున్సిపల్ మేనేజర్ అంజన్ కుమార్, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్ చంద్రమౌళి, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పూలే ఆశయాలే సమాజానికి పునాది

**లిటిల్ స్టార్స్ హై స్కూల్ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు**




**శంకర్‌పల్లి, ఏప్రిల్ 11 (వుదయం) :** శంకర్‌పల్లి పట్టణంలోని ప్రధాన కూడలి అయిన శంకర్‌పల్లి చౌరస్తాలో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను స్థానిక లిటిల్ స్టార్స్ హై స్కూల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజలు చౌరస్తాలో చేరి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు పూలే ఆశయాలను ప్రతిబింబించే నినాదాలు చేస్తూ సమాజంలో సమానత్వం ప్రాధాన్యతను చాటారు. సభా ప్రాంగణంలో పూలే జీవిత చరిత్రను వివరించే సందేశాలను ప్రదర్శించారు. విద్యార్థులు, యువత పెద్ద ఎత్తున పాల్గొనడంతో వేడుకలు మరింత వైభవంగా మారాయి. పూలే జయంతి వేడుకలు పట్టణ ప్రజల్లో సామాజిక చైతన్యాన్ని మరింత పెంచేలా జరిగాయని పలువురు అభిప్రాయపడ్డారు. పాఠశాల కరెస్పాండెంట్ సంజిత్ కుమార్ మాట్లాడుతూ పూలే దేశ చరిత్రలో అత్యంత గొప్ప సామాజిక సంస్కర్తగా నిలిచారని పేర్కొన్నారు. ఆయన అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలన కోసం తన జీవితాన్ని అంకితం చేశారని తెలిపారు. కార్యక్రమంలో సిఐ మీర్ ముద్దసర్ అలీ, ఎస్ ఐ మంజుల, పాఠశాల కరెస్పాండెంట్ సంజిత్ కుమార్, మాజీ కౌన్సిలర్ శ్రీనాథ్, బిఆర్ఎస్ నాయకుడు శశిధర్ రెడ్డి, ప్రేమ్ కుమార్, ఉపాధ్యాయుడు ఆనంద్ కుమార్‌తో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## కారుణ్య వెల్ఫేర్ సొసైటీ సేవలు

# అభినందనీయం


**బిజెపి ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కాంతి కిరణ్**



**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 11 (వుదయం ప్రతినిధి) :** కారుణ్య వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో పేదల కోసం చేస్తున్న సేవా కార్యక్రమాలు ఎంతో అభినందనీయమని బిజెపి ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కాంతి కిరణ్ అన్నారు. కారుణ్య వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకులు, బిజెపి ఎస్సీ మోర్చా రాష్ట్ర నాయకులు డాక్టర్ దాసి నాగరాజు ఆధ్వర్యంలో నిజాంపేట్ సర్కిల్ హనుమాన్ టెంపుల్ సమీపంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కాంతి కిరణ్ చలివేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేసవిలో బాటసారుల దాహార్తిని తీర్చేందుకు ఈ చలివేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుందని, తాగు నీటితో పాటు మజ్జిగ కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. డాక్టర్ దాసి నాగరాజు కారుణ్య వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేస్తూ ఇటు బిజెపి పార్టీలో కార్యకర్తలను, నాయకులను కలుపుకొని ప్రజా సమస్యలపై పోరాడుతూ క్రియాశీలకంగా పనిచేస్తున్నారని దాసి నాగరాజును ఎస్సీ మోర్చా అధ్యక్షులు కాంతి కిరణ్ అభినందించారు. డాక్టర్ దాసి నాగరాజు సేవలను బిజెపి పార్టీ తప్పక గుర్తిస్తుందని, కష్టపడి పనిచేసే నాయకులకు బిజెపి పార్టీ ఆదరించి భవిష్యత్తులో ఎదుగుదలకు తోడ్పడుతుందన్నారు. అనంతరం డాక్టర్ దాసి నాగరాజు మాట్లాడుతూ తనకు తోచిన విధంగా ప్రజాసేవ చేసేందుకు ముందు వరుసలో ఉంటానని, ప్రేమే తన ధర్మం అని, సేవే తన మార్గం అని దాసి నాగరాజు పేర్కొన్నారు. పిల్లల ప్రేమానురాగాలకు దూరమైన వృద్ధులకు త్వరలోనే ఒక వృద్ధాశ్రమాన్ని నెలకొల్పనున్నట్లు డాక్టర్ దాసి నాగరాజు వెల్లడించారు. ఈ కార్యక్రమం అనంతరం మహాత్మ జ్యోతిబా పూలే 199వ జయంతి సందర్భంగా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించి పూలే సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర సీనియర్ నాయకులు కొలన్ లీడర్ నర్సింహారెడ్డి, బిజెపి మున్సిపల్ సెల్ కో కన్వీనర్ రావుల శేషగిరిరావు, మేడ్చల్ అర్బన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గిరి వర్ధన్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు గరిగ శేఖర్, బిజెపి అసెంబ్లీ ఇన్చార్జి జెకె శేఖర్ యాదవ్, నిజాంపేట్, బాచుపల్లి, ప్రగతినగర్ శాఖల బిజెపి అధ్యక్షులు బిక్షపతి యాదవ్, ప్రసాద్ రాజు, నరేంద్ర చౌదరి, మాజీ కార్పొరేటర్ విజయలక్ష్మి వెంకట సుబ్బారావు, నిజాంపేట్ సర్కిల్ నాయకులు సుమన్ రావు, రచ్చ చక్రధర్, పద్మ ప్రసాద్, గజ్జెల్లి సంతోష్, రంపం కాశి, కాసాని సంతోష్, కట్ట కుమార్, సదానందం, యాదగిరి, సౌరవ్, భార్గవి తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యలపై ఫోకస్

**స్థానికులకు ప్రాధాన్యత ఇవ్వాలని లేబర్ సెల్ నేతల డిమాండ్**



**చేవెళ్ల, ఏప్రిల్ 11 (వుదయం) :** చేవెళ్ల నియోజకవర్గంలో శనివారం కార్మికుల సమస్యలపై కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రత్యేక దృష్టి సారించారు. లేబర్ సెల్ జనరల్ సెక్రటరీ భనూరి శివ శంకర్, ఏ బ్లాక్ అధ్యక్షుడు ముక్కు రవి కుమార్ షాబాద్ మండలంలోని పలు కంపెనీలను సందర్శించి కార్మికుల పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా కంపెనీ అధికారులతో సమావేశమై కార్మికుల హక్కులు, సంక్షేమానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ముఖ్యంగా స్థానికులకు ఉద్యోగాల్లో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని నేతలు స్పష్టం చేశారు. బయట ప్రాంతాల వారికంటే స్థానిక నిరుద్యోగులకు అవకాశాలు కల్పించాలనే అభిప్రాయాన్ని వారు వ్యక్తం చేశారు. అలాగే కంపెనీల్లో పనిచేస్తున్న కార్మికులకు చట్టపరంగా అందాల్సిన వేతనాలు, సదుపాయాలు, భద్రతా ప్రమాణాలు అమలు చేస్తున్నారా అనే విషయాన్ని అధికారులు వద్ద విచారించారు. కార్మికులకు కల్పించాల్సిన బెనిఫిట్స్, హక్కులపై వారికి అవగాహన కల్పిస్తూ, ఎలాంటి అన్యాయం జరిగినా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్మికుల సంక్షేమమే తమ ప్రధాన లక్ష్యమని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలు కొనసాగిస్తూ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని వారు హామీ ఇచ్చారు.

## మహనీయుల విగ్రహాల ఆవిష్కరణ

**చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య**



**చేవెళ్ల, ఏప్రిల్ 11 (వుదయం) :** చేవెళ్ల మండల పరిధిలోని తంగడపల్లి గ్రామంలో మహనీయుల విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. శుక్రవారం రాత్రి నిర్వహించిన ఈ కార్యక్రమానికి చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య ముఖ్య అతిథిగా హాజరై జ్యోతిరావు పూలే, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలను స్థానిక నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ మహనీయుల జీవితాలు సమాజానికి మార్గదర్శకాలని, వారి ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అనంతరం విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు జేబీ రాజు, చేవెళ్ల మున్సిపల్ చైర్పర్సన్ సమతా వెంకటరెడ్డి, గ్రామ సర్పంచ్ రాములు, దళిత రత్న అవార్డు గ్రహీత బురాన్ ప్రభాకర్, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు బ్యాగరి రాజు, చేవెళ్ల మున్సిపల్ బిజెపి అధ్యక్షుడు అత్తిలి అనంతరెడ్డి, బిజెపి యువ నాయకుడు వైభవ్ రెడ్డి పాల్గొన్నారు. మండల స్థాయి నాయకులు, తంగడపల్లి అంబేద్కర్ సంఘం సభ్యులు మరియు గ్రామ ప్రజలు భారీ సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## జ్యోతిరావు పూలే విగ్రహానికి నివాళులు

**ఎమ్మెల్యే కాలే యాదయ్య..**




**శంకర్‌పల్లి, ఏప్రిల్ 11 (వుదయం) :** శంకర్‌పల్లి మున్సిపాలిటీ కేంద్రంలో మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా శనివారం ఘనంగా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక శాసనసభ్యులు కాలే యాదయ్య మున్సిపాలిటీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం పూలే విగ్రహం వద్ద ప్రత్యేకంగా నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని పూలే చేసిన సేవలను స్మరించారు. జయంతి కార్యక్రమం సందర్భంగా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని పూలే ఆశయాలను కొనియాడారు. కార్యక్రమ ప్రాంగణం మొత్తం పూలే నినాదాలతో మార్మోగుతూ ఉత్సాహంగా సాగింది. ప్రజల్లో సామాజిక సమానత్వ భావనను మరింత బలపర్చేలా ఈ వేడుకలు నిర్వహించారని పలువురు తెలిపారు. ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ మహాత్మ జ్యోతిరావు పూలే దేశ సామాజిక విప్లవానికి మార్గదర్శకుడని పేర్కొన్నారు. సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం, అంటరానితనం నిర్మూలన కోసం, సమానత్వం కోసం ఆయన చేసిన పోరాటం చిరస్మరణీయమని తెలిపారు. కులవ్యవస్థ, వివక్షత ఉన్న కాలంలో ధైర్యంగా ముందుకు వచ్చి ప్రజల్లో చైతన్యం నింపిన మహానుభావుడు పూలే అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్స్ హాల్‌టికెట్లు విడుదల

**చేవెళ్ల, ఏప్రిల్ 11 (వుదయం) :**




తెలంగాణ రాష్ట్రంలోని మోడల్ స్కూళ్లలో (టిఎస్ ఎం ఎస్) 2026 27 విద్యా సంవత్సరానికి గాను 6వ తరగతి మరియు 7 నుండి 10 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీకి నిర్వహించనున్న ప్రవేశ పరీక్ష హాల్‌టికెట్లు విడుదలైనట్లు ఇంచార్జ్ ప్రిన్సిపాల్ వినోద్ కుమార్ తెలిపారు. అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్‌లో హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. పరీక్ష తేదీ: 19 ఏప్రిల్ 2026 (ఆదివారం) పరీక్ష సమయాలు 6వ తరగతి: ఉదయం 10:00 నుండి మధ్యాహ్నం 12:00 వరకు 7 నుండి 10 తరగతులు: మధ్యాహ్నం 02:00 నుండి సాయంత్రం 04:00 వరకు

**హాల్‌టికెట్ డౌన్‌లోడ్ విధానం:**
అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలి: https://telanganams.cgg.gov.in/TGMSWEB20/# రిజిస్ట్రేషన్ నంబర్ / పుట్టిన తేదీ / మొబైల్ నంబర్ నమోదు చేయాలి హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసి ప్రింట్ తీసుకోవాలి

**ముఖ్య గమనిక**
పరీక్ష కేంద్రానికి హాల్‌టికెట్‌తో పాటు ఒరిజినల్ ఐడెంటిటీ కార్డ్ తీసుకువెళ్లడం తప్పనిసరి అని అధికారులు సూచించారు.

## సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ




**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 11 (వుదయం ప్రతినిధి ) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి రాష్ట్ర మంత్రివర్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా శస్త్ర చికిత్స నిమిత్తం ఆర్థిక సహాయం మంజూరు చేయించి బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో లబ్ధిదారులు చింతల్ వాసులు వేముల లక్ష్మమ్మ కు రూ. 60,000/, గాయం సుస్మిత రెడ్డికి రూ. 60,000/, రంగనగర్ కాలనీ చింతల్ వాసులు నాగరాజుకు రూ.60,000/, కూకట్ పల్లి వాసులు గోంగుల రాజుకు రూ. 56,500/, బాచుపల్లి వాసులు, కొర్ర సునీత రాణికి రూ. 47,500/, సీఎం సహాయనిధి చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా హన్మంతన్న మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పేద ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందని, అనారోగ్యం బారిన పడిన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా పూలే జయంతి వేడుకలు



**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 11 (వుదయం ప్రతినిధి ):** నిజాంపేట్ సర్కిల్, రాజీవ్ గాంధీ నగర్‌లో జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నిజాంపేట్ సర్కిల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కోలన్ రాజశేఖర్ రెడ్డి హాజరై జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా జయంతి నివాళులు అర్పించారు. వారి సేవలను స్మరిస్తూ సమాజంలోని అణగారిన వర్గాల అభ్యున్నతికి మహిళా విద్య వికాసానికి ఆయన చేసిన కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో విష్ణు, సాయిరాజ్, షకీల్, శివ, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.

## బండ్లగూడ ప్రశాంత్‌కు సన్మానం



**శంకర్‌పల్లి, ఏప్రిల్ 11 (వుదయం)**

జ్యోతిబాపూలే జయంతి సందర్భంగా శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డు కౌన్సిలర్ బండ్లగూడ ప్రశాంత్‌ను ప్రేమరు స్కూల్ టీచర్స్, ఆశా వర్కర్లు, అంగన్వాడి టీచర్లు ఘనంగా సన్మానించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం ఎంతో ఉత్సాహంగా, ఆత్మీయ వాతావరణంలో నిర్వహించారు. ప్రజలకు నిరంతరం సేవలు అందిస్తూ సమస్యల పరిష్కారంలో ముందుంటున్న కౌన్సిలర్ ప్రశాంత్‌ను అభినందిస్తూ పుష్పగుచ్ఛాలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. జ్యోతిబాపూలే జయంతి రోజున సన్మానం చేయడం విశేషంగా నిలిచింది. సమాజ సేవ, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేసే నాయకులకు ఇటువంటి గౌరవాలు మరింత ప్రోత్సాహాన్ని ఇస్తాయని పలువురు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రేమరు స్కూల్ ఉపాధ్యాయులు మాట్లాడుతూ వార్డు అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంలో కౌన్సిలర్ ప్రశాంత్ కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా పాఠశాలలు, విద్యార్థుల అవసరాలు, గ్రామీణ ప్రజల సమస్యలపై వెంటనే స్పందిస్తూ అందుబాటులో ఉండటం అభినందనీయమని అన్నారు. అలాగే ఆశా వర్కర్లు, అంగన్వాడి టీచర్లు మాట్లాడుతూ ప్రజారోగ్య కార్యక్రమాలు, మహిళా సంక్షేమ అంశాల్లో కౌన్సిలర్ సహకారం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. బండ్లగూడ ప్రశాంత్ మాట్లాడుతూ తనపై చూపిన అభిమానానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాసేవే తన లక్ష్యమని, వార్డులోని ప్రతి ఒక్కరి సమస్య తన సమస్యగా భావించి పరిష్కరించేందుకు కృషి చేస్తానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పలువురు స్థానికులు, మహిళలు, వార్డు ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## పూలే ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

**బురాన్ ప్రభాకర్**

**చేవెళ్ల, ఏప్రిల్11(వుదయం) :** మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని దళితరత్న అవార్డు గ్రహీత బురాన్ ప్రభాకర్ పిలుపునిచ్చారు. మహాత్మా జ్యోతిరావు పూలే 200వ జయంతి సందర్భంగా చేవెళ్ల అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో స్థానికంగా ఉన్న పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బురాన్ ప్రభాకర్ మాట్లాడుతూ... సమాజంలో కులవివక్ష, అసమానతల నిర్మూలనకు పూలే చేసిన సేవలు అపారమని పేర్కొన్నారు. భారతదేశంలో ప్రముఖ సంఘ సంస్కర్తలలో ఆయనకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పూలే చేసిన కృషి ఆదర్శప్రాయమని కొనియాడారు. మహనీయుల సేవలు నేటి తరంతో పాటు రాబోయే తరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొంటూ, యువత మహనీయుల అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలిండియా అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షులు బ్యాగరి ప్రభాకర్, సమతా సైనిక్ దళ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏర్పుల మల్లేష్, జిల్లా అధ్యక్షులు మాచన్ పల్లి రామస్వామి, ఆలిండియా అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షుడు మల్లెపల్లి శ్రీనివాస్, సీనియర్ పాత్రికేయులు కడమంచి ఆనంద్, మల్లేష్, అంబేద్కర్ సంఘం సభ్యులు సున్నపు రమేష్ రవీందర్, సామెల్, షరీఫ్ నాయకులు ప్రభులింగం తదితరులు ఉన్నారు.



**IN THE COURT OF THE HON'BLE XIX JUNIOR CIVIL JUDGE,CITY CIVIL COURT AT: HYDERABAD**
**O.S. No. 852 OF 2026**
**Between:**
Kuthadi Deepthi & others ...**Plaintiff**
**AND**
MRO Saidabad & anr ...**Defendants**
**NOTICE**
To
**Defendant No. 2**
All Concerned
Please take notice that the above-named Plaintiffs have filed the above Legal heir Suit seeking for Declaration of Legal Heirs Late Dasari Narasimhulu died on 07.10.2000 and Late Dasari Vasantha died on 15.05.2013 and the same is posted on **27.04.2026** for the appearance of the parties who intend to raise objections, if any, for the above claim, therefore, you are hereby requested to make it appear on **27.04.2026** at 10.30 am either by yourself or through your counsel before the Hon'ble XX Junior Civil Judge, City Civil Court at Hyderabad, failing which, the matter will be heard and decided in accordance with law.
**(BY ORDER OF THE COURT)**
Sd/-
**ABHISHEK AGARWAL**
**Advocates**
**# 3-6-305/8, 1st Floor, Avanthinagar, Basheerbagh, Hyderabad-29**
**Cell: 9000111069704829022, 9010268633**

**IN THE COURT OF THE HON'BLE V JUNIOR CIVIL JUDGECITY CIVIL COURT: HYDERABAD**
**O.S. NO. 967 OF 2026**
**Between:**
Smt. Atluri Nagamalleswary & Anr ...**Plaintiff**
**AND**
Mandal Revenue Officer & Anr ...**Defendants**
**NOTICE**
To
**Defendant No. 2**
All Concerned
Please take notice that the above-named Plaintiffs have filed the above Legal heir Suit seeking for Declaration of Legal Heirs of Sri. Bollepalli Rama Chandra Rao died on 30.11.2019 and Smt. Bollepalli Anurdha died on 10.05.2023 and the same is posted on **07.05.2026** for the appearance of the parties who intend to raise objections, if any, for the above claim, therefore, you are hereby requested to make it appear on **07.05.2026** at 10.30 am either by yourself or through your counsel before the Hon'ble V Junior Civil Judge, City Civil Court at Hyderabad, failing which, the matter will be heard and decided in accordance with law.
**(BY ORDER OF THE COURT)**
Sd/-
**M/s. CHANDRASEN LAW OFFICES**
**ABHISHEK AGARWAL**
**Advocates**
**# 3-6-305/8, 1st Floor, Avanthinagar, Basheerbagh, Hyderabad-29**
**Cell: 9000111109704829022, 9010268633**



వాషింగ్టన్‌తో పాకిస్తాన్‌కు ఎలాంటి సంబంధం ఉందో మీకు తెలుసా? పాకిస్తానీ ప్రధాని ట్వీట్‌ను వాషింగ్టన్ రాసిందనే ఆరోపణలు ఉన్నాయి. ఎందుకంటే, దానిపై డ్రాఫ్ట్ ఫర్ పాకిస్తాన్ పిఎం అని ఉంది.మీరో, నేనో భారత ప్రధానమంత్రి కోసం ఏదైనా రాస్తే, దాని పై డ్రాఫ్ట్ ఫర్ ఇండియాస్ పిఎం అని దానిపై రాస్తామా? పైగా ఉపయోగించిన భాష కూడా వాషింగ్టన్ భాషే. అందులో కొన్ని పదబంధాలు అంతకు కొన్ని గంటలకు ముందు డొనాల్డ్ ట్రంప్ ఉపయోగించినవి. వాషింగ్టన్‌తో పాక్ పోషించినటువంటి పాత్రను కేవలం పాకిస్తాన్ మాత్రమే పోషించగలదు.

* – శశి థరూర్, కాంగ్రెస్ ఎంపీ


## వేమన పద్యం

**నీళ్లలోన బీను నెరమాంస మాశించి**

**గాలమందు జిక్కు కరణి భువిని**

**ఆశదగిలి నరుడు అలాగే చెడిపోవు**

**విశ్వదాభిరామ! వినురవేమ**



## సంపాదకీయం

# చల్లబడిన ఉపకోటా డిమాండ్

చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి ఉద్దేశించిన నారీ వందన్ చట్టం అమలును ముందుకు తీసుకురావడం,లోక్ సభ నియోజకవర్గాల పునర్విభజనను కూడా వెంటనే జరిపించబోవడంపై ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ పార్టీ సమాలోచనలు, మంతనాలు సాగిస్తున్నది.తన పూర్వ ధోరణికి స్వస్తి చెప్పి సామాజిక న్యాయం వైపు మళ్ళిన కాంగ్రెస్ పార్టీ మహిళల రిజర్వేషన్ల విషయం లో అంతిమంగా ఎటువంటి వైఖరి తీసుకుంటుంది అనేదానికి సమాధానం ఆసక్తిగా ఎదురుచూడదగినది. వాస్తవానికి 2026 జనగణన పూర్తి అయిన తర్వాత అందులో తేలే జనాభా ప్రకారం జరగవలసిన ఈ ప్రక్రియలను ముందుగానే జరిపించడానికి నిర్ణయించడంలో ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లో లబ్ధి పొందాలనే బిజెపి కుట్ర స్పష్టంగా కనిపిస్తున్నదని ప్రతిపక్షాలు ఇప్పటికే విమర్శిస్తు న్నాయి .ఇంకొకవైపు జనగణన బట్టి కాకుండా చట్టసభల్లో ప్రస్తుతమున్న స్థానాలను అన్ని రాష్ట్రాలలో ఒకేవిధంగా 50 శాతం పెంచాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించినట్టు ఇప్పటికే విశేష ప్రచారం జరిగింది. ఇలా చేయడం వల్ల లోక్ సభలో పెద్ద రాష్ట్రాల బలం అపరిమితంగా పెరిగిపోయి జాతీయ పరిణామాల్లో చిన్న రాష్ట్రాల నిర్ణయ పాత్ర బలహీనపడుతుందని, తగ్గిపోతుందనే విమర్శ కాంగ్రెస్ నుంచి బలంగా వింటున్నాము.చిన్న రాష్ట్రాలకు తగిన రక్షణలు కల్పించకపోతే జాతీయ స్థాయిలో వాటి మాట వినే నాథులే ఉండరనే భయాలను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వంటివారు వాదిస్తున్నారు.ఇందులో వాస్తవాలున్నాయి. అయితే మహిళల రిజర్వేషన్ల విషయంలో గతంలో ఒకప్పుడు దిక్కులు పిక్కటిల్లేలా వినిపించిన ఒక స్వరం ఇప్పుడు అంత గట్టిగా చెవులకు సోకడం లేదు. మహిళల కోటా బిల్లును చట్టం చేయించడానికి 1996 నుంచి 2023 వరకు కాంగ్రెస్ హయాంలో ప్రయత్నించినప్పుడు ఆర్ జె డి అధినేత లాలూ ప్రసాద్ యాదవ్, సమాజ్ వాది పార్టీ అగ్ర నేత ములాయం సింగ్ యాదవ్ వంటి ఉత్తరాది బి సి దిగ్గజాలు గట్టిగా అడ్డుకున్నారు. మహిళల కోటా లో బిసి ల, మైనారిటీల స్త్రీలకు ఉపకోటా కేటాయించకపోతే అది బాబ్ కాట్ (బాబ్డ్ హెయిర్ ) మహిళల గుత్తాధిపత్యం లోకి వెళ్ళిపోతుందని ఒకే ఇంటిలో పురుష ఎం పి, మహిళ ఎం పి ఉండే పరిస్థితి తలెత్తుతుందని విమర్శిస్తూ ఆ బిల్లును అడ్డుకునే వారు. మహిళలకు కోటా ను తాము వ్యతిరేకించడం లేదని, ఉప కోటా లేకపోతే పేద మహిళలు పార్లమెంటు మెట్లు ఎక్కలేని దుస్థితి తలెత్తుతుందని వారు భావించారు. నారీ వందన్ చట్టం అమలు విధివిధానాల నిర్ణయం కోసం ఈ నెల 16 నుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు జరుగనున్నాయి. ఒక రోజు ముందు కాంగ్రెస్ పార్టీ ఈ విషయమై భేటీ జరుపుతుంది.కాని ఎస్ సి , ఎస్ టి, బి సి , మైనారిటీ మహిళల ఉప కోటా గురించి దాని నోట ఇంతవరకు ఒక్క మాట వినిపించకపోవడం ఆందోళనకరం. వర్తమాన జనాభా సేకరణలో కులాలవారీ గణన కూడా జరగవలసి వుంది.అందుచేత మహిళల కోటా లో ఉప కోటా గురించి ఇప్పుడే పట్టు బట్ట వలసి వుంది.

## రచనలు పంపండి



వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

# ఆందోళనకరంగా సంపద కేంద్రీకరణ

అదానీ, అంబానీ, గూగుల్, అమెజాన్‌లకు ప్రజల సొమ్మును రాయితీల రూపంలో ఇస్తే అత్త సొమ్ము అల్లుడు దానం చేస్తున్నట్లు ఏడవకండి. ఏడ్చి పెడబొబ్బలు పెట్టినా ప్రయోజనం లేదు. ఎప్పటికప్పుడు జనాన్ని ఏమార్చే ఊసరవెల్లులు రంగులనే కాదు, సిద్ధాంతాలను కూడా మార్చివేస్తున్నారు. వాస్తవాలను తలకిందులుగా చూపితే కొందరు తమ మెదళ్లను అలాగే ఉంచుకొని నిజమే అంటారు. సంపద సృష్టికర్తలు జనం. కానీ కొందరు ముందు చెప్పుకున్న కంపెనీల వంటివే సృష్టికర్తలని చెబుతూ వాటికి సర్వం సమర్పించుకుంటున్నారు. దాన్ని సమర్ధించుకొనేందుకు ఊట సిద్ధాంతాన్ని ముందుకు తెచ్చారు.ఈ సిద్ధాంతం ఎప్పుడు వచ్చింది. దోపిడీ పెరిగిపోయి భరించలేని స్థితిలో కార్మికవర్గం, రైతాంగం తిరగబడి రష్యా,చైనా, మరికొన్ని దేశాలలో సోషలిస్టు వ్యవస్థలను ఏర్పాటు చేసుకున్నారు.జనం వాటికి ఆకర్షితులు కావటాన్ని గమనించి 1960దశకంలో ఊట సిద్ధాంతాన్ని ముందుకు తెచ్చారు. సూక్ష్మంలో మోక్షంలా ఒక్క ముక్కలో చెప్పాలంటే సంపదలను పెరగనిస్తే వాటి ఫలాలు క్రమంగా ఊటనీరులా సమాజంలోకి దిగుతాయి.అందరికీ ఉపయోగం. దీన్ని ఎవరైతేనేం మహానుభావులు నరేంద్రమోడీ, చంద్రబాబు నాయుడు,రాహుల్ గాంధీ, రేవంతరెడ్డి, కెసిఆర్, స్టాలిన్, అఖిలేష్ యాదవ్, మాయావతి అండ్‌కో గట్టిగా బలపరుస్తారు. ఎవరెన్ని కబుర్లు చెప్పినా జరుగుతున్నది తద్విరుద్ధంగా ఉంది.

తాజాగా " భారత సంపదల గుర్తింపు నివేదిక 2026 " (వెల్త్ ట్రాకర్ ఇండియా రిపోర్టు 2026) ప్రకారం మనదేశంలో సంపన్నుల్లో అగ్రభాగాన ఉన్న 1,688 మంది సంపద దేశ జిడిపిలో సగానికి సమానం. ఇంత అసమానత, కేంద్రీకరణ బ్రిటీష్ వారి కాలంలోనూ, స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలోనూ లేదు.1980దశకం వరకు కూడా నేడున్నంత తీవ్రంగా లేవు. ఊట సిద్ధాంతం చెప్పటం ప్రారంభించిన తరువాత కిందికి బదులు సంపద పైకి చేరుతున్నది.ఈ 1,688 మంది కలవారి మీద రెండు నుంచి ఆరుశాతం సంపద పన్ను విధిస్తే ఏటా పదిలక్షల కోట్ల రూపాయల వరకు రాబడి వస్తుందని, ఆ మొత్తాన్ని సంక్షేమానికి వినియోగించవచ్చని సెంటర్ ఫర్ ఫైనాన్సియల్ ఎకౌంటబులిటీ -సిఎఫ్ఎ (ఆర్థిక జవాబుదారీతన కేంద్రం) రూపొందించిన సదరు నివేదిక పేర్కొన్నది.ఎప్పటికైనా వామపక్షాలు అధికారానికి వచ్చి పిల్లిమెడలో గంట కట్టాల్సిందే తప్ప మిగిలినవారెవరూ అలాంటి ఆలోచన కూడా చేయరు. మరోవైపు నిధుల కొరత గురించి శ్రీరంగ నీతులు చెబుతారు. ఉదాహరణకు చంద్రబాబు నాయుడు కోట్లాది మంది అసంఘటిత రంగ కార్మికుల వేతనాలు సవరించేందుకు ముందుకు రారు. గూగుల్ వంటి ధనిక సంస్థలకు వేల కోట్ల రూపాయలు రాయితీలుగా ఇచ్చేందుకు తాంబూలాలు ఇచ్చేశారు.రేవంత రెడ్డి బాట కూడా అదే. పన్నెండేండ్ల క్రితం నరేంద్రమోడీ చెప్పిన కబుర్లలో అచ్చేదిన్(మంచి రోజులు ) ఒకటి.దేశంలో మోడీని చూసి ఓట్లు వేసిన ఎవరికైనా ఐదు సంవత్సరాల్లో రాబడి 400 శాతం పెరిగిందా ? మోడీ మద్దతు ఉన్న అంబానీ, అదానీ, జిందాల్,శి



వనాడార, సునీల్ మిట్టల్ వంటి వారికి 2019-25 సంవత్సరాలలో సంపదలు దాదాపు 400శాతం పెరిగాయి.వాటిలోంచి కొంత తీసి ఎన్నికల బాండ్ల రూపంలో వేలాది కోట్ల రూపాయలను బిజెపికి కట్టబెట్టారు.అనధికారికంగా సమర్పించుకున్న మొత్తాలకు లెక్కలేదు.ఎంత డబ్బు లేకపోతే కేరళలోని పాలక్కాడ్‌లో బిజెపి మద్దతుదారులు ఓటుకు ఐదువేల రూపాయలు ఎలా పంచగలిగారు ?

నూతన ఆర్థిక విధానాలకు ఆద్యులం మేమే అని కాంగ్రెస్ గొప్పగా చెప్పుకుంటుంది. వాటిని సమర్ధవంతంగా అమలు చేస్తున్న ఖ్యాతి మాదే అని బిజెపి ఢంకా బజాయించి మరీ బాకా లూదుతున్నది.వందకోట్ల డాలర్ల సంపద కలిగిన శ్రీమంతుడు 1991దేశంలో ఒక్కరే, అలాంటిది ఇప్పుడు 358 మంది ఉన్నారు.నివేదికలో పేర్కొన్న 1,688 మంది సంపద విలువ 166లక్షల కోట్లు, ఇది మన జిడిపిలో దాదాపు సగం. దేశంలోని ఎగువ ఒక శాతం మంది సంపద 2019లో 36.5శాతం ఉండగా 2022 నాటికి 40.1శాతానికి పెరగ్గా ఇదే కాలంలో దిగువ 50శాతం మంది వాటా 6.8 నుంచి 6.4శాతానికి దిగజారింది. అచ్చే దిన్ ఎవరికి ? ఇక వెయ్యి కోట్లకు మించి ఆస్తులున్న వ్యక్తుల సంఖ్య 2019-25 మధ్య 77శాతం పెరగ్గా, వారి సంపద (31లక్షల కోట్ల నుంచి 88లక్షల కోట్లకు) 227శాతం పెరిగింది.వీరిలో అదానీ ఆస్తి 625, ముకేష్ అంబానీ సంపద 153శాతం పెరిగింది.కేంద్ర ప్రభుత్వం వారిపట్ల ఎలాంటి సానుకూలత, అభిమానం చూపకుండానే స్వంతంగా చెమటోడ్చి పెంచుకున్నారని చెవుల్లో పూలు పెట్టుకొని జనం నమ్మాలి.ఈ అపర కుబేరుల మీద పన్ను వేస్తే వచ్చే అదనపు రాబడితో విద్య, వైద్యం వంటి సేవలకు జిడిపిలో అదనంగా ప్రతి రంగానికి ఒక్కో శాతం ఖర్చు పెంచవచ్చు, వృద్ధు లందరికీ నెల నెలా పన్నెండు వేల రూపాయల పెన్షన్ ఇవ్వవచ్చు.మానవత్వం ఉట్టి పడే నరేంద్రమోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న పెన్షన్ ఎంతో తెలుసా ? 80 ఏండ్ల లోపు వారికి నెలకు రు.200, ఆపైబడిన వారికి రు.500, వితంతువులకు రు.500, వికలాంగులకు రు.300-500 మాత్రమే. మోడీ ఏలుబడిలో ఒక్క పైసా కూడా పెంచలేదు. అంతకు ముందు యుపిఏ ప్రభుత్వం నిర్ణయించిన మొత్తాలనే ఇస్తున్నారు. అంతకు మించి ఇస్తున్నారంటే అవి ఆయా రాష్ట్ర ప్రభుత్వాల ఉదారత్వమే.ఉదాహరణకు ఆంధ్రప్రదేశ్‌లో ఇస్తున్న నాలుగువేలు, తెలంగాణాలో ఉన్న రెండు వేలల్లో కేంద్ర ప్రభుత్వ వాటా కేవలం రెండు, ఐదు వందలు మాత్రమే. అందుకే ఎప్పుడూ ఈ పెన్షన్లలో మా మోడీ గురించి చెప్పరేం అని ఏ ఒక్క బిజెపి నేతా డిమాండ్ చేయరు.

అపర కుబేరుల మీద సంపద పన్ను విధిస్తే ఏం చేయవచ్చో కూడా నివేదిక పేర్కొన్నది.అంబానీ నుంచి రెండుశాతం పన్ను వసూలు చేస్తే దేశంలో ఉన్న 185 క్షల మంది పదవ తరగతి విద్యార్థులకు మూడేసి లాప్‌టాప్‌లు ఉచితంగా ఇవ్వవచ్చు. లేదా 2.85కోట్ల మంది తల్లులకు రెండు సంవత్సరాల పాటు ఆర్థిక సాయం చేయవచ్చు.ఏడాదికి రు.18వేలు ఇస్తే అయ్యే ఖర్చు సంవత్సరానికి రు.51,300 కోట్లు.అదానీ నుంచి రెండుశాతం పన్ను వసూలు చేస్తే దేశమంతటా రెండు సంవత్సరాల పాటు ప్రాథమిక ఆరోగ్యానికి ఖర్చు చేయవచ్చు లేదా 87 కోట్ల గ్యాస్ సిలిండర్లను ఉచితంగా ఇవ్వవచ్చు.లేదా ఎనిమిది కోట్ల కుటుంబాలకు చెడు గాలి నుంచి రక్షణకు శుద్ధి చేసే పరికరాలను ఉచితంగా అందించవచ్చు.సావిత్రీ జిందాల్ నుంచి వసూలు చేసే పన్నుతో దళితులు, గిరిజన విద్యార్థులకు కొన్ని సంవత్సరాలపాటు స్కాలర్‌షిప్పులు ఇవ్వవచ్చు.లేదా పదివేల రూపాయల చొప్పున రెండున్నర కోట్ల మంది బాలికలు తమ విద్యను మెరుగుపరుచుకొనేందుకు ఇవ్వవచ్చు.కార్పొరేట్‌లు, వ్యక్తులకు పన్నుమినహాయింపులు ఇస్తున్న కారణంగా ఆ భారాన్ని సామాన్యులు భరిస్తున్నారు. గత పదకొండు సంవత్సరాల్లో కార్పొరేట్లకు రు.19.6లక్షల కోట్ల రుణాలను రద్దు చేశారు. అయితే రికార్డుల్లో వాటిని పారుబాకీలుగా చూపుతారు తప్ప రద్దు చేసినట్లు ఉండదు.మన దేశం జి 20 కూటమిలో భాగస్వామి. జోసెఫ్ స్టిగ్లిజ్ అనే ఆర్థికవేత్త నాయకత్వంలో ప్రపంచ అసమానతల గురించి పరిశీలనకు ఒక కమిటీని వేశారు.అసమానతల పెరుగుదల విధానపరంగా ఎంచుకున్న అంశమని, సంపద పెరిగే కొద్దీ పన్ను మొత్తాలను పెంచే విధంగా ఆ విధానాన్ని మార్చాలని కమిటీ నివేదిక పేర్కొన్నది.కానీ మనదేశంలో జరుగుతున్నదేమిటి ? అసమానతలను తగ్గించాలని మన రాజ్యాంగమే చెప్పింది.అధికారంలో ఎవరున్నా దాన్ని తుంగలో తొక్కారు.చివరకు మోడీ సంపదపన్నునే రద్దు చేశారని సదరు నివేదిక వ్యాఖ్యానించింది.ఎందుకయ్యా అంటే వసూలు చేసే పన్ను కంటే అందుకయ్యే ఖర్చు ఎక్కువగా ఉందని చూపారు. చట్టంలో లోపాలు ఉన్నాయన్నారు. ఇంట్లో ఎలుకలు ఉన్నాయని వాటిని చంపటం కంటే ఇల్లు తగులబెట్టటమే లాభదాయకమని చెప్పినట్లుగా ఉంది.చట్టాల్లో ఉన్న అనేక లోపాలను సరిచేస్తున్నామని చెప్పిన వారు ఈ చట్టాన్ని ఎందుకు సరిచేయలేదు ? 1957 చట్టం ప్రకారం రు.30 లక్షల సంపద మీద ఒక శాతం పన్ను చెల్లించాల్సి ఉంది.దాన్ని రద్దు చేసి ఒక కోటికి మించి రాబడి ఉన్నవారు చెల్లించే పన్ను మీద రెండుశాతం సర్‌ఛార్జి విధిస్తున్నారు. ఉదాహరణకు కోటి రూపాయల రాబడిలో మినహాయింపులన్నీ పోను 20లక్షలకు పన్ను చెల్లించాల్సి వస్తే దాని మీద రెండుశాతం విధిస్తారు. ధనికులకు ఎన్ని రాయితీలు కల్పిస్తున్నారో చూడండి.



దేశంలో అసమానతల గురించి సిఎఫ్ఏ ప్రచార విభాగ డైరెక్టర్ అనిర్బన్ భట్టాచార్య మాట్లాడుతూ " నేడు రెండు భారత్‌లు ఉన్నాయి.ఒక భారత్‌లో ఎగువన ఉన్న వేళ్లమీద లెక్కించదగిన కొద్ది మంది సంపదలు లక్షల కోట్లుగా పెరుగుతుంటే మరో భారత్ అప్పులపాలవుతున్నది " అన్నారు. " నోట్ల రద్దు మొదలు కరోనా మహమ్మారి వరకు గత పదేండ్లుగా బతకాలంటే ఎలాంటి ప్రశ్నలు వేయవద్దని జనాలకు చెప్పిన వారు ఇప్పుడు ఎల్‌పిజి-బొగ్గు గురించి కూడా అడగవద్దంటున్నారని" ధనికుల మీద పన్నువేయాలనే ప్రచార కర్త రాజశేఖర్ వ్యాఖ్యానించారు.కష్టపడే సామాన్యులు రోడ్ల మీద వరుసల్లో నిలుస్తుంటే దేశంలోని అపరకుబేరులకు దోపిడీ కొనసాగించేందుకు ఉచిత పాస్‌లు ఇస్తున్నారని కూడా అన్నారు. నివేదిక రూపకల్పనలో భాగస్వామి జాకబ్ జోషి మాట్లాడుతూ ఆందోళనకర స్థాయికి సంపద కేంద్రీకరణ పెరిగినప్పటికీ విధానపరమైన చర్చలో దాని ఊసే లేదన్నారు. అసమానతలు సాధారణం అయ్యాయని, సంపదపన్ను అద్భుతాలు చేస్తుందని కాదు గానీ పేదల మౌలిక హక్కుల అమలుకు కొంత మేర దోహదం చేస్తుందని కూడా చెప్పారు.

అసమానతలు పెరిగితే ఏమౌతుంది ? మానవాభివృద్ధి దిగజారిపోతుంది. ప్రపంచ జిడిపిలో పదవ స్థానంలో ఉన్నదానిని ఐదవదిగా తీసుకురావటం తమ ఘనత అని బిజెపి గొప్పలు చెప్పుకుంటుంది.కాసేపు అంగీకరిద్దాం.తలసరి జిడిపిలో సంగతేమిటి ? దున్నబోతే దూడల్లో మెయ్యబోతే ఎద్దుల్లో అన్నట్లుగా ఉంది. ఐఎంఎఫ్ 2025 సమాచారం ప్రకారం చైనా 13,806 డాలర్లతో 99వదిగా ఉంది, మనదేశం 2,818 డాలర్లతో 166వదిగా ఉంది.మానవాభివృద్ధి సూచికల్లో 2012లో 136వ స్థానం నుంచి మోడీ అధికారానికి వచ్చిన 2014లో 130వదిగా కాస్త పెరిగింది.సబ్‌కాసాత్ సబ్‌కా వికాస్ పాలనలో 2025లో కూడా 130వదిగానే ఉంది.సాధించిన అభివృద్ధి ఏమిటి? ఇంక మోడీ ప్రత్యేక ఏముంది ! కాషాయదళాలు చెప్పే ఆవు పాలు అంబానీ, అదానీలకు పేడ, మూత్రం జనాలకు పంచితే ఇదే జరుగుతుంది.మానవాభివృద్ధి సూచికలో చైనా 0.797 పాయింట్లు కలిగి ఉంటే మనదేశం 0.685 దగ్గర ఉంది.అసమానతలు పెరిగే కొద్దీ ఆ సంఖ్య పెరగదు.మహాకవి గురజాడ చెప్పినట్లు దేశమంటే మట్టికాదోయ్ మనుషులోయ్ అన్నది నిజం కావాలంటే సంపదలు కేంద్రీకృతమైతే కుదరదు. పిండికొద్దీ రొట్టె అన్నట్లుగా ఆదాయం ఉంటేనే ఆరోగ్యకరమైన, గౌరవప్రదమైన జీవనం సాధ్యం.సర్వేజనా సుఖినోభవంతు అంటే చాలదు, అందుకు కార్యాచరణ ముఖ్యం !



ఎం కోటేశ్వరరావు
8331013288

# పాఠశాల తెలుగు సిలబస్‌ను సమీక్షించాలి

మారిన కాలానికి అనుగుణంగా విద్యావ్యవస్థలో సంస్కరణలు రావడం ఆహ్వానించదగ్గ పరిణామం. అయితే, పాఠ్యాంశాల ఎంపికలో విద్యార్థుల వయస్సు, గ్రహణ శక్తి, మానసిక వికాసాన్ని పరిగణనలోకి తీసుకోవడం అత్యంత ముఖ్యం. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలోని 8, 9, 10 తరగతుల తెలుగు పాఠ్యాంశాలను పరిశీలిస్తే, సిలబస్ విస్తృతి విద్యార్థుల సామర్థ్యానికి మించి ఉందనే అభిప్రాయం విద్యావేత్తల నుండి వ్యక్తమవుతోంది.

### 8వ తరగతి: విశ్లేషించాల్సిన అంశాలు

ఎనిమిదో తరగతిలో 'సముద్ర ప్రయాణం' వంటి పాఠాల్లోని సందేశాలు, 'అసామాన్యులు' మరియు 'సింగరేణి' వంటి పాఠాల నిడివి విద్యార్థులకు భారంగా మారుతున్నాయి. ముఖ్యంగా బొగ్గు బావుల వంటి సాంకేతిక అంశాలను క్షేత్రస్థాయి అవగాహన లేకుండా అర్థం చేసుకోవడం వారికి కష్టతరమవుతోంది. అలాగే 'మాట్లాడే నాగలి', 'చిందు ఎల్లమ్మ' వంటి పాఠాల్లోని కొన్ని సామాజిక ప్రస్తావనలు తరగతి గదిలో అనవసర చర్చలకు, మతపరమైన సున్నితత్వానికి దారితీస్తున్నాయి. ఇది విద్యార్థుల మధ్య పరస్పర గౌరవ భావానికి విఘాతం కలిగించే ప్రమాదం ఉంది.

### 9వ తరగతి: స్థాయికి మించిన సాహిత్యం

తొమ్మిదో తరగతికి వచ్చేసరికి 'కోరస్', 'వాగ్భూషణం' వంటి పాఠాలు పూర్తిగా కళాశాల స్థాయి ప్రమాణాలతో ఉన్నాయి. కఠినమైన పదజాలం వల్ల విద్యార్థులు భాషా సౌందర్యాన్ని ఆస్వాదించలేకపోతున్నారు. 'దీక్షకు సిద్ధం కండి' వంటి కరపత్ర రూపంలోని పాఠాలు, 'ఉద్యమ స్ఫూర్తి' పాఠంలోని కొన్ని పోలికలు విద్యార్థుల ఆలోచనా సరళిపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉంది. పరీక్షల దృష్ట్యా, ఉపవాచకం నుండి వ్యాసరూప ప్రశ్నల భారాన్ని తగ్గించి, వాటిని కేవలం అవగాహనకే పరిమితం చేయాల్సిన అవసరం ఉంది.

### 10వ తరగతి: భాషా సందిగ్ధత - చారిత్రక భారం

పదో తరగతిలో 'కొత్త బాట' వంటి పాఠాలు ఒక నిర్దిష్ట ప్రాంతీయ యాసలో ఉండటం వల్ల, ఇతర జిల్లాల విద్యార్థులు భాషా పరమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. 'గోలకొండ పట్టణము' వంటి పాఠాల్లో భాష కంటే చరిత్రకే ఎక్కువ ప్రాధాన్యత లభించింది. 'భూమిక' వంటి పాఠాల్లోని కొన్ని చారిత్రక అంశాలు సామాజిక సమతుల్యత దెబ్బతినేలా ఉన్నాయని పలువురు భావిస్తున్నారు. ఇవన్నీ విద్యార్థుల్లో భాషా నైపుణ్యం కంటే ఒత్తిడిని ఎక్కువగా పెంచుతున్నాయి. ప్రభుత్వం, విద్యాశాఖ తక్షణమే స్పందించి, ఒక నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలి. విద్యార్థుల వయస్సుకు తగినట్లుగా సిలబస్‌ను హేతుబద్ధీకరించి, వివాదాస్పద మరియు భారమైన పాఠాలను తొలగించాలి. కేవలం అస్తిత్వం కోసం కాకుండా, విద్యార్థి వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడే సరళమైన, అర్థవంతమైన పాఠాలను చేర్చాలి. అప్పుడే మనం ఒత్తిడి లేని విద్యా వ్యవస్థను నిర్మించగలం.

కాళేశ్వరం కృష్ణ మూర్తి
తెలుగు భాషా విషయ నిపుణులు,
9705196097

# సర్టిఫికెట్ల చెర, కోర్టు తీర్పుల సెగ

విద్యా దీపాలు వెలగాల్సిన చోట పేద విద్యార్థుల కన్నీళ్లు రాలుతున్నాయి. ఒకవైపు ఫీజుల కోసం ప్రైవేటు కళాశాలల వేధింపులు, ఒరిజినల్ సర్టిఫికెట్ల నిర్బంధం, మరోవైపు పెండింగ్ బకాయిలు ఇవ్వని ప్రభుత్వాల నిస్సహాయత... వీటికి తోడు తాజాగా విద్యార్థుల నుంచే నేరుగా ఫీజులు వసూలు చేసుకోవచ్చంటూ న్యాయస్థానాలు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులు పేద, మధ్యతరగతి విద్యార్థుల పాలిట ఉరితాళ్లుగా మారుతున్నాయి. కన్వీనర్ కోటాలో సీటు సాధించి, ఎంతో శ్రమించి ప్రభుత్వ ఉద్యోగానికి ఎంపికైన పేదింటి బిడ్డల సర్టిఫికెట్లను యాజమాన్యం ఫీజుల పేరిట లాకర్‌లో బంధించిన ఘటనలు విద్యా వ్యవస్థలో దాగిన రాక్షసత్వానికి సజీవ సాక్ష్యాలు. విద్యా వ్యవస్థను బలోపేతం చేయాల్సిన పాలకులే తమ అంతులేని నిర్లక్ష్యంతో దాన్ని బలిపీఠం ఎక్కిస్తున్నారు. సామాజిక బాధ్యతతో కూడిన విద్యారంగం నేడు వ్యవస్థీకృత వ్యాపారంగా, కాసుల బాటగా మారుతున్న వైనం ఎంతమాత్రం హర్షణీయం కాదు. బడ్జెట్‌లో నిధుల కోత, యూనివర్సిటీల్లో నియామకాల లేమి తదితర కారణాలతో ప్రభుత్వ విద్య పాతాళానికి పడిపోతుండగా, ప్రైవేటు మాఫియా పగడగలెత్తుతోంది. రాష్ట్రంలో వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్నాయి. గత ప్రభుత్వం కానీ, ప్రస్తుత ప్రభుత్వం కానీ బకాయిల విడుదలలో ప్రదర్శిస్తున్న అలసత్వం విద్యార్థులకు శాపంగా మారుతోంది.ప్రభుత్వం దాదాపు రూ.9300 కోట్ల బకాయిలు ఇవ్వకపోవడంతో కళాశాలల మనుగడ కష్టంగా మారిందంటూ ప్రైవేటు యాజమాన్యాలు కోర్టులకెక్కాయి. ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయడంలో, స్పష్టత ఇవ్వడంలో విఫలం కావడంతో, 2026-27 విద్యా సంవత్సరం నుంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ మైనారిటీ విద్యార్థుల నుంచి సైతం నేరుగా ఫీజులు వసూలు చేసుకోవచ్చంటూ హైకోర్టు ఇచ్చిన తాజా మధ్యంతర ఉత్తర్వులు లక్షలాది మంది గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నాయి. స్కాలర్‌షిప్‌లపై ఆధారపడి చదువుకునే సుమారు 14 లక్షల మంది విద్యార్థుల ఉన్నత విద్యావకాశాలను ఈ తీర్పు ఒక్కసారిగా అగాధంలోకి నెట్టేసింది. అప్పటికే ఫీజులు చెల్లించలేక సర్టిఫికెట్ల కోసం ప్రాధేయపడుతున్న విద్యార్థులను మరింత భయభ్రాంతులకు గురిచేసేలా ఈ పరిణామం దాపురించింది. బకాయిలు చెల్లించడంలో సర్కారు వైఫల్యమే యాజమాన్యాల చేతిలో బెదిరింపు అస్త్రంగా మారింది. ఇది ముమ్మాటికీ ప్రభుత్వ వ్యవస్థాగత వైఫల్యమే.ఇక ప్రభుత్వం విద్యా రంగాన్ని ఎంతగా విస్మరిస్తోందో తాజా 2026-27 బడ్జెట్ కేటాయింపులు చూస్తేనే అర్థమవుతోంది. తెలంగాణ ఎడ్యుకేషన్ కమిషన్ (TEC) విద్యా రంగానికి బడ్జెట్‌లో కనీసం 18 శాతం నిధులు కేటాయించాలని స్పష్టంగా సిఫార్సు చేసినప్పటికీ, ప్రభుత్వం కేవలం రూ.26,674 కోట్లు (8.23 శాతం) మాత్రమే కేటాయించి చేతులు దులుపుకుంది. ముఖ్యమంత్రి స్వయంగా విద్యా రంగానికి 15 శాతం నిధులు కేటాయిస్తామని చెప్పిన మాటలు నీటిమూటలయ్యాయి. ఒకవైపు కొత్త కార్పొరేట్ తరహా ఇంటర్నేషనల్ స్కూళ్ల ప్రాజెక్టుల పేరుతో ప్రజాధనాన్ని భారీగా వెదజల్లుతూ, మరోవైపు మౌలిక వసతులు లేవంటూ గత రెండున్నరేళ్లలో దాదాపు 1500 ప్రభుత్వ పాఠశాలలను మూసివేత దిశగా నడిపించడం పాలకుల దివాళాకోరుతనానికి నిదర్శనం. తక్కువ వ్యయంతో ఉన్న పాఠశాలలను మెరుగుపరచి ఉచిత విద్యను బలోపేతం చేయాల్సిన ప్రభుత్వమే, ప్రైవేటు దోపిడీకి పరోక్షంగా వంతపాడుతోంది.పాలకుల నిర్లక్ష్యం పాఠశాల స్థాయికే పరిమితం కాలేదు. రాష్ట్రంలోని ఉన్నత విద్యా వ్యవస్థకు పట్టుగొమ్మలైన విశ్వవిద్యాలయాలు సైతం నిధుల్లేక, సిబ్బంది లేక కునారిల్లుతున్నాయి. ఉస్మానియా, కాకతీయ తదితర రాష్ట్ర ప్రఖ్యాత వర్సిటీల్లో వేలాది బోధన, బోధనేతర పోస్టులు ఏళ్లుగా ఖాళీగా దర్శనమిస్తున్నాయి. అధ్యాపకులు లేక తరగతులు జరగడం లేదు, లాబొరేటరీలు మూతబడుతున్నాయి, పరిశోధనలు కుంటుపడుతున్నాయి. ఫలితంగా జాతీయ, అంతర్జాతీయ ర్యాంకింగ్స్‌లో మన రాష్ట్ర యూనివర్సిటీల స్థానాలు నానాటికీ దిగజారిపోతున్నాయి. ఒకప్పుడు ఉద్యమాలకు ఊపిరిపోసిన వర్సిటీలను ప్రభుత్వాలు పనిగట్టుకుని నిర్వీర్యం చేస్తున్నాయన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. ఖాళీ పోస్టులు భర్తీ చేయకుండా నాణ్యమైన విద్య ఎలా అందుతుంది? నైపుణ్యం లేని యువత భవిష్యత్తులో పోటీ ప్రపంచాన్ని ఎలా ఎదుర్కొంటారు? ఈ ప్రశ్నలకు ప్రభుత్వ యంత్రాంగం వద్ద బదుల్లేదు. కక్ష సాధింపు రాజకీయాలపై, రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులపై చూపిస్తున్న శ్రద్ధలో పదో వంతు కూడా విద్యార్థుల భవిష్యత్తుపై చూపకపోవడం అత్యంత శోచనీయం.విద్యార్థులంటే కేవలం ఓటు బ్యాంకులు కారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రాణత్యాగాలు చేసిన విద్యార్థులు, నిరుద్యోగుల బలిదానాలను ఏ ప్రభుత్వమూ విస్మరించకూడదు. విద్యాశాఖను స్వయంగా పర్యవేక్షిస్తున్న ముఖ్యమంత్రి తక్షణమే మొద్దునిద్ర వీడి, పెండింగ్‌లో ఉన్న వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి. కోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో విద్యార్థులపై భారం పడకుండా చట్టపరమైన, ప్రభుత్వపరమైన అన్ని చర్యలు తీసుకోవాలి. ఫీజుల కోసం పేద విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లను లాక్కొనే విద్యా మాఫియా గుర్తింపును తక్షణమే రద్దు చేయాలి. యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర నియామకాలను యుద్ధప్రాతిపదికన చేపట్టాలి. అలా చేయని పక్షంలో నిరాశలో, కసిలో ఉన్న యువత ఆగ్రహ జ్వాలలకు ప్రభుత్వ అహంకార పీఠాలు మాడిమస్సవడం ఖాయం. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడే ఏ ప్రభుత్వమూ చరిత్రలో నిలబడలేదన్న కఠోర సత్యాన్ని సర్కారు ఇప్పటికైనా గుర్తించాలి. ఎన్నికల హామీలను నెరవేర్చడంలో, సామాజిక సమస్యలను పరిష్కరించడంలో చిత్త శుద్ధి చూపకుండా అడ్డగోలు చట్టాలతో, కక్ష్య సాధింపు చర్యలతో నిర్బంధాన్ని కొనసాగిస్తే తెలంగాణ సమాజం ఏ మాత్రం సహించదని, ప్రశ్నించే గొంతుల నొక్కితే గద్దె దిగక తప్పదని, ఈ తెలంగాణ గులాంల నేల కాదు గళమెత్తే జ్వాలని గుర్తెరిగితే మంచిది.





వినోద్ హిందుస్థానీ,
పరిశోధక విద్యార్థి,
ఇగ్నో, న్యూ ఢిల్లీ
8985926993



# జాతీయం-అంతర్జాతీయం



## హోర్ముజ్ జలసంధి తెరుచుకుంటుంది

వుదయం డెస్క్, ఏప్రిల్ 11 :





ఇరాన్ సాయం ఉన్నా, లేకపోయినా సాధ్యమైనంత త్వరలో హోర్ముజ్ జలసంధి తిరిగి తెరుచుకుంటుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఈ జలసంధిని ఇరాన్ దిగ్బంధనం చేయడంతో ప్రపంచ వ్యాప్తంగా ఇంధన సరఫరాలకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి.

అమెరికా గల్ఫ్‌ను తెరుస్తుందని, సాయం చేసేందుకు ఇతర దేశాలు సిద్ధంగా ఉన్నాయని ఆయన అన్నారు. ఇరు దేశాల మధ్య శాంతి చర్చలకు ముందు, అది అంత తేలిక కాదని, అయితే, సాధ్యమైనంత త్వరలో తెరుచుకుంటుందని అన్నారు.

ఈ కీలకమైన అడ్డంకిని అమెరికా ఎలా తొలగిస్తుందో ట్రంప్ వివరించలేదు. అలాగే,హోర్ముజ్ జలసంధి ద్వారా వెళ్లే నౌకల పై ఇరాన్ టోల్‌ను విధించడానికి తాను అంగీకరించనని కూడా ఆయన చెప్పారు. ఒకవేళ యుద్ధాన్ని ముగించేందుకు ఒప్పందం కుదిరినా, ఆ మార్గంలో వెళ్లే నౌకలపై సుంకం విధించాలనుకుంటున్నట్టు టెహ్రాన్ సూచించింది. వారు ఆ పని చేస్తే, మేము దానిని జరనివ్వమని ట్రంప్ విలేకరులకు చెప్పారు.

ఇరాన్ వద్ద అణ్వాయుధాలు ఉండకుండా చూడటం శాంతి ఒప్పంద ప్రాధాన్యత అని, జలసంధి యాంత్రికంగా తెరుచుకుంటుందని ట్రంప్ అన్నారు. అణ్వాయుధాలు లేకపోవడమే ఒప్పందంలో 99 శాతం భాగమని ట్రంప్ అన్నారు.

యుఎస్, ఇరాన్‌ల మధ్య మంగళవారం రెండువారాల కాల్పుల విరమణను ప్రకటించినప్పటికీ, జలసంధిలో నౌకల రాకపోకలు మాత్రం జరుగకపోవడంతో, గల్ఫ్ నుంచి ఇంధన ఎగుమతులకు ఆటంకం ఎదురవుతోంది. కాల్పుల విరమణ ప్రారంభమైనప్పటి నుంచీ కేవలం 22 నౌకలు యాంత్రిక గుర్తింపు పద్ధతిలో జలసంధిని దాటాయి. యుద్ధానికి ముందు వీటి సంఖ్య 135గా ఉండేది.

లాయిడ్స్ లిస్ట్ ఇంటెలిజెన్స్ ప్రకారం, 325 ట్యాంకర్లు సహా 600 నౌకలు గల్ఫ్‌లో నిలిచిపోయి ఉన్నాయి. జలసంధిలో పరిస్థితి కాల్పుల విరమణకు ముందు గల పరిస్థితి నుంచి ప్రాథమికంగా మారలేదని కెప్లర్‌లో ప్రముఖ చమురు విశ్లేషకుడు మాట్ స్మిత్ అన్నారు. నౌక యజమానులు ఇరాన్ కు టోల్ చెల్లిస్తున్నారో లేదో అస్పష్టమని స్మిత్ అన్నారు.

ఇలా ఉండగా, యుద్ధానికి శాశ్వత ముగింపు పలికే లక్ష్యంతో ఇరాన్ మధ్యవర్తులతో చర్చలకోసం అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ పాకిస్తాన్ వచ్చారు. కాగా, ఇరాన్, యుఎస్ రెండూ పరస్పర విరుద్ధమైన అంశాలను చర్చిస్తున్నట్టు పేర్కొంటున్నారు.

### పాకిస్తాన్ మధ్యవర్తిత్వంపై
## థరూర్ చురకలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 11 (వుదయం) :



సామాజిక మాధ్యమం ఎక్స్‌పై పోస్ట్ చేసిన పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ ట్వీట్‌ను వాషింగ్టన్ రూపొందించిందంటూ, ఇరాన్, యునైటెడ్ స్టేట్స్ చర్చలకు మధ్యవర్తిత్వం వహిస్తున్న ఇస్లామాబాద్‌పై కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ చురకలు వేశారు. వాషింగ్టన్‌తో పాకిస్తాన్‌కు ఎలాంటి సంబంధం ఉందో మీకు తెలుసా? పాకిస్తానీ ప్రధాని ట్వీట్‌ను వాషింగ్టన్ రాసిందనే ఆరోపణలు ఉన్నాయి. ఎందుకంటే, దానిపై డ్రాఫ్ట్ ఫర్ పాకిస్తాన్ పిఎం అని ఉంది. మీరో, నేనో భారత ప్రధానమంత్రి కోసం ఏదైనా రాస్తే, దాని పై డ్రాఫ్ట్ ఫర్ ఇండియాస్ పిఎం అని దానిపై రాస్తామా? పైగా ఉపయోగించిన భాష కూడా వాషింగ్టన్ భాషే. అందులో కొన్ని పదబంధాలు అంతకు కొన్ని గంటలకు ముందు డొనాల్డ్ ట్రంప్ ఉపయోగించినవి. వాషింగ్టన్‌తో పాక్ పోషించినటువంటి పాత్రను కేవలం పాకిస్తాన్ మాత్రమే పోషించగలదు అని థరూర్ అన్నారు.

తన అధికారిక ఎక్స్ ఎకౌంట్‌పై ఎడిటింగ్ కూడా చేయకుండా పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఒక ముసాయిదా సందేశాన్ని పోస్ట్ చేసిన కొద్ది రోజుల తర్వాత తరూర్ ఈ వ్యాఖ్యలు చేశారు. రెండువారాల కాల్పుల విరమణను ఆ పోస్ట్ ప్రతిపాదించింది. యుఎస్, ఇరాన్ తాత్కాలిక ఒప్పందం దిశగా కదులుతున్న తరుణంలో ఈ పోస్ట్ వెలువడింది. రెండు వర్గాల్లో కూడా కాల్పుల విరమణను రెండువారాలు పాటించి, చర్చలు పురోగమించేందుకు అవకాశం కల్పించమని డొనాల్డ్ ట్రంప్‌ను షరీఫ్ విజ్ఞప్తి చేశారు. అంతేకాదు, ఆ సమయంలో సద్భావనా చర్యగా హోర్ముజ్ జలసంధిని తిరిగి తెరవవలసిందిగా ఆయన ఇరాన్‌కు అప్పీల్ చేశారు. అది వెలువడిన కొద్ది గంటలలోనే వాషింగ్టన్, టెహ్రాన్ రెండూ కూడా రెండువారాల కాల్పుల విరమణకు అంగీకరించి, యుద్ధం తీవ్రతరం చేయకుండా వెనక్కి తగ్గారు.

## భారత్‌కు వస్తున్న మరో ఎల్‌పిజి టాంకర్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 11 :




యుఎస్, ఇరాన్‌ల మధ్య రెండువారాల తాత్కాలిక కాల్పుల విరమణ ప్రకటన అనంతరం కీలకమైన సముద్ర చోక్‌పాయింట్ ద్వారా ప్రయాణించిన తొలి భారతీయ జెండా కలిగిన జగ్ విక్రమ్ శుక్రవారం రాత్రి, శనివారం ఉదయం హోర్ముజ్ జలసంధిని దాటింది. ఎల్‌పిజి టాంకర్ అయిన ఈ ఓడ జలసంధిని దాటిందని షిప్ ట్రాకింగ్ డాటా వెల్లడిస్తోంది. మార్చి తొలి వారం నుంచి పెర్షియన్ గల్ఫ్ ప్రాంతం నుంచి బయటపడిన భారతీయ జెండా కలిగిన తొమ్మిదవ నౌక ఇది. మరొక 15 భారతీయ రిజిస్ట్రేషన్ కలిగిన నౌకలు ఇంకా పెర్షియన్ గల్ఫ్‌లోనే ఉన్నాయని, అవి కూడా త్వరలోనే బయటపడతాయని తెలుస్తోంది.

దాదాపు 20వేల టన్నుల ఎల్‌పిజిని మోసుకుని జగ్ విక్రం వస్తున్నట్టు వాణిజ్య వర్గాలు పేర్కొన్నాయని ఇండియన్ ఎక్స్‌ప్రెస్ తెలిపింది. వాణిజ్య వర్గాల ప్రకారం జగ్ విక్రమ్ హోర్ముజ్ జలసంధి వద్ద క్లియరెన్స్ కోసం గత వారంకుపైగా నిలిచి ఉంది. ఏప్రిల్ 3వ తేదీన ఎల్‌పిజి ట్యాంకర్లైన గ్రీన్ ఆశా, జగ్ విక్రమ్ త్వరలోనే జలసంధిని దాటుతాయనే వార్తలు వచ్చాయి. గ్రీన్ ఆశా ఏప్రిల్ 5న జలసంధిని దాటింది.

సంఘర్షణ ప్రారంభమైనప్పటి నుంచీ పలు నౌకలు పెర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో నిలిచిపోయి ఉన్నాయి. పరిమిత సంఖ్యలో మాత్రమే వాటిలో కొన్ని జలసంధిని దాటాయి. దాటే సమయంలో ఇరాన్ అధికారుల సహకారంతో దాటాయి. ఇటీవలి కాలంలో జలసంధిని దాటిన ఏడెనిమిది భారతీయ ఎల్‌పిజి ట్యాంకర్లు భారీ గ్యాస్ కారియర్లు. ఒక మీడియం గ్యాస్ కారియర్‌కు రెండింతల సామర్థ్యం ఉన్నవి. ఒక్కటి మాత్రమే మధ్య తరహా నౌక. ఇలా ఉండగా, మిగిలిన 15 భారతీయ నౌకలు ఇంకా పెర్షియన్ గల్ఫ్‌లో ఉన్నాయి. అందులో ఒకటి ఎల్‌పిజి ట్యాంకర్ కాగా, నాలుగు ముడి చమురు ట్యాంకర్లు, ఒక ఎల్ఎన్‌జి, ఒక రసాయనాల ఉత్పత్తుల ట్యాంకర్, మూడు కంటైనర్ నౌకలు, రెండు బల్క్ కారియర్లు ఉన్నాయి. మరొకొన్ని రొటీన్ నిర్వహణలో ఉన్నాయి.

హోర్ముజ్ జలసంధి అనేది ఇరాన్, ఒమన్‌ల మధ్య ఉన్న ఒక ఇరుకైన సముద్ర మార్గం. ఇది పర్షియన్ గల్ఫ్‌ను, గల్ఫ్ ఆఫ్ ఒమన్‌ను, అరేబియా సముద్రాన్ని కలుపుతూ, ప్రపంచంలోని అత్యంత కీలకమైన ఇంధన రవాణా మార్గాలలో ఒకటిగా నిలుస్తుంది. ఇది ప్రపంచ చమురు రవాణాలో సుమారు ఐదవ వంతును, అలాగే ద్రవీకృత సహజ వాయువు రవాణాలో గణనీయమైన వాటాను నిర్వహిస్తుంది. ఈ విషయం అంతర్జాతీయ ఇంధన వాణిజ్యంలో దీని కేంద్ర పాత్రను నొక్కి చెబుతుంది.

## హిజ్బుల్లాతో చర్చించం



వుదయం డెస్క్, ఏప్రిల్ 11 :

వచ్చేవారం వాషింగ్టన్‌లో జరుగనున్న చర్చల సందర్భంగా లెబనీస్ ప్రతినిధులతో శాంతి చర్చలను ప్రారంభించేందుకు ఇజ్రాయెల్ అంగీకరించింది. అయితే, హిజ్బుల్లాతో కాల్పుల విరమణ గురించి మాత్రం చర్చించమని స్పష్టం చేసిందని అమెరికాకు ఇజ్రాయెల్ రాయబారి శుక్రవారం వెల్లడించారు. హిజ్బుల్లా ఇజ్రాయెల్‌పై దాడులు చేయడాన్ని కొనసాగిస్తున్న తీవ్రవాద సంస్థతో కాల్పుల విరమణ గురించి చర్చించడానికి ఇజ్రాయెల్ తిరస్కరించింది. ఇరు దేశాల మధ్య శాంతికి ఉన్న ఆటంకం అదే అని ఇజ్రాయెలీ రాయబారి మైకెల్ లీటర్ పేర్కొన్నారు. లెబనాన్, ఇజ్రాయెల్ రాయబారుల మధ్య శుక్రవారం టెలిఫోన్ సంభాషణ జరిగినట్టు తెలుస్తోంది.

ఈ చర్చలు మంగళవారం జరిపేందుకు ప్రణాళిక సిద్ధమైంది. యుఎస్ మధ్యవర్తిగా వ్యవహరించే ఈ చర్చలు ఇజ్రాయెల్ లెబనాన్ సంఘర్షణలో కాల్పుల విరమణపై కేంద్రీకృతమై ఉంటాయని లెబనాన్ అధ్యక్ష కార్యాలయం విడుదల చేసిన ప్రకటన తెలిపింది.

## మొజ్తాబా ఖమేనీ సజీవంగా ఉన్నారా?

### గాయపడి చికిత్స పొందుతున్నారంటున్న సన్నిహితులు

వుదయం డెస్క్, ఏప్రిల్ 11 :



ఫిబ్రవరిలో అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా జరిపిన వైమానిక దాడిలో. ఇరాన్ కొత్త సుప్రీం నాయకుడు మొజ్తాబా ఖమేనీ ముఖం దెబ్బతిన్నదని, ఒక కాలికి తీవ్ర గాయమైందని ఆయన సన్నిహితులు వెల్లడించారు. ఈ గాయాలకు ఖమేనీ ఇంకా చికిత్స చేయించుకుంటున్నారని, యుద్ధం ప్రారంభంలో ఆయన తండ్రిని హతం చేసిన దాడిలో అయిన గాయాల నుంచి కోలుకుంటున్నారని, ముగ్గురు విశ్వసనీయ వ్యక్తులు చెప్పినట్టు రాయిటర్స్ పేర్కొంది. యాభై ఆరేళ్ల నాయకుడు భౌతికంగా ఆరోగ్యంగా లేనప్పటికీ, మానసికంగా చురుకుగా ఉన్నారని అతడి సన్నిహితులు చెప్తున్నారు. అతడు సీనియర్ ఇరాన్ అధికారులతో వీడియో కాన్ఫరెన్సింగ్‌ల ద్వారా సమావేశాలను చురుకుగా నిర్వహిస్తూ, వాషింగ్టన్‌తో యుద్ధం, చర్చలకు సంబంధించిన కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారని తెలుస్తోంది.

ఫిబ్రవరి 28వ తేదీన యుఎస్, ఇజ్రాయెల్ ఉమ్మడిగా ఇరాన్‌పై దాడులు ప్రారంభించగా, అందులో ఇరాన్ సుప్రీం నాయకుడు అయతుల్లా ఖమేనీ మరణించిన విషయం తెలిసందే. ఆయన మరణానంతరం మొజ్తాబాను ఇరాన్ నూతన సుప్రీం నాయకుడిగా ప్రకటించారు. అయితే, దాడి అనంతరం అతడు బహిరంగంగా కనిపించకపోవడంతో అతడి సంక్షేమంపై ఊహాగానాలు పెరిగాయి. ఫోటో కానీ, వీడియో లేదా ఆడియో కానీ వెలువడకపోవడంతో, ఆ దాడిలో అతడికి భారీ గాయాలు అయ్యి ఉంటాయనే పుకార్లు వచ్చాయి.

ఆ దాడిలో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇతర అధికారులు పదే పదే పేర్కొన్నప్పటికీ, కొందరు ఆయన ఒక కోల్పోయారని కూడా భావిస్తున్నట్టు చెప్పినప్పటికీ, ఆయన గాయాల తీవ్రతపై ఇరాన్ ఇప్పటివరకూ ఎటువంటి అధికారిక ప్రకటన చేయలేదు. మొజ్తాబా మరణించి ఉండవచ్చని లేదా చాలా దారుణమైన స్థితిలో ఉండవచ్చని ట్రంప్ ఇటీవల వ్యాఖ్యానించారు. ఈ ఉమ్మడి దాడి ఇరాన్ అగ్ర నాయకత్వాన్ని, సైనిక శక్తిని తుడిచిపెట్టిందని, ప్రస్తుతం ఆ దేశానికి పనిచేస్తున్న సుప్రీం లీడర్ ఎవరూ లేరని కూడా ఆయన పేర్కొన్నారు. వారి నాయకులు మరణించారు. వారి సుప్రీం లీడర్ ఇకపై సుప్రీం కాదు. ఆయన మరణించారు. ఆయన కుమారుడు కూడా మృతి చెంది ఉండవచ్చు లేదా చాలా దారుణమైన స్థితిలో ఉండవచ్చు. ఎందుకంటే, ఆయన నుంచి ఎటువంటి సమాచారం లేదు, అని ఆయన మియామిలో అన్నారు.

## నా అభ్యర్థిత్వాన్ని రద్దు చేయించే యత్నం జరిగింది

కోల్‌కతా, ఏప్రిల్ 11 (వుదయం) :



పశ్చిమ బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికల వేడి తీవ్రస్థాయిలో రాజుకుంటోంది. తన అధికారాన్ని నిలబెట్టుకునేందుకు ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రయత్నిస్తుండగా, ఎట్టిపరిస్థితుల్లోనైనా ఈసారి తమ ఉనికిని చాటుకోవాలనే పట్టుదలతో బిజెపి ముందుకు వెడుతోంది. ఈ క్రమంలో వాగ్దాడులు, ఆరోపణలు, విమర్శలు వెల్లువెత్తున్నాయి.

ఈ నేపథ్యంలోనే, శనివారం రోజు మమత ఒక తీవ్ర ఆరోపణ చేశారు. భవానీపుర్ నుంచి తన అభ్యర్థిత్వాన్ని రద్దు చేయించడానికి భాజపా ప్రయత్నించిందని బెంగాల్ ముఖ్యమంత్రి మమతా ఆరోపించారు. తనపై తప్పుడు కేసులు పెట్టడానికి ఆ పార్టీ నేతలు ఈసీతో కలిసి కుట్ర పన్నారని అన్నారు. ఈ ప్రయత్నాలను తమ పార్టీ నేతలు భగ్నం చేశారన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా పోరాడి ఎన్నికల్లో గెలిచే ధైర్యం లేక, మోసపూరిత మార్గాల్లో ఓట్లు రాబట్టుకోవడానికి కుట్ర పన్నుతున్నారని అన్నారు. అందుకే 'సర్' పేరుతో వేల సంఖ్యలో ఓటర్ల పేర్లను తొలగించారని మమత ఆగ్రహం వ్యక్తం చేశారు. 90లక్షల మంది ఓటర్ల పేర్లను ఈసీ ఓటరు జాబితా నుంచి తొలగించిందని పేర్కొన్నారు. ఎన్నికల ఫలితాలను తమకు అనుకూలంగా మార్చుకోవడానికి ఈవీఎంలలో అవకతవకలకు పాల్పడడానికి కూడా ఈసీతో కలిసి, భాజపా ప్రణాళికలు రచిస్తోందని ఆరోపించారు. రాష్ట్ర ప్రజల ప్రజాస్వామ్య హక్కులను హరించడానికే బెంగాల్‌లో యూనిఫామ్ సివిల్ కోడ్ (యూసీసీ)ను అమలు చేయాలని భాజపా చూస్తోందని మమత ఆరోపించారు. ఇది వెనుకబడిన వర్గాలకు వ్యతిరేకంగా ఉంటుందన్నారు. బెంగాల్‌లో యూసీసీని ఎన్నటికీ అమలు కానివ్వమన్నారు.

### మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా
## ప్రధానమంత్రి నివాళులు

### పూలే 200వ జయంతి వేడుకల ప్రారంభం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 11 (వుదయం) :



మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఆయనకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఘన నివాళులు అర్పించారు. పూలేను ఒక దార్శనిక సామాజిక సంస్కర్తగా అభివర్ణించిన ప్రధాని, ఆయన తన జీవితాన్ని సమానత్వం, న్యాయం, విద్య వంటి ఉన్నత ఆశయాల కోసమే అంకితం చేశారని కొనియాడారు.

మహిళలు, అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడటంలో మహాత్మా పూలే ఒక మార్గదర్శిగా నిలిచారని ప్రధానమంత్రి పేర్కొన్నారు. తన నిరంతర కృషి ద్వారా విద్యను మహిళల సాధికారతకు ఒక శక్తిమంతమైన సాధనంగా మార్చడంలో ఆయన కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. ఈ సంవత్సరం ఆ మహనీయ సంస్కర్త 200వ జయంతి వేడుకలు ప్రారంభం కావడం అత్యంత విశేషమని అన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ప్రధానమంత్రి ఒక ప్రత్యేక వ్యాసాన్ని కూడా రాశారు. మహాత్మా పూలే నేటికీ అనేక మందికి మార్గదర్శిగా నిలుస్తున్నారన్నారు. విద్య, అభ్యసనం, అందరి సంక్షేమం కోసం ఆయన ఇచ్చిన ప్రాధాన్యత నేటి కాలంలో ఎంతగానో ప్రాముఖ్యతను కలిగి ఉన్నాయని తెలిపారు. సమాజ ప్రగతికి పూలే ఆలోచనలు మనందరికీ నిరంతరం దిశానిర్దేశం చేయాలని శ్రీ మోదీ ఆకాంక్షించారు. మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా.. సమానత్వం, న్యాయం, విద్య అనే ఆదర్శాల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన ఆ దార్శనిక సంఘ సంస్కర్తకు ఘన నివాళులర్పిస్తున్నాను. మహిళలు, అణగారిన వర్గాల హక్కుల పరిరక్షణలో ఆయన ఒక మార్గదర్శిగా నిలిచారు. ఆయన చేసిన కృషి ఫలితంగా విద్య సాధికారతకు ఒక శక్తిమంతమైన సాధనంగా రూపుదిద్దుకుంది. ఈ సంవత్సరం ఆయన 200వ జయంతి ఉత్సవాల ప్రారంభాన్ని మనం జరుపుకుంటున్నాం. సామాజిక ప్రగతి దిశగా సాగే ప్రస్థానంలో ఆయన ఆలోచనలు ప్రతి ఒక్కరికీ నిరంతరం దిశానిర్దేశం చేస్తూ ఉండాలని కోరుకుంటున్నాను.

మహాత్మా పూలే 200వ జయంతి ఉత్సవాలు ప్రారంభమవుతున్న ఈ తరుణంలో.. ఆయన ఎందరో వ్యక్తులకు ఏ విధంగా మార్గదర్శిగా నిలుస్తున్నారు, విద్య, అభ్యాసనం, సర్వజన సంక్షేమంపై ఆయన కనబరిచిన ప్రాధాన్యత నేటి యుగానికి ఎంతటి సంబంధం కలిగి ఉన్నాయనే అంశాలపై నా భావాలను వ్యాసంలో రాశాను."

గొప్ప సంఘ సంస్కర్త మహాత్మా పూలే 200వ జయంతి ఉత్సవాలు ప్రారంభమవుతున్నాయి. ఆయన తన జీవితమంతా విద్య, జ్ఞానం, ప్రజా సంక్షేమానికి అంకితం చేశారు.

## రాజకీయాల్లో రీటేకులుండవు

వుదయం డెస్క్, ఏప్రిల్ 11 :

తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ.. టీవీకే చీఫ్, నటుడు విజయ్ రాజకీయ ప్రవేశంపై కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరం కీలక వ్యాఖ్యలు చేశారు. రాజకీయాలు యాక్టింగ్ చేసినంత సులువు కాదని, రీటేక్స్ ఉండవని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. తమిళనాడులో నిర్వహించిన ఓ ర్యాలీలో ఆయన చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. "రాజకీయాలు అంత సులభం కావు. నటుడు విజయ్ కొత్తగా రాజకీయ పార్టీ పెట్టారు. ఆయనకు ఈ రంగంలో అనుభవం లేదు. రాజకీయాల్లో 20 ఏళ్లుగా కొనసాగుతున్నా. కాంగ్రెస్ నేతృత్వంలో పలు కేంద్ర పదవులు చేపట్టాను. సినిమాల్లా రాజకీయాలు ఉండవు. సినిమా సెట్‌లో నటీనటులు చేసిన సీన్లు సరిగా రాకుంటే సరిదిద్దుకోవచ్చు. డైరెక్టర్లు మరో టేక్ తీస్తారు. రాజకీయాలు అలా కాదు. ఇక్కడ రీటేక్ ఉండదు. ఒకే నిర్ణయం ఉంటుంది. దాన్నే కొనసాగించాలి. ప్రజల కోసమే పనిచేయాలి" అని అన్నారు. తమిళనాడులో శుక్రవారం టీవీకే నిర్వహించిన ఎన్నికల ర్యాలీలో ఆ పార్టీ చీఫ్ విజయ్ మాట్లాడకపోవడాన్ని చిదంబరం తప్పుపట్టారు. రాజకీయాలంటేనే మాట్లాడటమని, ప్రజలతో మమేకం కావాలని గుర్తుచేశారు. 'నేను ఏ సమయంలోనైనా ప్రజల చెంతకు వస్తాను. కారులో ఒంటరిగా ప్రయాణిస్తాను. వారికి సంబంధించిన ఏ అంశాన్నైనా చర్చించేందుకు సిద్ధంగా ఉంటాను' అని వెల్లడించారు.

### మధుర పడవ ప్రమాద బాధితులకు
## నష్ట పరిహారం


వుదయం డెస్క్, ఏప్రిల్ 11:

మధురలో జరిగిన పడవ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు పీఎం జాతీయ సహాయ నిధి (పీఎంఎన్ఆర్ఎఫ్) నుంచి రూ. 2 లక్షల చొప్పున ఆర్థిక సహాయాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రకటించారు. అలాగే ఈ ప్రమాదంలో గాయపడిన వారికి రూ. 50,000 చొప్పున అందించనున్నట్లు వెల్లడించారు. సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ప్రధానమంత్రి ఈ విధంగా పేర్కొన్నారు. ప్రమాదంలో మరణించిన ప్రతి వ్యక్తి కుటుంబ సభ్యులకు పీఎంఎన్ఆర్ఎఫ్ నుంచి రూ. 2 లక్షల చొప్పున నష్ట పరిహారాన్ని అందజేయనున్నట్లు ప్రధానమంత్రి ప్రకటించారు.

## సంకుల ప్రపంచానికి సంసిద్ధం కావాలి

### హిందూ మహాసముద్ర ప్రాంతంలో దేశాల మధ్య లోతైన సహకారానికి పిలుపిచ్చిన జయశంకర్

వుదయం డెస్క్, ఏప్రిల్ 11 :



పెరుగుతున్న భౌగోళికరాజకీయ, ఆర్థిక అనిశ్చితి పెరుగుతున్న నేపథ్యంలో సహకారాన్ని, స్థైర్యాన్ని బలోపేతం చేసుకుంటూ అల్లకల్లోలంగా ఉండనున్న ప్రపంచక్రమానికి ఈ ప్రాంతం సన్నద్ధం కావాలంటూ హిందూ మహాసముద్ర దేశాలకు ఐదు కీలక ప్రాధాన్యతలను విదేశాంగ మంత్రి ఎస్ జయశంకర్ వివరించారు.

మారిషస్‌లో జరిగిన 9వ హిందూ మహా సముద్ర సదస్సును ఉద్దేశించి ప్రసంగిస్తూ, హిందూ మహా సముద్రం కేవలం ఒక భౌగోళిక ప్రాంతం కాదని, ఆర్థిక వ్యవస్థలను, జీవనోపాధులను, అనుసంధానతను, వనరులను, ఉమ్మడి సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించే ఒక సజీవమైన పర్యావరణ వ్యవస్థ అని జయశంకర్ అన్నారు. పరస్పర అనుసంధానితమైన వ్యవస్థలో ఎటువంటి అవాంతరమైన సుదీర్ఘ పరిణామాలకు దారి తీస్తుందంటూ, స్థిరత్వం, సముద్ర క్షేత్రాన్ని జాగ్రత్తగా నిర్వహించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు.

వలసకాలం నుంచి పొందిన చారిత్రిక ఆటంకాలను అధిగమించేందుకు ఈ ప్రాంతంలోని దేశాలు కృషిని కొనసాగిస్తూ, లోతైన ప్రాంతీయ సహకారాన్ని కలిగి ఉండాలని అన్నారు. బలమైన ఆర్థిక లంకెలు, మెరుగైన అనుసంధానత, సంప్రదాయ సంబంధాల పునరుద్ధరణ ప్రాముఖ్యతను నొక్కి చెప్తూ, ప్రపంచం విచ్ఛిన్నం కావడం పెరుగుతున్నా, ఈ దేశాలు తమ దీర్ఘకాలిక సామూహిక లక్ష్యాలను విస్మరించకూడదని విజ్ఞప్తి చేశారు.

మారుతున్న ప్రపంచ క్రమం స్వభావాన్ని పట్టి చూపుతూ, ప్రపంచం మరింత పోటీ తత్వాన్ని కలిగి, అంతర్ముఖమై, విచ్ఛిన్నమవుతోందని, పరస్పరం ఆధారపడటాన్ని ఒక ఆయుధంగా మార్చే ధోరణుల వల్ల గ్లోబలీకరణ ప్రయోజనాలు క్రమంగా మరుగున పడిపోతున్నాయి. ఇది, అనిశ్చితి వాతావరణంలో దేశాలు మరింత విశ్వసనీయమైన భాగస్వామ్యాలను, అధిక స్థితిస్థాపకతను కోరుకునేలా ప్రేరేపిస్తోందని ఆయన అన్నారు.

భౌతిక, భావనాత్మక అడ్డంకుల గురించి పెరుగుతున్న ఆందోళనలను గురించి ప్రస్తావించారు. సముద్రపరమైన చోక్ పాయింట్లు వ్యూహాత్మకంగా కీలకమైనవి అయినప్పటికీ, ఆర్థిక, సాంకేతికత, వనరులు, జ్ఞానానికి సంబంధించి పెరుగుతున్న అటువంటి ఇబ్బందులను గురించి ప్రస్తావిస్తూ, నియంత్రిత వ్యవస్థలు ప్రపంచ సంక్షేమానికి ఆటంకాన్ని కలిగిస్తాయని, కనుక అవి మరింత బహిరంగ, స్థిరమైన ప్రవాహాల ఆవశ్యకతను నొక్కి చెప్పారు. ప్రపంచ సరళులు వాస్తవం, వాటిని విస్మరించలేమని నొక్కి చెప్పారు. చోక్‌పాయింట్లు ప్రస్తుతం ప్రపంచ ఆందోళనకు కారణమయ్యాయని పేర్కొన్నారు.

అంతిమంగా, హిందూ మహాసముద్ర దేశాల మధ్య లోతైన సహకారానికి జయశంకర్ పిలుపిచ్చారు. ఆహారం, ఇంధనం, ఎరువుల కొరత; విపత్తుల ప్రతిస్పందన; సంఘర్షణల పర్యవసానాలు వంటి ఉమ్మడి సవాళ్లను ఎదుర్కోవడం ఈ ప్రాంతాన్ని గ్లోబల్ సౌత్ ఓషన్ (మహాసముద్రం)గా అభివర్ణించారు.

హిందూ మహాసముద్ర దేశాల మధ్య లోతైన సహకారం కోసం తపన ఉందని, అనేకరకాలుగా ఇది గ్లోబల్ సౌత్ మహాసముద్రమని అన్నారు. అది ఆహారం, ఇంధనం లేదా ఎరువుల కొరత కావచ్చు లేదా ప్రకృతి విపత్తులకు ప్రతిస్పందన కావచ్చు లేదా సంఘర్షణల పరిణామాల పరిష్కారం కావచ్చు వీటన్నింటికీ సమాధానం సామూహిక బలం అవసరం అని అన్నారు.

నైబర్‌హుడ్ ఫస్ట్ విధానం ద్వారా భారత్ వైఖరి ప్రతిఫలిస్తుందని ఆయన అన్నారు. పశ్చిమాసియాలోని సంఘర్షణలను ప్రస్తావిస్తూ, దానివల్ల కలుగుతున్న మానవీయ, ఆర్థిక ప్రభావం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. పౌరుల భద్రత, నిరాకటంకమైన సముద్ర యానం ప్రాధాన్యతకు పిలుపునిస్తూ, ప్రపంచ వ్యాప్తంగా ఇంధన ధరలు, వాణిజ్య సరఫరాలు, ఆహార భద్రతపై దాని ప్రభావాలను గురించి ఆందోళన వ్యక్తం చేశారు.



# వరంగల్ | ఖమ్మం | నల్లగొండ ఉమ్మడి జిల్లాల వార్తలు

## ఘనంగా మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి



**హన్మకొండ ఏప్రిల్ 11 (ఉదయం ప్రతినిధి) :**

మహాత్మా జ్యోతిరావు పూలే 200వ జయంతి ఉత్సవాల సందర్భంగా వరంగల్ నగరంలోని ములుగు రోడ్ వద్ద గల మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య శాసన మండలి సభ్యులు బస్వరాజు సారయ్య, వరంగల్ పశ్చిమ నియోజక వర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి వరంగల్, హనుమకొండ జిల్లా కలెక్టర్లు డాక్టర్ సత్య శారద, చాహత్ బాజ్ పాయి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం వారు మహాత్మా పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రసంగించిన ప్రజాప్రతినిధులు మహాత్మా జ్యోతిరావు పూలే సేవలను స్మరించుకుంటూ, ఆయన సమాజ సంస్కరణల కోసం చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. సమానత్వం, విద్యా విస్తరణ, మహిళా సాధికారత కోసం ఆయన చేసిన పోరాటం నేటి తరానికి మార్గదర్శకమని తెలిపారు. వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని, మహాత్మా పూలే ఆశయాలను సాధించేందుకు పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హన్మకొండ, వరంగల్ జిల్లాల ఆదనపు కలెక్టర్లు రవి, వై వి గణేష్, సంధ్యారాణి, డిబిసిడిఓలు పుష్పలత, నర్సింహ, జిల్లా అధికారులు, బిసి సంఘాల ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## ఇంటర్ డిస్ట్రిక్ట్ టెన్నిస్ టోర్నీ ప్రారంభం

**వరంగల్ టౌన్, ఏప్రిల్ 11 (ఉదయం ప్రతినిధి) :**



వరంగల్ జిల్లా టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంతర్ జిల్లాల టెన్నిస్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యకరమైన సమాజం కోసం యువత క్రీడల్లో చురుగ్గా పాల్గొనాలని, క్రీడాకారులకు ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుందని తెలిపారు. అధ్యక్షుడు గంద్ర సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ, టెన్నిస్ పట్ల ఆసక్తి పెరుగుతోందని, ఈ టోర్నీలో మొత్తం 90 జట్లు పాల్గొంటున్నాయని వెల్లడించారు. విద్యతో పాటు క్రీడలను తప్పనిసరి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు ఏసీపీ నరసింహరావు, కన్నా రెడ్డి, బాబు రెడ్డి, డా. జయసింహ రెడ్డి, మురుగన్ తదితరులు పాల్గొన్నారు.

## జంక్ ఫుడ్‌కు స్వస్తి పలకాలి : మంత్రి సీతక్క

**ఇంటి వంటకే ప్రాధాన్యత ఇవ్వాలి**
**ములుగులో ఘనంగా 'పోషణ్ పక్వాడ' అవగాహన ర్యాలీ**
**ములుగు, ఏప్రిల్ 11 (ఉదయం ప్రతినిధి) :**



రాష్ట్రంలోని గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యాన్ని కాపాడడమే లక్ష్యంగా ప్రభుత్వం 'పోషణ్ పక్వాడ' (పోషకాహార మాసోత్సవం) నిర్వహిస్తోందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) తెలిపారు. శనివారం రోజున ములుగు జిల్లా కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలీని ఆమె జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం పద్మశాలి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో మంత్రి ప్రసంగించారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ... పోషకాహారమే రక్షణ ఏప్రిల్ 9 నుండి 23 వరకు 15 రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు జరుగుతాయి. జంక్ ఫుడ్ వల్ల పిల్లలు చిన్న వయసులోనే అనారోగ్యానికి గురవుతున్నారు. తల్లులు తమ చేతులతో వండిన నాణ్యమైన ఆహారాన్నే పిల్లలకు అందించాలి. అంగన్వాడీల బలోపేతం కొరకు "అమ్మ మాట అంగన్వాడీ బాట" నినాదంతో ప్రతి అంగన్వాడీ కేంద్రం ద్వారా నాణ్యమైన పోషకాహారం అందిస్తున్నామని మంత్రి సీతక్క తెలిపారు. చిన్న పిల్లలకు సెల్ ఫోన్లు అలవాటు చేయడం వల్ల కంటి చూపు దెబ్బతినడమే కాకుండా మానసిక వికాసం కుంటుపడుతుంది. తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి, ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజల దాహార్తిని తీర్చేందుకు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్, పాత బస్టాండ్ వద్ద చలివేంద్రాలను ప్రారంభించాం, వృద్ధులు, పిల్లల పట్ల ప్రత్యేక జాగ్రత్తలు వహించాలని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, మున్సిపల్ చైర్‌పర్సన్ చింతనిప్పుల చంద్రకళ, డి.డబ్ల్యూ.ఓ ప్రేమలత, సి.డి.పి.ఓ శిరీష, తదితర అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## మందుల నియంత్రణపై అవగాహన ర్యాలీ

**– జెండా ఊపి ప్రారంభించిన కలెక్టర్ డాక్టర్ సత్య శారద**
**వరంగల్, ఏప్రిల్ 11 (ఉదయం జిల్లా ప్రతినిధి) :**




'ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఔషధ నియంత్రణ పరిపాలన శాఖ వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో శనివారం రోజున మందుల నియంత్రణ వ్యవస్థ బలోపేతంపై అవగాహన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తవాడలోని కెమిస్ట్ భవన్ వద్ద జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ర్యాలీకి జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ పోచమ్మ మైదానం కూడలి వరకు కొనసాగింది.ర్యాలీలో పాల్గొన్న అధికారులు, సిబ్బంది, ఔషధ విక్రేతలు ప్లే కార్డులు చేతబూని "మందులు వద్దు - జీవితం ముద్దు", "డాక్టర్ సలహాతోనే మందులు వాడండి", "లైసెన్స్ ఉన్న మెడికల్ షాపుల నుంచే మందులు కొనాలి", "నకిలీ మందులను అరికట్టాలి" వంటి నినాదాలు చేస్తూ ప్రజల్లో అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణలో నాణ్యమైన మందుల వినియోగం కీలకమని పేర్కొన్నారు. అనుమతి లేకుండా మందుల విక్రయం, నకిలీ మందుల తయారీ మరియు పంపిణీపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజలు తప్పనిసరిగా వైద్యుల సూచనల మేరకు మాత్రమే మందులు వినియోగించాలని సూచించారు.అలాగే నకిలీ మందులపై ఎలాంటి సమాచారం ఉన్నా ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ 1800 599 6969 కు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీఓ సుమ, జిల్లా ఔషధ నియంత్రణ శాఖ అధికారులు, జిల్లా అధికారులు,వైద్యులు, ఫార్మసిస్టులు, ఆరోగ్య శాఖ సిబ్బంది, ఔషధ విక్రేతలు తదితరులు పాల్గొన్నారు.

## పేదల సంక్షేమమే ప్రభుత్వ ప్రాధాన్యత

**రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**
**రోడ్డు, స్లాబ్ కల్వర్టు నిర్మాణ పనులకు శంకుస్థాపన**
**మంత్రి పొంగులేటి**
**ఖమ్మం, ఏప్రిల్ -11 (ఉదయం రూరల్)**



పేద ప్రజల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ప్రాధాన్యత అని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు.మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి శనివారం ఖమ్మం రూరల్ మండలంలో పర్యటించి అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డితో కలిసి మంగళగూడెం గ్రామంలో 2 కోట్ల 50 లక్షల రూపాయల వ్యయంతో కొత్తూరు నుండి కాచిరాజుగూడెం రోడ్డు, స్లాబ్ కల్వర్టు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గత పర్యటనలో ఈ ప్రాంతంలో వరదల సమస్యను స్వయంగా పరిశీలించి ప్రజలకు ఇచ్చిన హామీని నేడు నెరవేర్చినందుకు సంతోషంగా ఉందన్నారు.


ఈ కల్వర్టు నిర్మాణం నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.

గడిచిన రెండు సంవత్సరాల మూడు నెలల్లో 64 కోట్ల 92 లక్షల రూపాయల అభివృద్ధి నిధులు తీసుకువచ్చినట్లు తెలిపారు. ఈ నిధులతో సీసీ రోడ్లు, తాగునీటి సౌకర్యాలు, సీసీ డ్రెయిన్లు తదితర పనులు చేపట్టినట్లు అన్నారు. మిగిలి ఉన్న సీసీ రోడ్లు, డ్రెయినేజ్ పనులను కూడా త్వరలో పూర్తి చేస్తామని తెలిపారు.పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రాధాన్యత అని మంత్రి తెలిపారు. పేద కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రైతులకు 2 లక్షల రూపాయల వరకు రుణమాఫీ, రైతు భరోసా, ధాన్యానికి మద్దతు ధరతో పాటు క్వింటాల్‌కు 500 రూపాయలు బోనస్, వ్యవసాయ యంత్రాలకు సబ్సిడీ వంటి పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు.ఇందిరమ్మ ఇళ్ల పథకంలో మొదటి దశ ఇళ్లను ఇప్పటికే మంజూరు చేసినట్లు, త్వరలో రెండో దశ ఇళ్లను కూడా మంజూరు చేస్తామని తెలిపారు. ప్రతి అర్హులైన లబ్ధిదారునికి ఇల్లు అందించే వరకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రతిపక్షాలు అడ్డంకులు సృష్టించే ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ, ప్రభుత్వ దృష్టి ఎల్లప్పుడూ ప్రజల సంక్షేమం పైనే ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో ఏదులాపురం మునిసిపల్ చైర్ పర్సన్ పోకబత్తిని అనిత, మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ హరినాథ్ బాబు, పాలేరు నియోజక వర్గ ప్రత్యేక అధికారి రమేష్, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఖమ్మం ఆర్డీఓ శ్రీనివాస్, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## పూలే ఆశయాల సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

**అదనపు కలెక్టర్ కె సీతారామా రావు**
**సూర్యాపేట ఏప్రిల్ 11(ఉదయం):**



సామాజిక న్యాయం కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడు శ్రీ మహాత్మా జ్యోతి రావు పూలే అని మున్సిపల్ చైర్ పర్సన్ మోరిశెట్టి నివేదిక లక్షాధి తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని యం.జి. రోడ్డు సర్కిల్ వద్ద వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మహాత్మా జ్యోతి రావు పూలే జయంతి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కే. సీతారామా రావుతో కలిసి పాల్గొని, జ్యోతి రావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చైర్పర్సన్ మాట్లాడుతూ మహనీయుడు జ్యోతి రావు పూలే జయంతి సందర్భంగా ఆయనను స్మరించుకోవడం గొప్ప గౌరవమని తెలిపారు. సమానత్వ సమాజ నిర్మాణంలో పూలే కీలక పాత్ర పోషించారని ఉద్బోధించారు. ఆ కాలంలో కుల, మత భేదాలు ఉన్న పరిస్థితుల్లో సామాజిక సంస్కరణలకు పూలే శ్రీకారం చుట్టారని గుర్తుచేశారు. ఆ రోజుల్లో కుల వివక్ష కారణంగా అనేక వర్గాల ప్రజలను దేవాలయాలు, పాఠశాలల్లోకి అనుమతించని పరిస్థితులను పూలే ధైర్యంగా ఎదిరించి సమాజంలో మార్పు తీసుకువచ్చారని తెలిపారు. అందుకే వారి జయంతిని ఘనంగా జరుపుకుంటున్నా మని అన్నారు. అదనపు కలెక్టర్ కే. సీతారామారావు మాట్లాడుతూ కుల వివక్ష లేకుండా సమాజం అభివృద్ధి చెందాలని, ప్రతి ఒక్కరూ విద్యను పొందాలని శ్రీ మహాత్మా జ్యోతి రావు పూలే బోధించిన సిద్ధాంతాలని తెలిపారు. ఆ కాలంలోనే మహిళా విద్య కోసం పూలే చేసిన కృషి అపారమని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వేణు మాధవరావు, ఏసిపి ప్రసన్న కుమార్, డిటిడిఓ శంకర్, డిఎంఓ నాగేశ్వర శర్మ, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి నరసింహులు, ఎస్సీ వెల్ఫేర్ అధికారి కొల్లి లత, టీఎన్జీవోస్ జిల్లా సెక్రెటరీ దున్న శ్యామ్, మాజీ శాసనసభ్యులు దోసపాటి గోపాల్, మాజీ మున్సిపల్ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ, పెరుమాళ్ళ అన్నపూర్ణ, డాక్టర్ ఊర రామ్మూర్తి యాదవ్, వసంత సత్యనారాయణ పిలే, చల్లమల్ల నరసింహ, వై వెంకటేశ్వర్లు, చింతలపాటి చిన్న శ్రీరాములు తప్పెట్ల శ్రీరాములు తలమల హాసన్, నిద్ర సంపత్, పంచుకోముల వెంకటేశ్వర్లు, బంటు కృష్ణ, బెల్లంకొండ రామ్మూర్తి, శ్రీకాంత్, జీడి బిక్షం, బయోమల్లి కార్జున్ , కోట గోపి, యాతాకుల రాజయ్య, జిల్లా అధికారులు, వివిధ సంఘాల నాయకులు, కుల సంఘ నాయకులు, ప్రతినిధులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## పూలే స్ఫూర్తితో సమాజాభివృద్ధికి కృషి చేయాలి : ప్రభుత్వ విప్ బీర్ల వీరయ్య

**యాదాద్రి భువనగిరి / ఏప్రిల్ (ఉదయం జిల్లా ప్రతినిధి) :**




పూలే స్ఫూర్తితో సమాజాభివృద్ధికి కృషి చేయాలని ప్రభుత్వ విప్, ఆలేరు శాసన సభ్యులు బీర్ల ఐలయ్య అన్నారు. శనివారం మహాత్మ జ్యోతిబా పూలే 200వ జయంతి సందర్భంగా జగదేవ్ పూర్ చౌరస్తా, భువనగిరి లో వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ప్రభుత్వం విప్ ఆలేరు శాసన సభ్యులు బీర్ల ఐలయ్య, భువనగిరి శాసన సభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీ వాణి, వైస్ చైర్మన్ మంజుల, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రేణుక బాబు రావు, గ్రంథాలయ చైర్మన్ అవేజ్ చిస్తీ, ప్రజా ప్రతినిధులు, బిసి సంఘం సభ్యులు విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విప్ మాట్లడుతూ... మహాత్మా జ్యోతిరావు పూలే ప్రపంచ మేధావి, విద్యా సంస్థలు నెలకొల్పి విద్యా ద్వారా అన్ని సాధించవచ్చనే ఉద్దేశంతో తనతో పాటు తన సతీమణి కూడా విద్యాభ్యాసం చేసి భారతదేశంలో మొట్టమొదటి ఉపాధ్యాయులుగా పనిచేసారు. బాల బాలికలకు విద్యాభ్యాసం నేర్పించిన ఘనత ఆమెదే అన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే సమాజంలో సమానత్వం, విద్యా విస్తరణ, మహిళా సాధికారత కోసం చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. భువనగిరి శాసన సభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు పూలే మహిళలకు ప్రభుత్వంకు పెద్ద పీట వేసిందని, మహిళలకు మహాలక్ష్మి పథకం తీసుకొని రావడం జరిగిందని అన్నారు. బాలికల విద్యకు ప్రాధాన్యత ఇచ్చిన తొలి సంస్కర్తల్లో ఒకరని, కులవ్యవస్థకు వ్యతిరేకంగా పోరాటం చేసి సమాజంలో సమానత్వం, విద్యా విస్తరణకు చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. వారి ఆశయాలను అనుసరించి ప్రతి ఒక్కరూ సమాజ అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి సాహితి, బి.సి కుల సంఘాల సభ్యులు, వివిధ కుల సంఘాల సభ్యులు, ప్రజా ప్రతి నిధులు తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన విద్య, మెరుగైన వైద్యం - నిరుపేదలకు సంక్షేమ పథకాలను అందించడమే ప్రధాన లక్ష్యం

**ప్రభుత్వ సేవలు ప్రజలకు చేరువ**
**ప్రజావాణి సమస్యలను పరిష్కరించడంలో ప్రత్యేక శ్రద్ధ**
**సులభంగా ఈ-ఆఫీసు నిర్వహణ**
**ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట**
**పారదర్శకంగా అవుట్సోర్స్ నియామకాలు**
**ఇటు ఆకస్మిక తనిఖీలు - అటు నిరంతర సమీక్షలు**
**జనగామ జిల్లా అభివృద్ధికి కలెక్టర్ ప్రత్యేక శైలి**





జనగామ జిల్లా అభివృద్ధిలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తనదైన ముద్రను స్పష్టంగా చూపిస్తున్నారు. పరిపాలనలో పారదర్శకత, సమన్వయం, మానవీయ దృక్పథం కలగలిపి ప్రజలకు చేరువై సరైన పాలనను అందిస్తున్నారు.

**ప్రజావాణి ద్వారా ప్రజలకు చేరువైన కలెక్టర్**

ప్రజావాణి కార్యక్రమం ద్వారా జిల్లా కలెక్టర్ జిల్లా పరిపాలనలో ప్రజలకు నమ్మకాన్ని అందిస్తున్నారు. అర్జీదారుల సౌకర్యార్థం కుర్చీని ఏర్పాటు చేసి, వారి వినతులను కలెక్టర్ తానే స్వయంగా స్వీకరిస్తూ, ఫిర్యాదులను విని, క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులను వెంటనే స్పందించేలా ఆదేశాలు జారీ చేస్తున్నారు. ప్రతి అర్జీపై శ్రద్ధ చూపుతూ, వేగవంతమైన పరిష్కారానికి చర్యలు తీసుకోవడం ద్వారా ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందిస్తున్నారు.

ఈ విధంగా సమస్యల పరిష్కారంలో కలెక్టర్ పారదర్శకత, సమయపాలన పాటించడంతో ప్రజావాణి కార్యక్రమం ప్రజలకు నిజమైన భరోసాగా మార్చడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు.

**సమయపాలనలో అందరినీ ఏకతాటికి తెచ్చిన కలెక్టర్**

జిల్లా పరిపాలనలో సమయపాలనకు జిల్లా కలెక్టర్ ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చారు. అధికారులు, ఉద్యోగులు సమయానికి విధులకు హాజరై, బాధ్యతాయుతంగా పనిచేయాలనే దిశగా పలు మార్గదర్శకాలను పక్కాగా (ఫేషియల్ అటెండెన్స్) అమలు చేశారు. వివిధ శాఖల కార్యాలయాల్లో పెండింగ్ ఫైల్ ల ఆలస్యాలను తగ్గించి, పనుల వేగాన్ని పెంచేలా చర్యలు తీసుకున్నారు. ఈ క్రమంలో అన్ని శాఖల అధికారులు, సిబ్బందిని ఒకే తాటిపైకి తీసుకువచ్చి, సమన్వయంతో పనిచేసే వాతావరణాన్ని ఏర్పరచారు. సమయపాలనను ఖచ్చితంగా పాటించడం వల్ల ప్రజలకు సేవలు వేగంగా అందుతుండటం విశేషం, జిల్లా కలెక్టర్ తీసుకున్న ఈ చర్యలు జిల్లాలో క్రమశిక్షణ, సమర్థతకు కొత్త దిశను చూపుతున్నాయి.

**పారదర్శకంగా అవుట్సోర్సింగ్ పోస్టుల నియామకాలు**

జిల్లాలోని వివిధ శాఖల ద్వారా అవుట్సోర్సింగ్ పోస్టుల భర్తీ ప్రక్రియలో కలెక్టర్ పారదర్శకతకు ప్రాధాన్యత ఇస్తున్నారు. అభ్యర్థుల ఎంపికలో ఎటువంటి అనుమానాలకు, పొరపాట్లకు తావులేకుండా పరీక్షలు, ఇంటర్వ్యూలను నిష్పక్షపాతంగా నిర్వహిస్తున్నారు.

అర్హతలు, మెరిట్ ఆధారంగా ఎంపిక జరిగేలా స్పష్టమైన విధానాలను అమలు చేస్తూ, ప్రతి దశలో పారదర్శకతను తప్పనిసరిగా పాటిస్తున్నారు. జిల్లా కలెక్టర్ చేపట్టే ఈ చర్యల వల్ల అర్హత గల నిరుద్యోగుల్లో నమ్మకం పెరిగి, నియామక ప్రక్రియపై విశ్వాసం బలపడుతోంది.అలాగే అవుట్సోర్సింగ్ నియామకాల్లో నిజాయితీ, నిబద్ధతతో కూడిన ఈ విధానంతో జిల్లా పరిపాలనలో సానుకూల మార్పులకు దారితీస్తూ ఆదర్శంగా నిలుస్తోంది.

**మైనింగ్ పై కలెక్టర్ ఉక్కుపాదం**

జిల్లాలో అక్రమ మైనింగ్‌పై జిల్లా కలెక్టర్ ఉక్కుపాదం మోపుతున్నారు. అనుమతులు లేకుండా జరుగుతున్న తవ్వకాలను అరికట్టేందుకు నిరంతరం ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ, కఠిన చర్యలు తీసుకుంటూ, ఆంక్షలు విధిస్తున్నారు. మైనింగ్ అధికారులను అప్రమత్తం చేసి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు చేపడుతున్నారు. ప్రభుత్వ ఆదాయం కాపాడటంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ, మైనింగ్ కార్యకలాపాలు నియమ నిబంధనలకు అనుగుణంగా సాగేందుకు కట్టుదిట్టమైన పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు. మైనింగ్ వంటి కీలక రంగాల్లో అక్రమాలపై కట్టడి కోసం జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు చేపడుతున్నారు. దీంతో జిల్లాలో అక్రమ మైనింగ్ కార్యకలాపాలు గణనీయంగా తగ్గుముఖం పట్టాయి.

**అక్రమ తవ్వకాలు, అక్రమ ఇసుక తరలింపుపై కలెక్టర్ కట్టుదిట్ట చర్యలు**

జిల్లాలో అక్రమ ఇసుక, గ్రావెల్ తవ్వకాలపై జిల్లా కలెక్టర్ ఉక్కుపాదం మోపుతున్నారు. తహసీల్దార్లు ఇచ్చే మాన్యువల్ కూపన్లను పూర్తిగా రద్దు చేసి, అన్ని అనుమతులను ఆన్‌లైన్ విధానంలోకి మార్చారు. జిల్లా స్థాయిలో పది మందితో కూడిన ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేసి కట్టుదిట్టంగా పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు. ఇసుక తరలింపుకు సంబంధించి అనుమతి లేకుండా ఎలాంటి తవ్వకాలకు అవకాశం లేకుండా చర్యలు తీసుకుంటూ, కలెక్టరేట్ నుంచి మాత్రమే అనుమతి పొందేలా, మైనింగ్ లీజు ఏరియాల బయట తవ్వకాలు జరగకుండా కఠినంగా ఆంక్షలు అమలు చేస్తున్నారు. అక్రమ రవాణా చేసే వాహనాలను, అక్రమ తవ్వకాలు చేసే మిషన్ లు జిల్లాలో ఎక్కడ కనపడినా కూడా సీజ్ చేసి, మేజిస్ట్రేట్ విధుల ద్వారా పెనాల్టీలు విధిస్తూ, వాల్టా చట్టం కింద కేసులు కూడా నమోదు చేస్తున్నారు.జిల్లా కలెక్టర్ తీసుకునే ఈ చర్యల వల్ల జిల్లాలో అక్రమ తవ్వకాలు, అక్రమ ఇసుక రవాణా గణనీయంగా తగ్గి, ప్రభుత్వ ఆదాయాన్ని పెంచే దిశగా దోహదపడుతోంది.

**విద్య, వైద్య రంగాల్లో ఆకస్మిక తనిఖీలు – కలెక్టర్ తనదైన ముద్ర**

జిల్లాలో విద్య, వైద్య రంగాల మెరుగుదల కోసం కలెక్టర్ ప్రత్యేక దృష్టిసారిస్తున్నారు. పాఠశాలలు, ఆసుపత్రుల్లో ఉదయం 8 గంటలకే ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ, సేవల నాణ్యతను పర్యవేక్షిస్తున్నారు.విద్యార్థులకు సరైన బోధన, మధ్యాహ్న భోజనం, పది విద్యార్థులు పరీక్షల్లో ఉత్తమ మార్కులతో ప్రతిభ కనబరిచే విధంగా ప్రోత్సహిస్తూ, ఉపాధ్యాయులకు సూచనలు చేస్తూ, తానే స్వయంగా విద్యార్థులకు సులభ పద్ధతులచే బోధనలు చేస్తూ, అలాగే ఆసుపత్రుల్లో రోగులకు మెరుగైన చికిత్స అందుతున్నాయా అనే అంశాలను స్వయంగా పరిశీలిస్తున్నారు. తనిఖీల సందర్భంగా లోపాలను గుర్తించి వెంటనే సరిదిద్దేలా అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నారు. నిర్లక్ష్యానికి తావులేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. ఈ చర్యల వల్ల ప్రభుత్వ సేవలపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతోంది.

ప్రతి రోజూ జిల్లా కలెక్టర్ ఉదయాన్నే ఆకస్మిక తనిఖీలు చేపట్టడం వల్ల ప్రతి పాఠశాలలోని ఉపాధ్యాయులు, సిబ్బంది, అలాగే ప్రతి ఆసుపత్రిలోని అధికారులు, వారి సిబ్బంది సమయానుకూలంగా హాజరవడంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య, అదే విధంగా రోగులకు మెరుగైన వైద్యం సకాలంలో అందుతోంది. ప్రభుత్వ ఆసుపత్రుల్లోని గర్భిణీలకు ప్రసవాలు జరిగేలా ఎప్పటికప్పుడు వైద్య శాఖ అధికారులతో సమీక్షలు చేస్తూ, పకడ్బందీ చర్యలు చేపడుతున్నారు. ఈ విధంగా తనదైన శైలిలో క్రమశిక్షణ, బాధ్యతను పెంపొందిస్తూ కలెక్టర్ జిల్లా అభివృద్ధిలో ముఖ్య పాత్ర పోషిస్తున్నారు.

**అంగన్వాడీల బలోపేతంలో కలెక్టర్ కృషి**

జిల్లాలో అంగన్వాడీ కేంద్రాల బలోపేతానికి కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు మెరుగైన పోషకాహారం, ఆరోగ్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నారు.

అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు మెరుగుపరిచి, టీచర్లు, ఆయాల పనితీరును పర్యవేక్షిస్తూ, సేవల నాణ్యతను పెంచుతున్నారు.పిల్లల హాజరు, పోషణ స్థితి, ఆరోగ్య పరీక్షలు, చిన్నారుల ఆరోగ్యంపై నిరంతరం సమీక్షలు నిర్వహిస్తున్నారు.కేంద్రాల్లో మౌలిక వసతులు మెరుగుపరిచి, పిల్లలు సురక్షితంగా, సౌకర్యవంతంగా ఉండే వాతావరణాన్ని కల్పిస్తున్నారు. పోషకాహార పంపిణీని క్రమబద్ధీకరించి, చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు నాణ్యమైన ఆహారం అందేలా పర్యవేక్షిస్తున్నారు.అదే విధంగా ఆరోగ్య శాఖతో సమన్వయం చేసి సాధారణ ఆరోగ్య పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ చర్యల వల్ల అంగన్వాడీ సేవలపై ప్రజల్లో నమ్మకం పెరిగి, చిన్నారుల సమగ్ర అభివృద్ధి, తల్లుల ఆరోగ్య పరిరక్షణకు చాలా కృషి చేస్తున్నారు.

**ఈ - ఆఫీసు విధానంతో కాగితరహిత పరిపాలనకు కలెక్టర్ శ్రీకారం**

జిల్లాలో పరిపాలనను ఆధునికీకరించేందుకు కలెక్టర్ ఈఆఫీసు విధానాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నారు. ఫైళ్ల నిర్వహణను డిజిటల్ విధానంలోకి మార్చి, పేపర్‌లెస్ పరిపాలనకు శ్రీకారం చుట్టారు. ఈ విధానంతో పనుల వేగం పెరగడంతో పాటు పారదర్శకత, బాధ్యతాయుత వ్యవహారం మెరుగుపడుతోంది. అధికారులు, ఉద్యోగులు సులభంగా ఫైళ్లను ట్రాక్ చేయగలుగుతూ నిర్ణయాల ప్రక్రియ వేగవంతమవుతోంది.సాంకేతికతను వినియోగిస్తూ పరిపాలనలో మార్పులు తీసుకువస్తున్న జిల్లా కలెక్టర్ సమర్థవంతమైన సేవలందించడంలో కొత్త దిశను చూపిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న సంక్షేమ పథకాలను ప్రతి గడపకు చేరేలా కృషి చేస్తూ ప్రభుత్వ సేవలను ప్రజల దగ్గరకు తీసుకువెళుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సాధారణ ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను ఆప్యాయంగా విని పరిష్కరించడంలో జిల్లా కలెక్టర్ ప్రత్యేక గుర్తింపు పొందుతున్నారు తక్కువ సమయంలోనే తన పని తీరు ద్వారా ప్రజల విశ్వాసాన్ని గెలుచుకుని, జనగామ జిల్లా అభివృద్ధికి బలమైన పునాది వేస్తున్నారు.

## పూలే ఆశయాలు భావితరాలకు చేరవేయాలి: కలెక్టర్ బి. చంద్రశేఖర్

**నల్గొండ, ఏప్రిల్ 11(ఉదయం):**




సమానత్వం, సామాజిక న్యాయం, నాణ్యమైన విద్య కోసం కృషి చేసిన మహాత్మ జ్యోతిబా పూలే ఆశయాలను భావితరాలకు తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉందని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు.జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం నల్గొండలోని క్లాక్ టవర్ వద్ద నిర్వహించిన మహాత్మ జ్యోతిబా పూలే ద్విశతాబ్ది ఉత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వెనుకబడిన వర్గాల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నదని తెలిపారు. విద్యార్థులకు ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ స్కాలర్షిప్‌లు అందించడంతో పాటు నాణ్యమైన విద్యను అందిస్తున్నామని పేర్కొన్నారు. వసతి గృహాల్లో మరిన్ని సౌకర్యాలు అభివృద్ధి చేయాల్సి ఉందని చెప్పారు.ప్రతి నియోజకవర్గంలో రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను నిర్మిస్తున్నామని, ఒక్కో పాఠశాలలో 2,600 మంది విద్యార్థులు చదువుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. అలాగే తెలంగాణ మోడల్ స్కూల్స్ ఏర్పాటు కోసం ప్రతిపాదనలు పంపినట్లు వెల్లడించారు.ఓవర్సీస్ విద్యానిధి పథకం కింద జిల్లాలో 12 మందికి ఆర్థిక సహాయం అందించామని, కులాంతర వివాహం చేసుకున్న 21 మందికి ప్రోత్సాహకాలు అందించినట్లు తెలిపారు. విద్యార్థులు ప్రశ్నించే మనస్తత్వాన్ని అలవాటు చేసుకుని చదువులో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మహాత్మ జ్యోతిబా పూలే మహిళా విద్యకు మార్గదర్శకుడని, ఆయన జీవితం విద్యార్థులకు ప్రేరణగా నిలుస్తుందని అన్నారు. ఎమ్మెల్సీ నెలకుంటి సత్యం మాట్లాడుతూ కుల వ్యవస్థ నిర్మూలనకు పూలే చేసిన కృషి ఆదర్శప్రాయమని, విద్యాభివృద్ధికి మరిన్ని నిధులు అవసరమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, డిప్యూటీ మేయర్ అమీర్ అలీ, అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి, జిల్లా బీసీ సంక్షేమ అధికారి సంజీవ, తహసిల్దార్ పరశురాం పాల్గొన్నారు.

## ఆదివాసి విద్యాభివృద్ధికి వినతి

**న్యాయ కళాశాల, గురుకుల కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్**
**భద్రాచలం ఏప్రిల్ 11 (ఉదయం ప్రతినిధి) :**



శుక్రవారం నాడు భద్రాచలంలో నిర్వహించిన ఆదివాసీల సమ్మేళనానికి విచ్చేసిన పంచాయతీరాజ్ మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రివర్యులు సీతక్కకు జి ఎస్ పి రాష్ట్ర అధ్యక్షులు పాయం సత్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శి పూనే ఓ. సాయి దొరలు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతమైన భద్రాచలం కేంద్రంగా ఆదివాసి విద్యార్థుల ఉన్నత విద్యాభివృద్ధి కోసం ప్రత్యేకంగా ఆదివాసి న్యాయ కళాశాల ఏర్పాటు చేయాలని కోరారు. ఆదివాసి విద్యార్థులు తమ హక్కులు, భూమి చట్టాలు, అటవీ చట్టాలపై పూర్తి అవగాహన పొందాలంటే న్యాయ విద్య అత్యంత అవసరమని తెలిపారు. భద్రాచలం కేంద్రంగా న్యాయ కళాశాల ఏర్పాటు చేస్తే ప్రాంతంలోని గిరిజన యువతకు న్యాయ పరిజ్ఞానం పెరిగి, తమ హక్కులను రక్షించుకునే సామర్థ్యం పెరుగుతుందని పేర్కొన్నారు.

అలాగే వెంకటాపురం మండల కేంద్రంలోని చిరుతపల్లి 1 గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలను అప్‌గ్రేడ్ చేసి గురుకుల కళాశాలగా ఏర్పాటు చేయాలని కోరారు. ప్రస్తుతం ఇంటర్మీడియట్ విద్య అందుబాటులో లేకపోవడంతో అనేక ఆదివాసి బాలికలు పదో తరగతి తర్వాత చదువును మధ్యలోనే మానేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గురుకుల కళాశాల ఏర్పాటు ద్వారా గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు వసతి, భోజన సదుపాయాలు లభించి వారి భవిష్యత్తు బలపడుతుందని తెలిపారు. ముఖ్యంగా బాలికల విద్యాభివృద్ధికి ఇది ఎంతో దోహదపడుతుందని చెప్పారు. ఏజెన్సీ ప్రాంతాల్లో విద్యా వసతులు పెంపొందించడం ద్వారా సామాజిక, ఆర్థికంగా వెనుకబడిన గిరిజన వర్గాల అభివృద్ధి సాధ్యమవుతుందని జి ఎస్ పి నాయకులు అభిప్రాయపడ్డారు. ప్రభుత్వము ప్రత్యేక దృష్టి సారించి ఆదివాసి విద్యార్థుల కోసం మరిన్ని విద్యాసంస్థలు, వసతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ వినతిపై మంత్రి వర్యులు సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో పలువురు ఆదివాసి నాయకులు, విద్యార్థులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# కరీంనగర్ | అదిలాబాద్ | నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల వార్తలు



హౌస్ లిస్టింగ్ బ్లాక్‌ల జనగణన కార్యక్రమాన్ని

## కచ్చితత్వంతో పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**
**హౌస్ లిస్టింగ్ బ్లాక్‌లకు ఫిజికల్ వెరిఫికేషన్ తప్పనిసరి**
**సుల్తానాబాద్ మున్సిపల్ కార్యాలయం, పెద్దపల్లి తహసిల్దార్ కార్యాలయం తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్**

పెద్దపల్లి, సుల్తానాబాద్, ఏప్రిల్ -11(వుదయం ప్రతినిధి)

హౌస్ లిస్టింగ్ బ్లాక్‌ల జనగణన కార్యక్రమాన్ని కచ్చితత్వంతో, సమగ్రంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు.

శనివారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పెద్దపల్లి పట్టణంలోని తాసిల్దార్ కార్యాలయాన్ని సుల్తానాబాద్ పురపాలక సంఘంలో జరుగుతున్న జనగణన ప్రక్రియను పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ,హౌస్ లిస్టింగ్ బ్లాక్‌లకు సంబంధించి ఫిజికల్ వెరిఫికేషన్‌ను తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు. పట్టణంలోని ల్యాండ్‌మార్క్‌లు, పాఠశాలలు, దేవాలయాలు, కార్యాలయాలు తదితర గుర్తులను బ్లాక్ వారీగా స్పష్టంగా నమోదు చేయాలని సూచించారు.హౌస్ లిస్టింగ్ బ్లాక్‌కు సంబంధించిన వివరాలు ఖచ్చితమైన సమాచారంతో సిద్ధం చేసి సమర్పించాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట పెద్దపల్లి డిప్యూటీ తహసిల్దార్ విజయ్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

జ్యోతిబాపూలే స్ఫూర్తితో

# ముందుకు సాగుదాం

**చదువును నమ్ముకుని ఉన్నతంగా ఎదగాలి**
**కరీంనగర్ కలెక్టర్ చిత్రా మిశ్రా**


కరీంనగర్, ఏప్రిల్ 11
(వుదయం ప్రతినిధి)



సమాజ సంఘసంస్కర్త, జ్ఞానమే వికాసమని చెప్పి బాలికల విద్య కోసం కృషి చేసిన మహాత్మా జ్యోతిబాపూలే స్ఫూర్తితో మనందరం ముందుకు సాగుదామని కలెక్టర్ చిత్రా మిశ్రా పేర్కొన్నారు.

మహాత్మ జ్యోతిబాపూలే జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని శనివారం జిల్లా కేంద్రంలో శాతవాహన యూనివర్సిటీ వద్ద జ్యోతిబాపూలే విగ్రహానికి కలెక్టర్.. డీసీసీ అధ్యక్షుడు, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం , కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, అదనపు కలెక్టర్ ,రెవిన్యూ, లక్ష్మీ కిరణ్, ఆర్డీవో మహేశ్వర్, నగరం మేయర్ శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. ఏప్రిల్ నెలలో మహనీయులు జన్మించారన్నారు.

సమాజానికి పూలే అసమాన సేవలు అందించారన్నారు. చదువుతోనే సమాజంలో గుర్తింపు, గౌరవం సాధ్యమని.. చదువును నిర్లక్ష్యం చేయవద్దని యువతకు సూచించారు. ఆ రోజుల్లోనే చదువు గొప్పతనం తెలుసుకొని.. బాలికలకు విద్య అందించేందుకు పాఠశాలలు, అనాథల కోసం ఆశ్రమాలు ఏర్పాటు చేసిన మహనీయుడని పేర్కొన్నారు."చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ" 200 ఏళ్ల కిందటే అన్ని సమస్యలకు చదువే పరిష్కారమని నమ్మి.. బాలికల విద్యను ప్రోత్సహించారని గుర్తు చేశారు. అంబేద్కర్ ముగ్గురు గురువుల్లో ఒకరైన పూలే కుల వివక్ష, అంటరానితనం, మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా పోరాటం చేశారని పేర్కొన్నారు. పూలే స్ఫూర్తితో రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ సమాజంలో అంతరాలు తగ్గించేందుకు కృషి చేస్తుందని వివరించారు. అందులో భాగంగా యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేస్తుందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అందరం కలిసి కృషి చేద్దామని పిలుపునిచ్చారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ చదువుతోనే జ్ఞానం లభిస్తుందని.. జ్ఞానంతో మన సమస్యలు మనమే పరిష్కరించుకుని శక్తి వస్తుందని పేర్కొన్నారు. తన భార్య సావిత్రిబాయి కి చదువు చెప్పి ఉపాధ్యాయురాలు చేసిన ఘనత ఆ మహనీయుడి సొంతమని గుర్తు చేశారు మేయర్ శ్రీనివాస్ మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతికి పూలే ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. సామాజిక అడ్డంకులను దాటుకుని బాలికలు చదువుకునేలా పాఠశాలలు ఏర్పాటు చేశారన్నారు.డిప్యూటీ మేయర్ సునీల్ రావు మాట్లాడుతూ.. ఎన్నో సవాళ్లు ఎదుర్కొన్న పూలే.. అన్నివర్గాల అభ్యున్నతికి కృషి చేశాడని వివరించారు. ఈ సందర్భంగా పలువురు పూలే జీవితం గురించి వివరించారు. అనంతరం అంబేద్కర్, పూలే ఆలోచనలపై రచించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వివిధ కుల సంఘాల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



## మహాత్మా జ్యోతిరావు పూలే చిత్రపటానికి నివాళులు అర్పించిన జిల్లా కలెక్టర్

రాజన్న సిరిసిల్ల,ఏప్రిల్ 11
(వుదయం ప్రతినిధి)

మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో నిర్వహించగా, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరై పూలే చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం జ్యోతిరావు పూలే సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిరిసిల్ల ఆర్డీఓ వెంకటేశ్వర్లు, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి సౌజన్య, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి, ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాసాచారి, ఈడీ ఎస్సీ కార్పొరేషన్ స్వప్న, సిరిసిల్ల తహసీల్దార్ మహేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


# మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు

**సామాజిక అసమానతలను తొలగించడమే పూలే ఆశయం...**
**మహాత్మ జ్యోతి బాపూలే ఆశయాలను ఆలోచనలను ఆచరించాలి...రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

జగిత్యాల ,ఏప్రిల్ 11
(వుదయం ప్రతినిధి):

సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశం మందిరంలో శనివారం జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మహాత్మ జ్యోతి బాపూలే 200వ జయంతి వేడుకల్లో రాష్ట్ర ఎస్సీ ఎస్టీ వయోవృద్ధులు వికలాంగులు ట్రాన్స్ జెండర్ సాధికారిత శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ జగిత్యాల నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ యం సంజయ్ కుమార్ జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ లతో కలిసి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి జ్యోతి బాపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు అనంతరం రాష్ట్ర సంక్షేమ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ఏప్రిల్ మాసం అంటేనే మహనీయుల మాసం అన్నారు మహాత్మా జ్యోతిరావు పూలే విద్యా విప్లవానికి నాంది పలికిన ఆయన మహిళల విద్యకు ప్రాధాన్యతనిస్తూ తొలి బాలికల పాఠశాలను స్థాపించారు సమాజంలో ఉన్న అసమానతలను తొలగించడానికి శ్రమించి అణగారిన వర్గాలకు సమాన హక్కులు కల్పించాలనే లక్ష్యంతో పలు కార్యక్రమాలు చేపట్టారు దేశంలోని అణగారిన వర్గాల కోసం మహాత్మా జ్యోతిరావు పూలే సమాజంలో సమానత్వం విద్య న్యాయం కోసం చేసిన కృషి ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమని తెలిపారు

అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన చూపిన మార్గం ప్రస్తుత ప్రభుత్వానికి మార్గదర్శకమన్నారు ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమాలు పకడ్బందీగా అమలు చేస్తూ తెలంగాణ ప్రజా ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో మహనీయుల జయంతుల వేడుకలు ఘనంగా





నిర్వహిస్తున్నామని తెలిపారు

అదే విధంగా ప్రభుత్వం సంక్షేమ పథకాల ద్వారా పేదలు దళితులు బలహీన వర్గాల అభివృద్ధికి కట్టుబడి ఉందని పేర్కొన్నారు ముఖ్యంగా విద్య ఉపాధి సామాజిక న్యాయం రంగాల్లో పూలే ఆశయాలను అమలు చేస్తూ ముందుకు సాగుతున్నామని తెలిపారు జగిత్యాల జిల్లా విద్యా రంగంలో మహిళాభివృద్ధి కొరకు అనేక పథకాలు అమలు చేస్తుందని తెలిపారు జిల్లాకు అంబేద్కర్ స్టడీ సర్కిల్ ఏర్పాటుకు కృషి చేస్తున్నామని తెలిపారు అదే విధంగా రెసిడెన్సియల్ పాఠశాల అడ్మిషన్స్ కొరకు ఎంతమంది అప్లికేషన్ చేసుకున్నా అవకాశం కలిపించాలని జిల్లా కలెక్టర్ ను కోరారు ప్రతి ఒక్కరూ మహాత్మా పూలే ఆలోచన లను ఆచరణలో పెట్టి సమాజంలో సమానత్వం నెలకొల్పడానికి కృషిచేయాలని పిలుపునిచ్చారు మహాత్మ జ్యోతి బాపూలే జయంతి వేడుకలు నిర్వహించినందుకు అధికారులను అభినందించారు అనంతరం జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్ మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు పూలే సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి చేసిన సేవలు అమూల్యమని పేర్కొన్నారు విద్యా విస్తరణ మహిళల సాధికారత సామాజిక సమానత్వం కోసం ఆయన చేసిన కృషి తరతరాలకు మార్గదర్శకమన్నారు.ప్రస్తుత తరంలో యువత పూలే ఆశయాలను అవలంబించి సమాజంలో మార్పు తీసుకురావాలని సూచించారు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమాలు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కూడా అదే దిశగా కొనసాగుతున్నాయని తెలిపారు జిల్లాలో మహాత్మ జ్యోతి రావు పూలే సావిత్రి బాయి పూలే విగ్రహాల ఏర్పాటు కు కృషి చేశామని తెలిపారు జ్యోతి రావు పూలే మార్గదర్శకాలకు అనుగుణంగా విద్యాతోనే వికాసం అనే నానుడితో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి జగిత్యాల పట్టణానికి కాలేజీ పాఠశాలల బిల్డింగ్ ల నిర్మాణాలకు తోడ్పడుతున్నందుకు జగిత్యాలను ఎడ్యుకేషన్ హబ్ గా తీర్చిదిద్దేందుకు అహర్నిశలు కృషి చేస్తున్న రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కు ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు అనంతరం జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు పూలే సమాజంలో సమానత్వం విద్యా ప్రాధాన్యత మహిళల సాధికారత కోసం చేసిన కృషి అపారమని అన్నారు అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన చూపిన దారి నేటికీ ప్రాసంగికమైందని పేర్కొన్నారు నేడు అమలు చేస్తున్న 33శాతం మహిళా రిజర్వేషన్లు తీసుకురావడానికి అప్పటి సంస్కరణలే కారణమన్నారు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమాలు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు పూలే ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగుతున్నాయని తెలిపారు ముఖ్యంగా విద్య ఆరోగ్యం సామాజిక న్యాయం రంగాల్లో ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు కల్పించడం ప్రధాన లక్ష్యమని తెలిపారు వారి కృషిని స్ఫూర్తిని నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు అంతకంటే ముందు జగిత్యాల జిల్లా 'కళాజాత' కళాకారుల బృందం మహనీయులను స్మరిస్తూ పాటలతో అందరిని అలరించారు ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బిఎస్ లత జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ సమిండ్ల వాణి జిల్లా బిసి వెల్ఫేర్ అధికారి జి సునీత జిల్లా స్థాయి అధికారులు కలెక్టరేట్ ఏవో కిషన్ మార్కెట్ కమిటీ చైర్మన్ లు ప్రజా ప్రతినిధులు వివిధ కుల సంఘాల ప్రతినిధులు ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు



## వారసత్వ సంబురాలు

**ముఖ్య అతిథిగా రిటైర్డ్ ఐఎఎస్ పార్థసారథి**

నిర్మల్ జిల్లా , ఏప్రిల్ 11
(వుదయం ప్రతినిధి)

నిర్మల్ పట్టణంలోని సిటీ కన్వెన్షన్ ఫంక్షన్ హాల్‌లో శనివారం 'వారసత్వ సంబురాలు' కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రిటైర్డ్ ఐఎఎస్ అధికారి, మాజీ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చరిత్ర, వైద్య వృత్తి, సంస్కృతి, సాంప్రదాయాలపై జిల్లా రచయితలు రచించిన పలు పుస్తకాలను ఈ సందర్భంగా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా పార్థసారథి మాట్లాడుతూ, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. జిల్లాలో రచయితలు విశేషంగా సాహిత్య సృష్టి చేస్తున్నారని, ముఖ్యంగా మహిళా రచయితలు ముందుకు రావడం గర్వకారణమని పేర్కొన్నారు. అనంతరం వైద్యులను శాలువాలతో సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో రత్నకళ్యాణి, జిల్లా వైద్యులు, కార్యక్రమ నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

## మహాత్మా జ్యోతిబా పూలే జయంతి వేడుకలు



నిజామాబాద్ , ఏప్రిల్ 11
(వుదయం ప్రతినిధి)

మహాత్మా జ్యోతిబా పూలే జయంతి వేడుకలను శనివారం ఘనంగా జరుపుకున్నారు. జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో దుబ్బ లోని మున్నూరు కాపు కల్యాణ మండపంలో పూలే జయంతి వేడుక నిర్వహించారు. అంతకుముందు వినాయకనగర్ లోని మహాత్మ జ్యోతిబా పూలే విగ్రహానికి అర్బన్ శాసనసభ్యులు ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా, కలెక్టర్ ఇలా త్రిపాఠి, నగర మేయర్ కే.ఉమారాణి, ఇంచార్జి అదనపు కలెక్టర్ దిలీప్ కుమార్, బీసీ సంఘాల ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, అనేక ఆంక్షలతో కూడిన నాటి సమాజంలో నెలకొని ఉన్న రుగ్మతలను పారద్రోలేందుకు మహాత్మ జ్యోతిబాపూలే కొనసాగించిన కృషి అమోఘమని అన్నారు. అడుగడుగునా అవరోధాలు, అవమానాలు ఎదురైనప్పటికీ ఏమాత్రం చలించకుండా సాంఘిక దురాచారాలను దూరం చేసేందుకు పూలే ఎంతగానో శ్రమించారని గుర్తు చేశారు. అణగారిన వర్గాలు సమానత్వం సాధించాలంటే విద్య ఎంతో అవసరమని గుర్తించి వారికి విద్య అందేలా విశేషంగా కృషి చేశారని, మహిళల విద్య కోసం ప్రత్యేకంగా మొట్టమొదటి పాఠశాలను స్థాపింపజేశారని అన్నారు. . జ్యోతిబా పూలే చూపిన బాటలో పయనిస్తూ, ఆయన ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరు పాటుపడాలని పిలుపునిచ్చారు. జయంతి సభలో మేయర్ ఉమారాణి, ఇంచార్జి అదనపు కలెక్టర్ దిలీప్ కుమార్ లు మాట్లాడుతూ, జ్యోతిబా పూలే సామాజిక చైతన్యాన్ని పెంపొందించేందుకు చేసిన కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి నర్సయ్య, బీసీ సంఘాల బాధ్యులు బుస్స ఆంజనేయులు, నరాల సుధాకర్, నరేందర్ గౌడ్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల ప్రిస్క్రిప్షన్ ఉంటేనే మందుల విక్రయం

# నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

**వైద్యులు సూచన మేరకు మాత్రమే మందులు విక్రయించాలి**
**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

మంచిర్యాల , ఏప్రిల్ 11
(వుదయం ప్రతినిధి)



వివిధ వ్యాధుల నియంత్రణకు వైద్యులు సూచించిన విధంగా మాత్రమే మందుల దుకాణాల నిర్వాహకులు మందులు విక్రయించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఔషధ నియంత్రణ పరిపాలన శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ర్యాలీని డ్రగ్స్ ఇన్స్పెక్టర్ చందన, ఈగల్ ఫోర్స్ సి.ఐ. రవికుమార్, కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ప్రతినిధులు చంద్రశేఖర్, సుధాకర్ లతో కలిసి జెండా ఊపి ప్రారంభించి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మందుల దుకాణాల నిర్వాహకులు, వైద్యులు సూచించిన ప్రిస్క్రిప్షన్ ప్రకారం మాత్రమే ప్రజలకు మందులను విక్రయించాలని తెలిపారు. ప్రజల ఆరోగ్యం దృష్ట్యా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా వైద్య సేవలు అందించడం జరుగుతుందని, నిష్ణాతులైన వైద్యులు ప్రభుత్వ ఆసుపత్రులలో అందుబాటులో ఉన్నారని తెలిపారు. ప్రజలు సొంత ఆలోచన ప్రకారం మందులు, సిరప్ లు వినియోగించకూడదని, వైద్యులను సంప్రదించి వారి సూచన మేరకు మందులు వినియోగించాలని తెలిపారు. నార్కోటిక్, నిషేధిత డ్రగ్స్ విక్రయం, వినియోగంపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని, మందుల విక్రయంలో మందుల దుకాణాల నిర్వాహకులు సమిష్టిగా ఉండాలని, సరైన ప్రిస్క్రిప్షన్ లేకుండా ఎలాంటి మందులను విక్రయించకూడదని తెలిపారు. మందుల షాపుల నిర్వాహకులు సరైన అర్హత, అనుమతి తప్పనిసరిగా కలిగి ఉండాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో 7 పడకలతో ఏర్పాటు చేసిన డ్రగ్స్ డి అడిక్షన్ సెంటర్ ను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. అనిత, ప్రభుత్వ ఆసుపత్రి పర్యవేక్షకులు వేదవ్యాస్, ఆర్.ఎం.ఓ. భీష్మ, వైద్యాధికారులతో కలిసి ప్రారంభించారు. మత్తు పదార్థాలకు అలవాటు పడిన వారిని సాధారణ స్థితికి తీసుకువచ్చేందుకు ఈ సెంటర్ ద్వారా వైద్య సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. ఇంటర్, డిగ్రీ, ఐ.టి.ఐ., ఇంజనీరింగ్, మెడికల్ కళాశాలల విద్యార్థులకు మత్తు పదార్థాలు, మద్యం వలన కలిగే నష్టాలపై అవగాహన కల్పించడం జరుగుతుందని, అధ్యాపకులు, తల్లితండ్రులు పిల్లల ప్రవర్తనలో కలిగే మార్పులపై పర్యవేక్షించాలని, ప్రవర్తన మారిన పిల్లలను డి అడిక్షన్ సెంటర్ కు తీసుకురావాలని తెలిపారు. ఈ సెంటర్ నిర్వహణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక నిధులు కేటాయించడం జరుగుతుందని, స్వచ్ఛంద సంస్థలు డ్రగ్స్ నియంత్రణపై అధికారుల సమన్వయంతో పని చేయాలని తెలిపారు. మత్తు పదార్థాల రవాణా, విక్రయం అంశాలపై హెల్ప్ లైన్ నంబర్లు 14416, 1908 లలో సమాచారం అందించవచ్చని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. ఈ సందర్భంగా వైద్య విద్యార్థులతో తాము జీవితంలో ఎలాంటి మత్తు పదార్థాలు తీసుకోబోమని ప్రతిజ్ఞ చేయించారు.

అనంతరం ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థులకు నిర్వహించిన క్రీడా పోటీలలో గెలుపొందిన వారికి బహుమతి ప్రధానం చేశారు.ఈ కార్యక్రమంలో వైద్యులు డా. సునీల్ కుమార్, డా. కిరణ్ కుమార్, నర్సింగ్ అధికారులు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు, కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ సభ్యులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్యాలయంలో పూలే జయంతి

**ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ**

కామారెడ్డి, ఏప్రిల్ 11
(వుదయం ప్రతినిధి):-



ప్రముఖ సంఘ సంస్కర్త, సామాజిక విప్లవ జ్యోతి మహాత్మ జ్యోతిరావు పూలే 200వ జయంతి ఉత్సవాలు శనివారం కామారెడ్డి పట్టణంలోని మున్సిపల్ ఆవరణలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ ముఖ్య అతిథిగా హాజరై, జ్యోతిబా పూలే విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన ప్రసంగించారు.ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ, సమానత్వ సమాజ నిర్మాణానికి పూలే మార్గదర్శి అన్నారు. మహాత్మ జ్యోతిరావు పూలే భారతదేశంలో సామాజిక మార్పుకు శ్రీకారం చుట్టిన మహనీయులలో అగ్రగణ్యుడని పేర్కొన్నారు. కుల వివక్ష, అణచివేత, అసమానతలకు వ్యతిరేకంగా ఆయన జీవితాంతం పోరాడారని చెప్పారు. సమానత్వం, స్వేచ్ఛ, సోదరభావం అనే విలువలను సమాజంలో నాటిన మహోన్నత సంస్కర్తగా ఆయన నిలిచారని కొనియాడారు. విద్య ద్వారానే సమాజ అభివృద్ధిపూలే విద్యను సామాజిక మార్పుకు ఆయుధంగా ఉపయోగించారని షబ్బీర్ అలీ తెలిపారు. ముఖ్యంగా బాలికల విద్యాభివృద్ధికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. తన సహచరురాలు సావిత్రిబాయి పూలేతో కలిసి దేశంలోనే తొలి బాలికల పాఠశాలను స్థాపించడం చారిత్రాత్మక ఘట్టమని గుర్తుచేశారు. సమాజంలోని వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలు తరతరాలకు ఆదర్శమని పేర్కొన్నారు.డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ వంటి మహానుభావులపై పూలే ఆలోచనలు ప్రభావం చూపాయని ఆయన తెలిపారు. భారత రాజ్యాంగంలో ప్రతిఫలించిన సమానత్వం, సామాజిక న్యాయం వంటి సిద్ధాంతాలకు పూలే భావజాలం పునాదిగా నిలిచిందని అన్నారు. ప్రస్తుత సమాజంలో కూడా కుల వివక్ష, అసమానతలు పూర్తిగా తొలగిపోలేదని పేర్కొన్న షబ్బీర్ అలీ, యువత మహాత్మ పూలే ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. విద్య, సామాజిక చైతన్యం ద్వారా సమానత్వ సమాజాన్ని నిర్మించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సూచించారు. కామారెడ్డి నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ 25 ఎకరాలలో మంజూరు కావడం జరిగింది. త్వరలో దానికి శంకుస్థాపన చేస్తాం అన్నారు. ప్రభుత్వం వెనుకబడిన వర్గాల సంక్షేమం, విద్యాభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. మహాత్మ పూలే ఆశయాలకు అనుగుణంగా బలహీన వర్గాల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ విక్టర్, గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, బద్దం ఇంద్రకరణ్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్, పండ్ల రాజు, గూడెం శ్రీనివాస్ రెడ్డి, అనంతరెడ్డి, భీమ్ రెడ్డి, నౌసిలాల్, పాత రాజు, లక్ష్మీ రాజాగౌడ్, ఐరేని సందీప్, కారంగుల అశోక్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు,

సామాజిక కార్యకర్తలు, పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఆసిఫాబాద్ ఏప్రిల్ 11
(వుదయం ప్రతినిధి)



కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని కుమరం భీమ్ స్టడీ సర్కిల్ లో శనివారం పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఏకలవ్య ఫౌండేషన్ మరియు కొమురం భీం స్టడీ సర్కిల్ వ్యవస్థాపకులు శ్రీ వేణుగోపాల్ రెడ్డి గారితో పాటు సిర్పూర్ శాసనసభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివాసులు కేవలం ప్రభుత్వ ఉద్యోగాలే కాకుండా ప్రైవేటు ఉద్యోగాలు సాధించే దిశగా ప్రయత్నం చేయాలని అన్నారు. చదువుతోపాటు నైపుణ్యాలను అలవరుచుకోవాలని తద్వారా పోటీ ప్రపంచంలో తమ కాళ్ల మీద తాము నిలబడగలుగుతారని అన్నారు.ఈ కార్యక్రమంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఆసిఫాబాద్ డిసిసి అధ్యక్షులు ఆత్రం సుగుణక్క , జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కామెడే అనిల్, స్టడీ సర్కిల్ లో చదువుకొని ఉద్యోగాలు నిర్వహిస్తున్న ఆదివాసి ఉద్యోగులు పాల్గొన్నారు.

# మహబూబ్‌నగర్ | మెదక్ ఉమ్మడి జిల్లాల వార్తలు



## అసమానతలను తొలగించేందుకు పోరాటం చేసిన పూలే

- అదనపు కలెక్టర్ నర్సింగరావు

గద్వాల ఏప్రిల్ 11 (వుదయం ప్రతినిధి)

సమాజంలోని అసమానతలను తొలగించేందుకు మహాత్మా జ్యోతిబా పూలే తన జీవితాంతం కృషి చేశారని అదనపు కలెక్టర్ నర్సింగరావు కొనియాడారు. శనివారం మహాత్మా జ్యోతి బాపూలే 200వ జయంతి సందర్భంగా జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గద్వాల ఐడిఓసి వద్ద పూలే చిత్రపటానికి అధికారులు, ప్రజా సంఘాల నేతలు పూలమాలలు వేసి పూజలు చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పూలే చిన్నతనం నుంచే చత్రపతి శివాజీ, జార్జి వాషింగ్టన్ మొదలగువారి జీవిత చరిత్రలను చదవడం వలన అతనిలో దేశభక్తి, సామాజిక స్పృహ, నాయకత్వ లక్షణాలు అలవడ్డాయన్నారు. అప్పటి సమాజంలో నిమ్న కులాల ప్రజలు వెనకబడడానికి కారణం విద్య లేకపోవడమేనని భావించి పాఠశాలలు నెలకొల్పడమే కాక పూలే స్త్రీ విద్యకు ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందన్నారు. తన భార్య సావిత్రిబాయి పూలేకు చదువు నేర్పించి బాలికల పాఠశాలలో ఆమెను ఉపాధ్యాయురాలిగా నియమించినట్లు చెప్పారు. కుల వ్యవస్థను వ్యతిరేకిస్తూ గులాం గిరి అనే పుస్తకాన్ని పూలే రచించడం జరిగిందన్నారు. 1878వ సంవత్సరంలో పూణేలో సత్య శోధక సమాజాన్ని స్థాపించి స్త్రీ, పురుష లింగ వివక్షతను ఆయన తీవ్రంగా విమర్శించారని పేర్కొన్నారు. అంతకుముందు గద్వాల బస్టాండ్ సమీపంలో ఉన్న మహాత్మా జ్యోతిబాపూలే విగ్రహానికి అదనపు కలెక్టర్ నర్సింగరావు, డిఎస్పి మొగిలయ్య, పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నేతలు, ఇతర అధికారులు, ప్రజా సంఘాల నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసరావు, కలెక్టరేట్ ఏవో భూపాల్ రెడ్డి, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి అక్బర్ పాషా, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నుషిత, ఇతర అధికారులు, ప్రజా సంఘాల నేతలు, తదితరులు పాల్గొన్నారు.



## డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

- జిల్లా కలెక్టర్ దీపక్ తివారి

వికారాబాద్,ఏప్రిల్ 11 (వుదయం ప్రతినిధి):

కుటుంబ మరియు సమాజం పై తీవ్ర ప్రభావాన్ని చూపే డ్రగ్స్ వినియోగాన్ని పూర్తిగా అరికట్టి, డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించుటకు కలసి కట్టుగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ పిలుపు నిచ్చారు. శనివారం ప్రభుత్వ ఆసుపత్రి నందు ( ATF)అడిక్షన్ ట్రీట్మెంట్ ఫెసిలిటీ కేంద్రాలను కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రి నందు ఏర్పాటు చేసిన డ్రగ్స్ నివారణకార్యక్రమం లో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, డ్రగ్స్ వినియోగం వ్యక్తిగత ఆరోగ్యానికే కాకుండా కుటుంబం,మరియు సమాజం పై కూడా తీవ్రమైన ప్రభావం చూపుతుందని తెలిపారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి, యోగ, మెడిటేషన్,విద్య, క్రీడలు మరియు సృజనాత్మక కార్యకలాపాలపై దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా ఈ నెల 13 నుండి 18 వరకు రోడ్డు భద్రతా కార్యక్రమాలు గ్రామ పంచాయతీ,పట్టణ పరిధి లో నిర్వహించ బడతాయని కలెక్టర్ తెలిపారు. యువత డ్రగ్స్ సేవించి డ్రైవింగ్ చేస్తే ప్రమాదాలు సంభవిస్తాయని, డ్రగ్స్ అక్రమ రవాణా మరియు వినియోగం పై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ హెచ్చరించారు.డ్రగ్స్ పై ఫిర్యాదు చేయాల్సి వస్తే టోల్ ఫ్రీ నంబర్ 1908కు సమాచారం ఇవ్వాలని తెలిపారు.డ్రగ్స్ కార్యకలాపాల్లో పాల్గొనే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని ఈ సందర్భంగా కలెక్టర్ హెచ్చరించారు.ప్రజలు, ముఖ్యంగా తల్లిదండ్రులు తమ పిల్లలపై నిశితంగా పర్యవేక్షణ వహించాలని, అనుమానాస్పద చర్యలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కలెక్టర్ కోరారు.ముందుగా డ్రగ్స్ పై వ్యాస రచన, క్విజ్, పెయింటింగ్ పోటీలలో పాల్గొన్న వారందరికీ కలెక్టర్ సర్టిఫికెట్ లు అందజేశారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్ పి రాము నాయక్, సూపరింటెండెంట్ రాజ్యలక్ష్మి,తెలంగాణ ఈగల్ ఫోర్స్ రాంబాబు నాయక్,డ్రగ్ ఇన్స్పెక్టర్ క్రాంతి కుమార్,డాక్టర్ . చంద్ర శేఖర్, అబ్దుల్ హాఫీజ్, శాంతా బాయి, శంకరమ్మ, మెడికల్ స్టూడెంట్స్, నర్సింగ్ స్టూడెంట్స్,పోలీసు అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.ముందుగా మాధక ద్రవ్యాలపై కలెక్టర్ తో పాటు అందరూ....నేను మాధక ద్రవ్యాలు శరీరానికి మరియు సమాజానికి హానికరమని తెలుసుకున్నాను.నేను ఎప్పటికీ మాధక ద్రవ్యాలను ఉపయోగించను.నా స్నేహితులు, కుటుంబ సభ్యులను కూడా మాధక ద్రవ్యాల నుండి దూరంగా ఉండమని ప్రోత్సహిస్తాను.ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరిస్తాను.సమాజంలో మాధక ద్రవ్యాల వినియోగాన్ని నివారించేందుకు నా వంతు సహకారం అందిస్తానంటూ ప్రతిజ్ఞ చేశారు.



## పెద్దమ్మ తల్లి అనుగ్రహంతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలి

- వెల్కటూర్ లో ఘనంగా పెద్దమ్మ దేవాలయ ఉత్సవాలు
- పాల్గొన్న మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు

వుదయం , సిద్దిపేట బ్యూరో ( ఏప్రిల్ 11)

పెద్దమ్మ తల్లి అనుగ్రహంతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు ఆకాంక్షిచారు. సిద్దిపేట జిల్లా సిద్దిపేట అర్బన్ మండలం వెల్కటూర్ గ్రామంలో ముదిరాజ్ సంఘ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన పెద్దమ్మ దేవాలయ ఉత్సవాల్లో మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీష్ రావు కి ఆలయ ఉత్సవ కమిటీ ఘన స్వాగత పలికి శాలువాతో సత్కరించి అభినందించారు. అనంతరం అమ్మ వారికి ప్రత్యేక పూజలు చేసిన దర్శించుకున్నారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ.. పెద్దమ్మ తల్లి అనుగ్రహంతో అన్నింటా శుభం చేకూరాలి కోరారు. వెల్కటూర్ గ్రామాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేసామని, గ్రామానికి ఇరువైపుల డబుల్ రోడ్లు ఏర్పాటు చేసుకున్నామని చెప్పారు. పెద్దమ్మ దేవాలయానికి తనవంతు సహకారం అందించానని గుర్తు చేశారు. భవిష్యత్ లో గ్రామాన్ని ఇంకా మరింత అభివృద్ధి చేసుకుందామన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం సభ్యులు, గ్రామస్తులు బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఉన్నారు

## మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు

### సమానత్వం, మహిళా విద్యకు మార్గదర్శి పూలే





- టీజీఐఐసీ చైర్పర్సన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

సంగారెడ్డి, ఏప్రిల్ 11 వుదయం జిల్లా ప్రతినిధి :

మహాత్మ జ్యోతిరావు పూలే 200వ జయంతి వేడుకలు జిల్లాలో ఆదివారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, శాసనసభ్యులు చింతా ప్రభాకర్, మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత సంతోష్, అదనపు కలెక్టర్ పాండు తదితరులు జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నటరాజ్ థియేటర్ సమీపంలో నిర్వహించిన జయంతి ఉత్సవ కార్యక్రమంలో పాల్గొని పూలే చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు .ఈ సందర్భంగా టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ, మహాత్మ జ్యోతిరావు పూలే సమాజంలో సమానత్వం, మహిళా విద్య కోసం చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు కలగాలని ఆశించిన గొప్ప సంస్కర్తగా ఆయనను కొనియాడారు. మహిళల విద్యాభివృద్ధికి ఆయన చేసిన సేవల వల్లనే నేడు మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉన్నారని పేర్కొన్నారు. యువత ఆయన స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి కట్టుబడి పాఠశాలలు, హాస్టళ్లలో అవసరమైన సదుపాయాలు కల్పిస్తూ, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నదని తెలిపారు. ముఖ్యంగా బాలికల విద్యాభివృద్ధి, భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని, జిల్లాలో డిగ్రీ, జూనియర్ కళాశాలల బాలికలకు హాస్టల్ వసతి కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ, మహాత్మ జ్యోతిరావు పూలే సమానత్వం, విద్యా విస్తరణ, మహిళా సాధికారత కోసం అహర్నిశలు కృషి చేసిన మహనీయుడని అన్నారు. మహిళా విద్యకు పునాది వేసిన సావిత్రిబాయి పూలే సేవలను గుర్తుచేశారు. పూలే దంపతుల స్ఫూర్తితో యువత సమాజ అభివృద్ధికి కృషి చేయాలనిసూచించారు.ఆయన ఆలోచనలు నేటి సమాజానికి మార్గదర్శకమని పేర్కొన్నారు.జిల్లాలో బీసీ వసతి గృహాల్లోని విద్యార్థుల కోసం సి.ఎస్.ఆర్ నిధుల కింద రూ.35 లక్షలతో ట్రంక్ బాక్సులు తదితర సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. అలాగే రూ.1.52 కోట్ల వ్యయంతో హాస్టల్ భవనాల మరమ్మతులు చేపట్టినట్లు చెప్పారు. ఎస్ఎస్సి విద్యార్థులకు ఆల్ఇన్‌వన్ గైడ్స్ అందజేసినట్లు, గత సంవత్సరం పదవ తరగతిలో 99.5 శాతం ఉత్తీర్ణత సాధించారని, ఈ సంవత్సరం 100 శాతం ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు.జిల్లాలోని బీసీ స్టడీ సర్కిల్స్ ద్వారా గ్రూప్స్, యూపీఎస్సీ పరీక్షలకు కోచింగ్‌తో పాటు అవసరమైన మెటీరియల్ అందించామని కలెక్టర్ తెలిపారు.బి సి ల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంతకుముందు విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, జిల్లా సాంస్కృతిక సారథి కళాకారుల పాటలు ఆహూతులను ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత సంతోష్, అదనపు కలెక్టర్ పాండు, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి జగదీష్, వివిధ శాఖల అధికారులు, కుల సంఘాల ప్రతినిధులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, యువత, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

## స్త్రీ విద్య కోసం పాఠశాలలు స్థాపించిన మహనీయుడు పూలే

### అణగారిన వర్గాల అభ్యున్నతికి పూలే నిరంతర కృషి




- అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఖీమ్యా నాయక్

వనపర్తి ఏప్రిల్ 11 (ఉదయం ప్రతినిధి)

సమాజంలో సమానత్వం, విద్య, మహిళా సాధికారత కోసం మహాత్మా జ్యోతిబా పూలే చేసిన కృషి వెలకట్టలేనిదని, కాబట్టి ఆయన ఆశయ సాధన కోసం అందరూ పనిచేయాలని అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఖీమ్యా నాయక్ పేర్కొన్నారు. శనివారం మహాత్మా జ్యోతిబా పూలే 200వ జయంతి సందర్భంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) ఖిమ్యా నాయక్ ముఖ్య అతిథిగా హాజరై మహాత్మా జ్యోతిబా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పూలే గారి మహోన్నత సేవలను స్మరించుకున్నారు.వేదికపై ఆర్డీవో సుబ్రహ్మణ్యం, బీసీ సంక్షేమ శాఖ అధికారి ముజాహిద్ ఖాన్, డీపీ ఆర్‌ఓ సీతారాం, మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, కౌన్సిలర్లు కౌన్సిలర్లు శరవంద, మహేశ్వరి ఉన్నారు.మహాత్మా జ్యోతిరావు పూలే సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప సామాజిక సంస్కర్త అని పేర్కొన్నారు. సమానత్వం, విద్య, మహిళా సాధికారత కోసం ఆయన చేసిన కృషి అపూర్వమని తెలిపారు. మహిళలకు విద్య అందించడంలో పూలే ముందుండి పోరాటం చేసి తొలి బాలికల పాఠశాలను స్థాపించారని గుర్తుచేశారు. సమాజంలో ఉన్న కులవివక్ష, అన్యాయాలపై ఆయన నిరంతరం పోరాడుతూ సమాన హక్కుల కోసం కృషి చేశారని వివరించారు.పూలే ఆలోచనలు నేటి తరానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయని, ఆయన చూపిన దారిలో నడవడం ద్వారా సమాజంలో సమానత్వం సాధ్యమవుతుందని అన్నారు. ప్రతి ఒక్కరూ విద్యను ఆయుధంగా చేసుకుని అభివృద్ధి దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. యువత పూలే గారి స్ఫూర్తితో సమాజానికి సేవ చేయాలని సూచించారు. విద్య అందరికీ సమానంగా అందాలి అనే లక్ష్యంతో పూలే అనేక పాఠశాలలను స్థాపించడం గొప్ప విషయం అని అన్నారు. భార్య సావిత్రిబాయి పూలే సహకారంతో మహిళా విద్యాభివృద్ధికి బలమైన పునాది పడిందని గుర్తుచేశారు. సమాజంలో వెనుకబడిన వర్గాలకు ఆత్మగౌరవం పెంపొందించే దిశగా పూలే ఆలోచనలు ఎంతో ప్రేరణనిస్తాయని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పూలే ఆశయాలకు అనుగుణంగా ఉన్నాయని, వాటిని సక్రమంగా ప్రజలకు అందించాలని అధికారులకు సూచించారు.ప్రతి ఒక్కరు పూలే జీవితం నుండి స్ఫూర్తి పొందుతూ సమానత్వం, సామాజిక న్యాయం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం విద్యార్థులకు చదువు కోసం ఎన్నో అవకాశాలు కల్పిస్తోందని వాటిని సద్వినియోగం చేసుకొని పైకి రావాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ మహాత్మా జ్యోతిబా పూలే సమాజానికి చేసిన సేవలను కొనియాడారు. అదేవిధంగా మహాత్మ జ్యోతిబాపూలేను గుర్తు చేస్తూ కళాకారులు చేసిన ప్రదర్శనలుఅందరినీ ఆకట్టుకున్నాయి. సమావేశంలో మహనీయుల సభ కమిటీ అధ్యక్షులు గంధం నాగరాజు, ప్రజా సంఘాల నాయకులు రాజారాం ప్రకాష్, బండలయ్య, చీర్ల జనార్ధన్, ఉమల్ల రాములు, కే వెంకటేష్, తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు ఇతర కవులు కళాకారులు, ఉపాధ్యాయులు కిరణ్, ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ శాఖ బీసీ ఉద్యోగుల ఆధ్వర్యంలో పూలే జయంతి

ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే చింత ప్రభాకర్



సంగారెడ్డి వుదయం.

సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని జిల్లా విద్యుత్ కార్యాలయం ఆవరణలో మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెలంగాణ ఎలక్ట్రిసిటీ బ్యాక్‌వర్డ్ క్లాసెస్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ సంగారెడ్డి సర్కిల్ ఆధ్వర్యంలో రీజినల్ ప్రెసిడెంట్ మునిపల్లి దశరథ్, రీజినల్ సెక్రటరీ బాలకృష్ణ నేతృత్వంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే చింత ప్రభాకర్ గారు హాజరై మాట్లాడారు. సమాజంలో ఉన్న అంటరానితనం, అసమానతలను నిర్మూలించేందుకు మహాత్మ పూలే గారు జీవితాంతం పోరాటం చేశారని తెలిపారు. కొంత మందికే పరిమితమైన విద్యను అందరికీ అందుబాటులోకి తీసుకురావాలని ఆయన కృషి చేశారని గుర్తుచేశారు. సావిత్రిబాయి పూలేకు విద్య నేర్పించి, తొలి బాలికల పాఠశాలను స్థాపించడం ద్వారా మహిళా విద్యకు శ్రీకారం చుట్టారని అన్నారు. ఎన్నో అవమానాలు, అడ్డంకులు ఎదురైనా వెనుకడుగు వేయకుండా సమాజ మార్పు కోసం నిరంతరం శ్రమించిన మహనీయుడు పూలే అని కొనియాడారు.పూలే గారు చూపిన మార్గం నేటి తరానికి మార్గదర్శకమని, సమానత్వం, విద్య, సామాజిక న్యాయం కోసం అందరూ కలిసి పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.




## చలివేంద్రం ప్రారంభించిన చైర్ పర్సన్

వుదయం, దుబ్బాక (ఏప్రిల్ 11)

భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు సీపీఎం దుబ్బాక పట్టణ కమిటీ ఆధ్వర్యంలో బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీరామ్ సంగీత రవీందర్ ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చలివేంద్రం ప్రారంభించడం సంతోషకరమని, ప్రజలందరూ దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం సేవా కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. చలివేంద్రం నిర్వహిస్తున్న సిపిఎం పార్టీ బృందానికి ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. చలివేంద్రాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని, ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజలు తమ ఆరోగ్యాలు రక్షించుకోవాలని విజ్ఞప్తి చేశారు. సిపిఎం పార్టీ నిరంతరంగా ప్రజలకు సేవలు అందించడంలో ముందుంటుందని గుర్తు చేశారు. అనంతరం సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.భాస్కర్ మాట్లాడుతూ, సిపిఎం పార్టీ ప్రజల సమస్యల పై నిరంతరం సమరశీల పోరాటాలు నిర్వహిస్తూనే, ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడంలో ముందుంటుందని తెలిపారు. గత ఐదు సంవత్సరాల నుండి నిరంతరం వేసవికాలంలో చలివేంద్రం నిర్వహిస్తూ ప్రజలకు సేవలు అందిస్తున్నామని గుర్తు చేశారు. సిపిఎం పార్టీ నిరంతరంగా ప్రజల శ్రేయస్సు కోసం పనిచేస్తుందని, ప్రభుత్వాలు కూడా ఆ దిశగా పని చేయాలని కోరారు. ప్రజల పైన భారాలు వేయకుండా ప్రజలకు మేలు చేసే విధంగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ దేవుని రాజు, ఎండి చాంద్ మియా, సిపిఎం పార్టీ దుబ్బాక పట్టణ కార్యదర్శి కొంపల్లి భాస్కర్, మండల కమిటీ సభ్యులు ఎండి సాజిద్, కార్యకర్తలు శ్రీనివాస్, మాడవైన నాగరాజు, లక్ష్మీనర్సయ్య, కృష్ణారి,ఎల్లారం రవికుమార్, దిలీప్, పరుశరాములు, రమేష్,శేఖర్, షాదుల్లా, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

## వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల ప్రారంభం

- నేటి నుండి 6 రోజుల పాటు విశేష పూజలు
- నూతనంగా పుష్కరిణి, నవగ్రహ ప్రతిష్ఠాపన
- భక్తులకు భారీగా అన్నప్రసాద వితరణ

గజ్వేల్, ఏప్రిల్ 11 (వుదయం ప్రతినిధి):

సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని శ్రీలక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయ 20వ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం అత్యంత భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రధాన అర్చకులు శేషం శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించి ఉత్సవాలకు అంకురార్పణ చేశారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ కైలాస లక్ష్మణ్ మరియు ప్రధాన అర్చకులు మాట్లాడుతూ.. కలియుగ దైవమైన వేంకటేశ్వర స్వామి అనుగ్రహంతో లోకమంతా సుభిక్షంగా ఉండాలని కోరుతూ ఈ బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.నేటి నుండి ఆరు రోజుల పాటు ఆలయంలో విశేష పూజలు, హోమాలు జరుగుతాయి. ఈ ఏడాది ప్రత్యేకంగా నూతన పుష్కరిణి ప్రారంభోత్సవం మరియు నవగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. స్వామివారి కల్యాణోత్సవం, రథోత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తరించాలని కోరారు. ఉత్సవాల సందర్భంగా ప్రతిరోజు భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు మహా అన్నప్రసాద వితరణ ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో యజ్ఞాచార్య ఉదయ్ కుమార్ ఆచార్యులు, ఆలయ ప్రధాన కార్యదర్శి గార్లపాటి వెంకటేశ్వర్లు, కోశాధికారి అత్తెల్లి కిషన్, ఉపాధ్యక్షులు ఎడెల్లి శ్రీనివాస్, మాందాల తిరుపతిరెడ్డి పాల్గొన్నారు. అలాగే సహాయ కార్యదర్శులు గందే యాదగిరి, దేవులపల్లి రాజారామ్, ఆలయ కమిటీ సభ్యులు, వికాస తరంగిణి సభ్యులు మరియు పట్టణ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.



## బీసీ బిడ్డ మంత్రి అయితే ఓర్వలేక పోతున్నారు

మహబూబ్నగర్,ఏప్రిల్ 11 (వుదయం ప్రతినిధి):

కాంగ్రెస్ పార్టీలో దశాబ్దాల పాటు కార్యకర్త స్థాయి నుంచి మంత్రి పదవికి ఎదిగిన మక్తల్ శాసనసభ్యులు శ్రీ వాకిటి శ్రీహరి పదవిచేపట్టినాటి నుండి నేటి వరకు ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా అభివృద్ధికి చేస్తున్న కృషిని చూసి ఓర్వలేక మహబూబ్నగర్ పార్లమెంట్ సభ్యురాలు శ్రీమతి డీకే అరుణ ఆయనపై నిందలు వేస్తున్నారని ఆల్ మే వా వ్యవస్థాపక అధ్యక్షులు ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరిన షేక్ ఫరూక్ హుస్సేన్ ఒక ప్రకటనలో విమర్శించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాకిటి శ్రీహరి ప్రారంభోత్సవం చేసిన కార్యక్రమాలకి మళ్లీ శంకుస్థాపన చేసి పైగా శ్రీహరి పై అవాకులు చెవాకులు మాట్లాడడం శ్రీమతి డీకే అరుణ గారి కే చెల్లిందని ఆమె వ్యవహార శైలి మార్చుకొని జిల్లా అభివృద్ధికి కేంద్రం నుంచి నిధులు పుష్కలంగా తీసుకురావడానికి ప్రయత్నిస్తే జిల్లా ప్రజలు హర్షిస్తారని ఆయన పేర్కొన్నారు తన పార్లమెంట్ పరిధిలోని మంత్రి శ్రీహరిని టార్గెట్ చేసి పనిచేయడం పార్లమెంట్ సభ్యురాలుడీకె అరుణ గారుఇప్పటికైనా మానుకోవాలని ఆమె వైఖరి పై బీ సీ సంఘాలు మౌనం వహించడం సమంజసం కాదు అని ఆయన అన్నారు

## సజావుగా కొనసాగుతున్న పదో తరగతి మూల్యాంకనం



- ఇప్పటి వరకు 99675 జవాబు పత్రాల మూల్యాంకనం పూర్తి,డీఈఓ రమేష్ కుమార్

నాగర్ కర్నూల్ ఏప్రిల్ 11 (వుదయం ప్రతినిధి)

పదో తరగతి పరీక్షల జవాబుపత్రాల మూల్యాంకనం సజావుగా జరుగుతోందని, అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో ప్రక్రియ కొనసాగుతోందని నాగర్ కర్నూల్ జిల్లా విద్యాశాఖ అధికారి ఏ రమేష్ కుమార్ తెలిపారు. శనివారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ ఉన్నత పాఠశాలలో ఈనెల 1వ తేదీ నుండి కొనసాగుతున్న పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకన కేంద్రాన్ని తనిఖీ ఆయన చేశారు.వివిధ సబ్జెక్టులకు సంబంధించి జరుగుతున్న మూల్యాంకన ప్రక్రియను నిశితంగా పరిశీలించారు. మూల్యాంకనంలో పాల్గొన్న ఎగ్జామినర్ల పనితీరును పరిశీలించారు.ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మూల్యాంకన ప్రక్రియ కోడింగ్, డీ కోడింగ్ సజావుగా నిర్వహించాలని సూచించారు. మార్గదర్శకాలకు అనుగుణంగా మూల్యాంకన ప్రక్రియ సజావుగా నిర్వహించేలా పలు సూచనలిచ్చారు. మౌలిక వసతులు, భద్రతా చర్యలు, రికార్డుల నిర్వహణ, మార్కుల నమోదు ప్రక్రియ తదితర అంశాలను పరిశీలించారు.నేటి వరకు 99675 పదో తరగతి జవాబు పత్రాలను మూల్యాంకనం పూర్తి చేయడం జరిగిందన్నారు. తెలుగు, ఇంగ్లీష్, హిందీ, గణితం సబ్జెక్టుల జవాబు పత్రాల మూల్యాంకన ప్రక్రియ పూర్తి అయ్యిందని, బయోసైన్స్ సబ్జెక్టుకి సంబంధించిన జవాబు పత్రాల డీకోడింగ్ ప్రక్రియ ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. నేటి వరకు 1,36,291 జవాబు పత్రాలు జిల్లాకు వచ్చాయని ఈనెల 13వ తేదీన జరగనున్న సోషల్ పరీక్ష అనంతరం జిల్లాకు కేటాయించిన జవాబు పత్రాలు రానున్నట్లు డిఇఓ రమేష్ కుమార్ తెలిపారు.మూల్యాంకన కేంద్రంలో కురుమయ్య, రాజశేఖర్ రావు, లతదేవి, సత్యనారాయణ రెడ్డి, కృష్ణారెడ్డి, వెంకటేశ్వర్ల శెట్టి తదితరులు పాల్గొన్నారు.

## జ్యోతిబాపూలే అడుగుజాడల్లో నడవాలి



- జిల్లా అదనపు కలెక్టర్ శ్రీను

నారాయణపేట, ఏప్రిల్ 11 (వుదయం ప్రతినిధి):

మహాత్మా జ్యోతి బా పూలే అడుగుజాడల్లో మనమంతా నడవాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కలెక్టరేట్ లోని ప్రజావాణి హాల్ లో జిల్లా వెనుక బడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతి బా పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వ హించారు. ఈవేడుకలకు జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి బా పూలే చిత్రపటానికి పూల మాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఏప్రిల్ 11న మహాత్మా జ్యోతి బా పూలె జయంతి వేడుకలు అధికారికంగా ఘనంగా నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. పూలే సామాజిక సంస్కర్తగా, సమానత్వానికి చేసిన సేవలను స్మరించుకుంటూ ఈ వేడుకలు జరుపుకుంటు న్నామన్నారు. బాలికల విద్యకు ప్రాధాన్యత ఇచ్చిన తొలి సంస్కర్తల్లో పూలే ఒకరని,కులవ్యవస్థకు వ్యతిరేకంగా పోరాటం చేసి, సమాజంలో సమానత్వం, విద్యా విస్తరణకు ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. వారి ఆశయాలను ప్రతి ఒక్కరూ అనుసరించి సమా జ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో బి సి వెల్ఫేర్ అధికారి అబ్దుల్ ఖలీల్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జయ చంద్రమోహన్, బీసీ వెల్ఫేర్ కార్యాలయ ఉద్యోగులు ముస్తఫా, శివ, పూజారి, వసతి గృహాల వార్డెన్లు రేణుక, మంజుల, నిర్మలా, రాజేశ్వరి, యాదయ్య, రజక సంఘం నాయకులు మడి వాల్ కృష్ణా,వివిధ కుల సంఘాల నాయకులు, బీసీ వెల్ఫేర్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఇంటర్మీడియట్ ఫలితాలు

- మీసేవ ద్వారా మొబైల్‌లో అందుబాటులోకి రానున్నాయి
- తెలంగాణ మీసేవ సమాచార సాంకేతిక విప్లవంలో అగ్రగామిగా నిలుస్తోంది
- మీసేవ ఈడిఎమ్ శివ

అలంపూర్ ఏప్రిల్ 11 (వుదయం ప్రతినిధి):

ఐటీ శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు దార్శనిక నాయకత్వంలో, 18 నవంబర్ 2025న ప్రారంభించబడిన తెలంగాణ మీసేవ వాట్సాప్/చాట్‌బాట్ ప్లాట్‌ఫామ్, రాష్ట్రంలో అత్యంత వేగంగా ఆదరణ పొందిన డిజిటల్ ప్రజా సేవా ఛానెళ్లలో ఒకటిగా నిలుస్తూ, 580కి పైగా ప్రభుత్వ సేవలకు వేగంగా విస్తరించింది. పౌరులు వాట్సాప్‌లో 8096958096 నంబర్‌కు మెసేజ్ పంపడం ద్వారా అన్ని సేవలను పొందవచ్చు.తన తాజా విస్తరణలో భాగంగా, తెలంగాణ బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ (TGBIE) విద్యార్థులు ఏప్రిల్ 12, 2026 నుండి తమ బోర్డ్ పరీక్షల ఫలితాలను నేరుగా వాట్సాప్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. దీనికి పోర్టల్ లాగిన్ గానీ, సర్వీస్ సెంటర్ సందర్శన గానీ అవసరం లేదు.ఈ ప్లాట్‌ఫామ్ ఇంతకుముందు రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులకు ఇంటర్మీడియట్ మరియు ఎస్ఎస్సి హాల్ టిక్కెట్లను ఉచితంగా, తక్షణమే పొందేందుకు వీలు కల్పించింది.

**వాట్సాప్‌లో మీ BIE ఫలితాన్ని డౌన్‌లోడ్ చేసుకునే విధానం:**

1. 8096958096 నంబర్‌ను మీ కాంటాక్ట్స్‌లో "MeeSeva Telangana" అని సేవ్ చేసుకోండి.
2. వాట్సాప్ ఓపెన్ చేసి, మీసేవ చాట్‌బాట్‌ను ప్రారంభించడానికి "Hi" అని పంపండి.
3. "BIE Exam Result" అని టైప్ చేసి, ఓపెన్ సర్వీస్‌పై ట్యాప్ చేయండి.
4. మీ రోల్ నంబర్‌ను నమోదు చేసి, సంవత్సరం (1వ / 2వ) మరియు స్ట్రీమ్ (జనరల్ / వొకేషనల్) ఎంచుకోండి
5. సబ్మిట్ చేయండి — మీ ఫలితం తక్షణమే వాట్సాప్‌లో పంపబడుతుంది.

# ఔషధ వినియోగంపై అవగాహన







**సంగారెడ్డి, ఏప్రిల్ 11, వు దయం;**
తెలంగాణ ప్రభుత్వం డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ ఆధ్వర్యంలో "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన డ్రగ్స్ కంట్రోల్ అండ్ రెగ్యులేటరీ స్ట్రెంగ్తెనింగ్ డే కార్యక్రమం సంగారెడ్డి పట్టణంలోని వీరభద్ర నగర్‌లో ఉన్న కెమిస్ట్ భవన్‌లో ఘనంగా , విజయవంతంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ప్రజలు, విద్యార్థులు, కెమిస్టులు,ఇతర సంబంధిత భాగస్వాములు భారీ సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా అతిథులు ఐదు అవగాహన పాంప్లెట్లను ఆవిష్కరించారు.కార్యక్రమంలో ముఖ్యంగా ఈ అంశాలపై విస్తృతంగా చర్చించారు:అలవాటు చేసే ఔషధాల దుర్వినియోగంపై అవగాహనయాంటీబయాటిక్స్‌ను సరైన విధంగా వినియోగించడంచెల్లుబాటు అయ్యే ప్రిస్క్రిప్షన్‌తోనే ఔషధాల విక్రయంషెడ్యూల్ ఎచ్ 2 ఔషధాలపై క్యూ ఆర్ కోడ్ ధృవీకరణఔషధ దుష్ప్రభావాలపై క్యూ ఆర్ ఆధారిత నివేదిక వ్యవస్థ లైసెన్స్ పొందిన మెడికల్ షాపుల ఆన్లైన్ ధృవీకరణనకిలీ/నాసిరకం ఔషధాలపై ఫిర్యాదులకు డిసి ఏ హెల్ప్‌లైన్అదే సందర్భంలో ఎంఎన్ఆర్ ఫార్మసీ కాలేజీలో "సే నో తో డ్రగ్స్ - ఎస్ టూ లైఫ్ " అనే అంశంపై నిర్వహించిన క్విజ్, వ్యాస రచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీ పి. రాము, డీఎస్పీ శ్రీ బి. పుష్పన్ కుమార్, డ్రగ్స్ ఇన్స్పెక్టర్లు రవికిరణ్ రెడ్డి, చంద్రశేఖర్, శ్రీకాంత్, ప్రవీణ్, వరప్రసాద్ పాల్గొన్నారు. అలాగే కెమిస్ట్ అండ్ డ్రగిస్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఈర్ల కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి అనుముల సంతోష్ కుమార్, కోశాధికారి ఏదిరే రమేష్, పట్టణ అధ్యక్షులు దశరథ, కార్యదర్శి శశికాంత్,కోశాధికారి కల్పగూర్ కృష్ణ, సాహితీ రాము, తదితరులు హాజరై తమ సందేశాలను అందించారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంలో కెమిస్ట్ అండ్ డ్రగిస్ట్స్ అసోసియేషన్, సంగారెడ్డి వారి సహకారం విశేషంగా నిలిచింది.ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లో ఔషధ వినియోగంపై అవగాహన మరింత పెరిగిందని అధికారులు తెలిపారు.



# అమీనపూర్ లో హైడ్రా భారీ ఆపరేషన్

**అమీనపూర్, ఏప్రిల్ 11 (వుదయం):**
సంగారెడ్డి జిల్లా అమీనాపూర్ లో హైడ్రా భారీ ఆపరేషన్ చేపట్టింది. పోలీస్ బందోబస్తు మధ్య అక్రమ కట్టడాలను కూల్చివేసింది.మున్సిపోల్ మరియు రెవిన్యూ అధికారులతో కలిసి ఈ ఆపరేషన్ నిర్వహిస్తోంది. ఆరు అంతస్థుల భవనాన్ని మరియు నిర్మానాలు జరిపిన గెస్ట్ హౌస్ భవనాన్ని కూడా కూల్చివేసింది. ఐలాపురం తండా తో పాటు గ్రామం లోనే పేదలు నివసిస్తున్న ఇళ్ల జోలికి వెళ్లకుండా ఖాళీ స్థలాలను హైడ్రా భారీ బందోబస్తు తో స్వాధీనం చేసుకుంది. అమీనాపురం మండలం ఐలాపురం గ్రామం లో గల 1263 ఎకరాల ప్రభుత్వ భూమి వున్ది. ఇప్పటికే ఇందులో చాల



నివాసాలు వెలిసాయి. ఈ నివాసాల జోలికి వెళ్లకుండా మిగిలి వూన్నా 860 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడేందుకు చర్యలు చేపట్టింది ఈ భూమి విలువ సుమారుగా రూ . 15 వేల కోట్లకు పైగా వూనుండొచ్చని అంచనా.

# పూలే జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి

- హెచ్ఎం భారతి

**నారాయణపేట , ఏప్రిల్ 10 (వుదయం ప్రతినిధి):**
మహాత్మ జ్యోతి రావు పూలే జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని నారాయణపేట మండలం జాజాపూర్ ఉన్నత పాఠశాల ఎచ్ ఎం.భారతీ అన్నారు. అనంతరం భారతి మాట్లాడుతూ పూలే అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలనతో పాటు మహి ళోద్ధరణకు కృషి చేసాడ న్నారు. 1873 సెప్టెంబరు 24న, పూలే తన అనుచ రులతో కలిసి, దిగువ కులాల ప్రజలకు సమాన హక్కులను పొందటానికి సత్యశోధక్ సమాజ్‌ను ఏర్పాటు చేశా డనీ తెలిపారు. అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం పనిచేసిన ఈ సంఘంలో అన్ని మతాలు, కులాల ప్రజలు కూడా చేరవచ్చు అని అతను అతని భార్య సావిత్రిబాయిపులే భారతదేశంలో మహిళా విద్యకు మార్గద ర్శకులు అయ్యారని అన్నారు. పూలే మహిళలకు, తక్కువ కుల ప్రజలకు విద్య ను అందించే ప్రయత్నాలకు ప్రసిద్ధి చెందాడన్నారు. పులే బాలికల కోసం మొదటి పాఠశాలను 1848లో పూనేలో ప్రారంభించాడనీ తెలిపారు.అంతేకాకుండా వితంతువుల కోసం ఒక గృహాన్ని కూడా స్థాపించాడనీ తెలిపారు.కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయు మధు సూదన్ రావు భాను ప్రకాష్ లక్ష్మణ్ నరసింహ ప్రతాప్ మంగళ నిర్మల శశిరేఖ శిరీష శ్రీదేవి రఘురాం రెడ్డి విద్యార్థులు పాల్గొన్నారు.



# నేటి యుగానికి సరికొత్త నాయకత్వ నమూనా

**వు దయం**



సహచర నాయకత్వం: భవిష్యత్ కార్యక్షేత్రం కోసం డాక్టర్ విశ్వానంద్ పట్టార్ ఒక మానవకేంద్రీకృత నమూనాని పరిచయం చేస్తున్నారువేగవంతమైన మార్పు, అనిశ్చితి, మరియు అర్థవంతమైన పనికి పెరుగుతున్న డిమాండ్ ఉన్న ఈ యుగంలో, డాక్టర్ విశ్వానంద్ పట్టార్ ఒక విప్లవాత్మక నాయకత్వ తత్వాన్ని ఆవిష్కరించారు: అదే సహచర నాయకత్వం. ఈ విధానం, నాయకులను తమ బృందాలతో పాటు నడిచే సహచరులుగా పునర్నిర్మిస్తుంది. ఇది వారిలో నమ్మకాన్ని, సానుభూతిని, మరియు ఉమ్మడి లక్ష్యాన్ని పెంపొందిస్తుంది. నేటి అస్థిరమైన మరియు సంక్లిష్టమైన వ్యాపార వాతావరణంలో సంస్థలు ఎదుర్కొంటున్న సవాళ్లకు ఇది ఒక సకాల స్పందన.

**నాయకత్వంలో ఒక సమూల మార్పు**
దశాబ్దాలుగా, నాయకత్వ నమూనాలలో ఆదేశనియంత్రణ నిర్మాణాలు ఆధిపత్యం చెలాయించాయి. వీటిలో అధికారం ముందు నుండి చెలాయించబడటం లేదా వెనుక నుండి అమలు చేయబడటం జరిగేది. పారిశ్రామిక సందర్భాలలో ఇవి ప్రభావవంతంగా ఉన్నప్పటికీ, జ్ఞానఆధారిత, సహకార కార్యాలయాలలో ఈ నమూనాలు తరచుగా విఫలమవుతాయి. నేటి ఉద్యోగులు తాము ఒక సమూహానికి చెందినవారమనే భావనను, మానసిక భద్రతను, మరియు ఒక లక్ష్యాన్ని కోరుకుంటున్నారు——సాంప్రదాయ నాయకత్వ శైలులు ఈ లక్షణాలను అరుదుగా అందిస్తాయి.డాక్టర్ పట్టార్ యొక్క సహచర నాయకత్వం ఈ సమూల నమూనాని సవాలు చేస్తుంది. ఇది ప్రజల ముందు లేదా వెనుక కాకుండా, వారి పక్కన నడవడాన్ని నొక్కి చెబుతూ, ప్రయాణంలో సమానత్వ భావనను సృష్టిస్తుంది. నాయకులు దూరంగా ఉండే అధికార వ్యక్తులు కాదు, కానీ వారు విశ్వసనీయ సహచరులు. వీరు దార్శనికతను కలిసి సృష్టిస్తారు, స్థితిస్థాపకతను పెంపొందిస్తారు, మరియు పనితీరును శ్రేయస్సుతో సమతుల్యం చేస్తారు.
ప్రధాన సూత్రాలుసహచర నాయకత్వం



నాలుగు ప్రాథమిక సూత్రాలపై ఆధారపడి ఉంటుంది:
* ప్రయాణంలో సమానత్వం: పురోగతి అనేది సామూహికమైనది, నాయకులు మరియు బృందాలు కలిసి ముందుకు సాగుతాయి.ఈ తత్వశాస్త్రం హైబ్రిడ్ మరియు గ్లోబల్ కార్యాలయాలలో బలంగా ప్రతిధ్వనిస్తుంది, ఇక్కడ నిమగ్నతను కొనసాగించడానికి అనుబంధం మరియు విశ్వాసం చాలా కీలకం.సహచర నాయకత్వం ఎందుకు ముఖ్యమైనదిఆధునిక కార్యాలయం VUCA——అస్థిరత, అనిశ్చితి, సంక్లిష్టత మరియు అస్పష్టత——ద్వారా రూపుదిద్దుకుంటుంది. ఇటువంటి పరిస్థితులలో, కఠినమైన అధికార శ్రేణులు తరచుగా సృజనాత్మకతను అణచివేసి, ప్రతిభను నిరుత్సాహపరుస్తాయి. దీనికి విరుద్ధంగా, సహచర నాయకత్వం అస్పష్టతలో వృద్ధి చెందుతుంది. ఇది సంభాషణను ప్రోత్సహిస్తుంది, ఆవిష్కరణలను పెంపొందిస్తుంది, మరియు ఉద్యోగులు సాహసాలు చేయడానికి స్వేచ్ఛ ఉందని భావించే సంస్కృతులను నిర్మిస్తుంది.
"నేటి నాయకత్వం అంటే ముందుండి ఆదేశించడం కాదు," అని డాక్టర్ పత్తర్ అంటారు. "అది మీ ప్రజలతో కలిసి నడవడం, వారి ప్రయాణాన్ని పంచుకోవడం, మరియు నమ్మకం, సృజనాత్మకత వర్ధిల్లే వాతావరణాన్ని సృష్టించడం."
ఆచరణాత్మక అనువర్తనాలుసంస్థలు ఈ క్రింది వాటి ద్వారా సహచర నాయకత్వాన్ని పొందుపరచగలవు:
1. నాయకత్వ అభివృద్ధి కార్యక్రమాలు: నిర్వాహకులకు చురుకైన శ్రవణం, సానుభూతి మరియు సహసృష్టిలో శిక్షణ ఇవ్వడం.
2. సహకార నిర్మాణాలు: పైనుండి వచ్చే ఆదేశాలకు బదులుగా, బృందఆధారిత నిర్ణయాలను ప్రోత్సహించడం.
3. పనితీరు వ్యవస్థలు: వ్యక్తిగత KPIల నుండి ఉమ్మడి జవాబుదారీతనాన్ని ప్రతిబింబించే సామూహిక ఫలితాలకు మారడం.
4. సంస్కృతి నిర్మాణం: సహచరత్వాన్ని ప్రతిబింబించే ప్రవర్తనలను——అంటే మార్గదర్శకత్వం, సహకారం మరియు సానుభూతిని——గుర్తించడం మరియు వాటికి బహుమతులు ఇవ్వడం.
ఈ పద్ధతులు నాయకత్వాన్ని ఒక పాత్ర నుండి ఒక సంబంధంగా మారుస్తాయి, తద్వారా సంస్థాగత పనితీరు మరియు ఉద్యోగుల శ్రేయస్సు రెండింటినీ బలోపేతం చేస్తాయి.

**సవాళ్లు మరియు పరిగణనలు**
ఆకర్షణీయంగా ఉన్నప్పటికీ, సహచర నాయకత్వంలో సవాళ్లు లేకపోలేదు. నాయకులు అస్పష్టమైన జవాబుదారీతనం పట్ల జాగ్రత్త వహించాలి, శ్రేణిబద్ధమైన వాతావరణాలలో సాంస్కృతిక అనుగుణ్యతను నిర్ధారించుకోవాలి, మరియు సంబంధిత ఫలితాలను కొలవడానికి కొత్త కొలమానాలను అభివృద్ధి చేయాలి. అయినప్పటికీ, ఆధునిక పని వాస్తవాలకు అనుగుణంగా నాయకత్వ నమూనాలను మార్చుకుంటూ, సంస్థలు పరిణామం చెందడానికి ఈ సవాళ్లు అవకాశాలుగా నిలుస్తాయి.భవిష్యత్తు కోసం ఒక నాయకత్వ నమూనాసహచర నాయకత్వం, సేవక నాయకత్వం మరియు సమ్మిళిత నాయకత్వం వంటి విస్తృత ఉద్యమాలతో ఏకీభవిస్తుంది, కానీ పక్కన నడవడం అనే దాని రూపకం ద్వారా తన ప్రత్యేకతను చాటుకుంటుంది. ఇది ఆధునిక నాయకత్వం యొక్క సారాంశాన్ని సంగ్రహించే ఒక రూపకం: ముందుండి ఆజ్ఞాపించడం కాదు, వెనుక నుండి నెట్టడం కాదు, కానీ కలిసి ప్రయాణించడం.సంస్థలు వేగవంతమైన సాంకేతిక, సామాజిక మరియు ఆర్థిక మార్పులను ఎదుర్కొంటున్నప్పుడు, సహచర నాయకత్వం ముందుకు సాగడానికి ఒక సుస్థిరమైన మార్గాన్ని అందిస్తుంది. ఇది అధికారాన్ని వదులుకోవడం గురించి కాదు, దానిని సహవాసంగా పునర్నిర్మించుకోవడం గురించి——విశ్వాసం, సృజనాత్మకత మరియు దృఢత్వం అనేవి కేవలం ఆకాంక్షనీయ విలువలు కాకుండా, జీవన వాస్తవాలుగా ఉండే కార్యాలయాలను సృష్టించడం.

# నకిలీ, అలవాటు ఔషధాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు

- నాగర్‌కర్నూల్‌లో భారీ అవగాహన ర్యాలీ
- కెమిస్టులు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి
- అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీస్) జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్
- అడిషనల్ ఎస్‌పి నోముల వెంకటేశ్వర్లు

**నాగర్ కర్నూల్ ,ఏప్రిల్ 11 (వుదయం ప్రతినిధి):**
ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నాగర్‌కర్నూల్ జిల్లాలో డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ ఆధ్వర్యంలో శనివారం "ఔషధ నియంత్రణ మరియు నియంత్రణ వ్యవస్థ బలోపేత దినోత్సవం" సందర్భంగా భారీ అవగాహన ర్యాలీ మరియు సమావేశం నిర్వహించారు. డ్రగ్స్ ఇన్స్పెక్టర్ కార్యాలయం నుండి ప్రారంభమైన ర్యాలీని అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీస్) జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్ జెండా ఊపి ప్రారంభించారు .ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పి నోముల వెంకటేశ్వర్లు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రవికుమార్ నాయక్, డీఎస్పీ శ్రీనివాసులు, ఈగల్ ఫోర్స్ సిఐ ప్రసాద్, డ్రగ్ ఇన్స్పెక్టర్ విశ్వంత్ రెడ్డి పాల్గొన్నారు. ర్యాలీ పట్టణంలోని ప్రధాన వీధుల గుండా సాగి ప్రజలకు ఔషధాల సరైన వినియోగం, నకిలీ మందుల నివారణ, అలవాటు ఔషధాల దుష్ప్రభావాలపై విస్తృత అవగాహన కల్పించారు.అనంతరం జరిగిన సమావేశంలో అడిషనల్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్ మాట్లాడుతూ ఔషధాల విక్రయం ప్రజల ఆరోగ్యంతో ముడిపడి ఉన్న బాధ్యతాయుతమైన పని అని తెలిపారు. షెడ్యూల్ హెచ్, హెచ్1 ఔషధాలను కేవలం వైద్యుల ప్రిస్క్రిప్షన్ ఆధారంగా మాత్రమే విక్రయించాలని సూచించారు. మెడికల్ షాపుల్లో క్యూఆర్ కోడ్ వెరిఫికేషన్ అమలు చేయడం, ఔషధాల నిల్వ, గడువు తేదీల తనిఖీ, రికార్డుల నిర్వహణలో నిబంధనలు కచ్చితంగా పాటించాలని కోరారు.అడిషనల్ ఎస్పి నోముల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అలవాటు కలిగించే ఔషధాల అక్రమ విక్రయాలు సమాజానికి ముప్పుగా మారుతున్నాయని తెలిపారు. ఇటువంటి ఔషధాలను నిబంధనలు ఉల్లంఘించి విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈగల్ ఫోర్స్ సిఐ ప్రసాద్ మాట్లాడుతూ యువతను డ్రగ్స్ నుండి దూరంగా ఉంచేందుకు సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. డీఎం&హెచ్‌వో డాక్టర్ రవికుమార్ నాయక్ మాట్లాడుతూ ఔషధ దుష్ప్రభావాల నివేదిక (ADR)పై కెమిస్టులు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఔషధాలను సరైన ఉష్ణోగ్రతలో నిల్వ చేయడం, గడువు తేదీలను పరిశీలించడం వంటి అంశాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. డీఎస్పీ శ్రీనివాసులు మాట్లాడుతూ నిబంధనలు పాటించకుండా ఔషధాలను విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.డ్రగ్ ఇన్స్పెక్టర్ విశ్వంత్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో మెడికల్ షాపులపై తనిఖీలు మరింత కట్టుదిట్టం చేయనున్నట్లు తెలిపారు. షెడ్యూల్ హెచ్, హెచ్1 ఔషధాల విక్రయంలో రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ జిల్లా ఫార్మసీ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేష్, ట్రెజరర్ కుమార్, నాగర్‌కర్నూల్ జిల్లా కెమిస్ట్స్ & డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎ. సాయిబాబు, జిల్లా కార్యదర్శి సురేష్ బాబు, ట్రెజరర్ నాగరాజు, టౌన్ అధ్యక్షుడు శ్రీనివాసులు, అచ్చంపేట అధ్యక్షుడు చంద్రకుమార్, కల్వకుర్తి ప్రతినిధులు, గవర్నమెంట్ నర్సింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపల్, విద్యార్థులు, జిల్లాలోని పలువురు కెమిస్టులు, డ్రగ్గిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# అసమానతల నిర్మూలనకు పూలే బాట మార్గదర్శకం

- ఆధునిక సమాజపు కాంతిరేఖ జ్యోతిభా పూలే
- అసమానతలు అంతానికి అయన కృషి చిరస్మరనీయం

**వికారాబాద్, వుదయం ప్రతినిధి:**
దళిత ప్రజాసంఘాలు దేశంలో వేల ఏండ్లుగా కొన సాగుతున్న అసమానతలను విద్య అనే ఆయుధాన్ని మెజార్టీ ప్రజలకు అందించి మనుషుల మధ్య అసమానతలు లేని సమాజం కోసం కృషిచేసిన పూలే ఆధునిక సమాజపు కాంతిరేఖ అని దళిత ప్రజా సంఘాల నాయకులు కొనియాడారు . మనుషులందరూ సమానమేనని చాటిచెప్పి కుల వ్యవస్థకు వ్యతిరేకంగా అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషిచేసిన అయన స్పూర్తితో కులరహిత సమాజ నిర్మాణం కోసం కలిసి కట్టుగా అందరూ కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. శనివారం తాండూర్ పట్టణం సీతారాం పేట్ లో మహాత్మ జ్యోతిబా పూలే 199వ జయంతిని పరిష్కరించుకొని పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి కే శ్రీనివాస్,కేవీపీస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య,SC ST బీసీ మైనార్టీ హక్కుల సమితి జిల్లా అధ్యక్షులు కొత్తూరు చంద్రయ్యలు మాట్లాడుతూ....
*మహాత్మా జ్యోతిబా పూలే 19వ శతాబ్దపు భారతదేశంలో సామాజిక మార్పుకు కృషి చేసిన మహనీయుడని వారు తెలిపారు ప్రముఖ,సంఘసంస్కర్తగా ఆలోచనాపరుడుగా తన జీవితాన్ని కుల ఆధారిత వివక్షకు వ్యతిరేకంగా పోరాడటానికి మరియు అణగారిన వర్గాల,ముఖ్యంగా మహిళలు మరియు నిమ్న కులాల వారి హక్కుల కోసం ఆయన జీవితం అంకితం చేశారని వారు కొనియాడారు.భారతదేశంలో మహిళా విద్య మరియు సాధికారత ఉద్యమంలో పూలే ఒక మార్గదర్శక వ్యక్తి అని వారు



అన్నారు .ఆయన సాంప్రదాయ కట్టుబాట్లను బద్దలు కొట్టి,అప్పటి సామాజిక వ్యవస్థను సవాలు చేస్తూ 1848లో పూణేలో మొదటి బాలికల పాఠశాలను స్థాపించారని నాయకులు చెప్పారు విద్య,సామాజిక సంస్కరణ మరియు సమానత్వం ద్వారా అణగారిన వారిని ఉన్నతీకరించడమే లక్ష్యంగా కృషి చేసారని నాయకులు అన్నారు.వితంతువులకు పునర్వివాహాలు చేసి వృద్ధుల కోసం శరణాలయాలు నిర్మించారని సంఘనాయకులుతెలిపారు.కేంద్ర బిజెపి సర్కార్ నూతన జాతీయ విద్యా విధానం పేరిట అట్టడుగు వర్గాలకు ఉన్నత విద్యను దూరం చేస్తుందని ఆరోపించారు.బలహీనవర్గాలకు బిజెపి బడ్జెట్ లో రిజర్వేషన్లలో తీరని అన్యాయం చేస్తుందని ముమ్మాటికి బీజేపీ బలహీనవర్గాల బద్ధ శత్రువుగా నిలుస్తుందని నాయకులు విమర్శించారు.ఈ జయంతి కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు యు.బుగ్గప్ప,VHPS పట్టణ కార్యదర్శి గజేలప్ప,MRPS టౌన్ అధ్యక్షులు,బలరాం కార్యదర్శి CH రవి కుమార్,యాదగిరి, Y రాములు,CH మల్లేష్, ch రమేష్, రామాంజనేయులు, Y భాను,కన్నా,గణేష్,చందు, కిట్టు,నగేష్ పాల్గొన్నారు.

# మహనీయుల త్యాగాల ఫలితమే నేటి స్వేచ్ఛ

- అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్
- ఘనంగా మహాత్మా జ్యోతిబా పూలే 200వ జయంతి ఉత్సవాలు
- విపంచి కళానిలయంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న అదనపు కలెక్టర్

**సిద్దిపేట, ఏప్రిల్ 11 (వుదయం ప్రతినిధి)**
సమాజంలో కుల, మత, లింగ వివక్షత లేని స్వేచ్ఛాయుత జీవనాన్ని నేడు మనం అనుభవిస్తున్నామంటే అది 200 ఏళ్ల క్రితమే మహాత్మా జ్యోతిబా పూలే చేసిన పోరాటాల ఫలితమేనని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) అబ్దుల్ హమీద్ అన్నారు. శనివారం జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సిద్దిపేట పట్టణంలోని విపంచి కళానిలయంలో మహాత్మా జ్యోతిబా పూలే 200వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతిబా పూలే చిత్రపటానికి నివాళులర్పించారు.యువతకు స్ఫూర్తి పూలే దంపతుల ప్రస్థానంఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలంటే అది ఒక్క విద్యతోనే సాధ్యమని పూలే నమ్మారని, అందుకే ఎన్ని అవమానాలు ఎదురైనా పట్టువదలక చదువుకుని సమాజాన్ని చైతన్య పరిచారని గుర్తుచేశారు. తన భార్య సావిత్రిబాయి పూలేకు చదువు చెప్పించి, అప్పట్లోనే బాలికల విద్య కోసం పాఠశాలలు స్థాపించిన గొప్ప సంస్కర్త పూలే అని కొనియాడారు. సమాజం, కుటుంబం నుంచి వ్యతిరేకత వచ్చినా అనుకున్న లక్ష్యం కోసం పోరాడే తత్వాన్ని నేటి తరం యువత పూలే దంపతుల నుండి నేర్చుకోవాలని సూచించారు. పూలే చరిత్రను చదివి, దాని ప్రాముఖ్యతను పదిమందికి చాటి చెప్పాలని కోరారు. ఈ ఉత్సవాల్లో సిద్దిపేట మున్సిపల్ చైర్‌పర్సన్ కడవేరుగు మంజుల రాజనర్సు, జిల్లా రెవెన్యూ అధికారి (DRO) నాగరాజమ్మ, బీసీ సంక్షేమ శాఖ అధికారి సయ్యద్ రఫీ, నాయకులు పయ్యావుల రాములు, పోచబోయిన శ్రీహరి యాదవ్, మామిండ్ల ఐలయ్య, మురళీకృష్ణ, నవీన్ గౌడ్, ప్రశాంత్, పరశురాములు, కోటగిరి ప్రభాకర్ తదితరులు పాల్గొని పూలే సేవలను స్మరించుకున్నారు.




# మత్తు పదార్థాలతో యువత జీవితం అంధకారం

- అదనపు కలెక్టర్ నర్సింగరావు

**గద్వాల, ఏప్రిల్ 11 (వుదయం ప్రతినిధి) :**
డ్రగ్స్ మహమ్మారిని పారద్రోలేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, మత్తు పదార్థాలతో యువత జీవితం అంధకారం అవుతుందని అదనపు కలెక్టర్ నర్సింగరావు అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం నేపథ్యంలో నిర్వహిస్తున్న ఆరోగ్య వారోత్సవాల్లో భాగంగా ఆదివారం గద్వాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో మత్తు పదార్థాల నియంత్రణ బలోపేత దినోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా గద్వాల కృష్ణవేణి చౌరస్తా నుంచి అంబేద్కర్ చౌరస్తా మీదుగా ప్రభుత్వ ఆసుపత్రి వరకు ముఖ్య అతిథులు, వైద్యాధికారులు, విద్యార్థులతో కలిసి డ్రగ్స్ వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా



గద్వాల ప్రభుత్వ ఆసుపత్రిలో మత్తు ప్రభావితుల చికిత్స విభాగం, అడిక్షన్ ట్రీట్మెంట్ ఫెసిలిటీ సెంటర్ ను గద్వాల పురపాలక చైర్మన్ తుమ్మల జయలక్ష్మి, అదనపు కలెక్టర్ నర్సింగరావు, డీఎస్పీ మొగులయ్య చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కేంద్రంలో మత్తు పదార్థాలకు బానిసైన వారికి మానసిక వైద్య నిపుణుల ద్వారా చికిత్స, కౌన్సిలింగ్ మరియు ఉచిత మందులు అందించబడతాయని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఇందిర తెలిపారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న అదనపు కలెక్టర్ నర్సింగరావు మాట్లాడుతూ మత్తు పదార్థాల వల్ల యువత భవిష్యత్తు తీవ్రమైన ప్రమాదంలో పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. మత్తు తీసుకుని డ్రైవింగ్ చేయడం వలన జరిగే యాక్సిడెంట్లలో చాలామంది యువత ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. పరీక్షల సమయంలో వచ్చే ఒత్తిడిని సరైన ప్రణాళికతో అధిగమించవచ్చని తాత్కాలిక ఉపశమనం కోసం మత్తు పదార్థాలవైపు మళ్లడం భవిష్యత్తును నాశనం చేస్తుందని హెచ్చరించారు. డీఎస్పీ మొగిలయ్య మాట్లాడుతూరాష్ట్రంలో మత్తు పదార్థాల నియంత్రణకు కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు, ఈ దిశగా ఈగల్ టీమ్ నిరంతరం పనిచేస్తుందని తెలియజేశారు. ఎవరైనా మత్తు పదార్థాలకు బానిసై ఉంటే లేదా డ్రగ్స్ పంపిణీ జరుగుతున్నట్లు తెలిసినా, ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్ 1908 కు సమాచారం అందించాలని సూచించారు. అనంతరం మెడికల్, నర్సింగ్ కళాశాలల విద్యార్థులకి నిర్వహించిన వ్యాసరచన, క్విజ్, డ్రాయింగ్ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మానసిక వైద్య నిపుణులు డాక్టర్ హేమలత, ఆసుపత్రి ఆర్ఎంఒ డాక్టర్ వెంకట దాస్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సంధ్య కిరణ్మయి, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ వైస్ డాక్టర్ నాగేశ్వరరావు, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ హనుమంతమ్మ, హెల్త్ ఎడ్యుకేటర్లు శ్రీనివాసులు, మధు, వైద్య, నర్సింగ్ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నేరాల నియంత్రణపై దృష్టి సారించాలి

- డిఎస్పీ లింగయ్య

**నారాయణపేట , ఏప్రిల్ 10 (వుదయం ప్రతినిధి):**
నేరాల నియంత్రణపై పోలీసులు దృష్టి సారించా లని నారాయణపేట డీఎస్పీ లింగయ్య అన్నారు. నారాయణపేట సర్కిల్, కోస్గి సర్కిల్ పరిధిలోని పోలీసు అధికారులతో డీఎస్పీ కార్యా లయంలో శనివారం నేర సమీక్షా సమావేశాన్ని నల్లపు లింగయ్య నిర్వహించారు.
ఈ సందర్భంగా జిల్లాలో నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని, పెండిం గ్‌లో ఉన్న కేసులను వేగవంతంగా పరిష్కరించా లని అధికారులకు సూచించారు.పెండింగ్‌లో ఉన్న అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులపై సమగ్రంగా చర్చిస్తూ, గ్రేవ్ , నాన్‌గ్రేవ్ కేసుల దర్యాప్తు విధానంపై సీఐలు, ఎస్సైలను అడిగి తెలుసుకున్నారు. దర్యాప్తు సమయంలో అనుసరించాల్సిన విధానాలు, సేకరించాల్సిన ఆధారాలు, ప్రామాణిక విధానాలు (ఎస్ ఓ పి) గురించి వివరంగా మార్గనిర్దేశనం చేశారు.ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూప్రతి కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ ఉండాలని, ప్లాన్ ఆఫ్ యాక్షన్ ప్రకారం దర్యాప్తు జరిపి కేసులను ఛేదించాలని సూచించారు. కేసుల్లో శిక్షల శాతం పెంచేందుకు పటిష్ట ఆధారాలు సేకరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. కేసు నమోదు నుండి చార్జ్‌షీట్ దాఖలు వరకు ప్రతి అంశాన్ని కూలంకషంగా పరిశీలించి పూర్తి పారదర్శకతతో దర్యాప్తు జరపాలని పేర్కొన్నారు. అక్రమ ఇసుక రవాణా, గంజాయి, గుట్కా, పేకాట వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలపై ప్రత్యేక దాడులు నిర్వహించి వాటిని నిర్మూలించాలని ఆదేశించారు. ఫోక్సో, ఎస్సీ/ఎస్టీ, ఇతర గ్రేవ్ కేసుల్లో వేగంగా దర్యాప్తు పూర్తి చేసి 60 రోజుల్లో చార్జ్‌షీట్ దాఖలు చేయాలని స్పష్టం చేశారు.ప్రతి పోలీసు అధికారి స్టేషన్ మేనేజ్‌మెంట్‌తో పాటు పూర్తి స్థాయి దర్యాప్తు పరిజ్ఞానం కలిగి ఉండాలని, కేసులను ప్రతిరోజు ఆన్లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. లాంగ్ పెండింగ్ కేసులను త్వరితగతిన ఛేదించాలని ఆదేశించారు.అరయివ్ అలైవ్ రోడ్డు భద్రత కార్యక్రమాలు, సైబర్ నేరాలు, డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సీఐలు శివశంకర్, సైదులు, ఎస్సైలు వెంకటేశ్వర్లు, రాజు, సతీష్‌రెడ్డి, విజయ్, స్టేషన్ రైటర్లు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.




# కేంద్ర ప్రభుత్వ కుట్రలను తిప్పికొట్టాలి

- ఉపాధిహామీ పథకం రద్దుపై కాంగ్రెస్ గర్జన

**సిద్దిపేట, ఏప్రిల్ 11 (వుదయం ప్రతినిధి) :**
కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తూ, కార్మికుల పొట్ట కొట్టాలని చూస్తోందని సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు తూంకుంట ఆంక్ష రెడ్డి మండిపడ్డారు. సిద్దిపేట జిల్లా కుక్కునూరుపల్లి మండల పరిధిలోని శనివారంకొనాయిపల్లి, మేదినిపూర్, చిన్న కిష్టాపూర్, పి.టి. వెంకటపూర్, రాయవరం గ్రామాల్లో ఉపాధి హామీ కార్మికులతో ఆమె ముఖాముఖి గా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆంక్ష రెడ్డి మాట్లాడుతూ కేంద్రం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగట్టారు.మహాత్మా గాంధీ పేరును తొలగించి, పథకాన్ని 'వి బి జి రాంజీ'గా మార్చాలనే దుర్బుద్ధితో కేంద్రం ఉందన్నారు. ఇప్పటివరకు కేంద్రమే భరిస్తున్న నిధులను తగ్గించి, 60% కేంద్రం 40% రాష్ట్రం భరించాలనే నిబంధనతో పథకాన్ని అటకెక్కించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు.కార్మికుల హక్కులను హరించే నూతన లేబర్ కోడ్లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. యూపీఏ ప్రభుత్వం హయాంలో వలసలను నివారించి, గ్రామీణ పేదలకు చేతినిండా పని కల్పించాలనే సంకల్పంతో 'కామన్ మినిమం ప్రోగ్రామ్' ద్వారా తెచ్చిన ఈ చట్టాన్ని రద్దు చేసే కుట్రలను సహించేది లేదు అన్నారు. వ్యవసాయ అనుబంధ పనులను ఉపాధి హామీ నుండి తొలగించడం ద్వారా అటు రైతులను, ఇటు కూలీలను కేంద్రం వంచిస్తోందని ఆమె పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని వ్యవసాయ కూలీలు, గిరిజనుల హక్కుల రక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ క్షేత్రస్థాయిలో ఉద్యమిస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, భారీ సంఖ్యలో ఉపాధి హామీ కార్మికులు మరియు రైతులు పాల్గొన్నారు.



# చక్కని ఆరోగ్యం


## కప్పువాము నీరుతో ఆ సమస్యలకు చెక్..

ఉదయాన్నే ఖాళీ కడుపుతో వాము నీటిని తీసుకోవడం వల్ల బరువు తగ్గడం, జీర్ణ సమస్యలైన గ్యాస్, ఎసిడిటీ, మలబద్ధకం నుండి ఉపశమనం లభిస్తుంది. ఇది రోగనిరోధక శక్తిని పెంచి, కీళ్ల నొప్పులు, కొలెస్ట్రాల్, పీరియడ్స్ నొప్పి వంటి అనేక అనారోగ్య సమస్యలను నివారించడానికి సహాయపడుతుంది. ప్రస్తుత ఆధునిక జీవనశైలి, ఆహారపు



అలవాట్ల కారణంగా చాలామంది అధిక బరువు, పొట్ట చుట్టూ కొవ్వు పేరుకుపోవడం వంటి సమస్యలతో బాధపడుతున్నారు. ఈ సమస్యలకు పరిష్కారంగా అనేక వ్యాయామాలు ప్రయత్నించినప్పటికీ ఫలితం కనిపించని వారికి.. వాము నీరు ఒక సహజసిద్ధమైన, ప్రభావవంతమైన పరిష్కారం. డయాబెటిస్, అధిక లేదా తక్కువ రక్తపోటు, మోకాళ్ళ నొప్పులు, కీళ్ల నొప్పులు, నడుము నొప్పి వంటి అనేక ఆరోగ్య సమస్యల నుండి ఉపశమనం పొందడానికి వాము నీరు ఎంతగానో సహాయపడుతుంది. మన రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేయడానికి వాము ఒక అద్భుతమైన ఔషధం. ఆయుర్వేద మూల గ్రంథమైన అష్టాంగ హృదయంలో మహర్షి వాగ్భటాచార్య వామును వాత, పిత్త, కఫ నాశకారిణిగా వర్ణించారు. అంటే, కడుపులో ఏర్పడే గ్యాస్ (వాతం), ఎసిడిటీ (పిత్తం), శ్లేష్మం (కఫం) వంటి సమస్యలను ఇది నివారిస్తుంది. వాత దోషం వల్ల వచ్చే కీళ్ల నొప్పులు, శరీర నొప్పులు, గుండెలో నొప్పి వంటి సమస్యలకు వాము నీరు పరిష్కారం చూపుతుంది. వాములో యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు పుష్కలంగా ఉంటాయి. ఇందులో ప్రోటీన్, కాల్షియం, ఐరన్, నికోటిన్ ఆసిడ్, కార్బోహైడ్రేట్లు, డైటరీ ఫైబర్ వంటి పోషకాలు సమృద్ధిగా ఉన్నాయి. వాము నీటిని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల జీర్ణవ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. కడుపు నొప్పి, గ్యాస్, మలబద్ధకం, ఎసిడిటీ వంటి సమస్యల నుండి తక్షణ ఉపశమనం లభిస్తుంది. మలబద్ధకం కారణంగా వచ్చే పైల్స్ వంటి సమస్యల నివారణకు కూడా ఇది చాలా ఉపయోగపడుతుంది. వాము నీటిని తయారు చేసే విధానం: రాత్రి పడుకునే ముందు ఒక గ్లాసు నీటిలో అర టీస్పూన్ వామును వేసి నానబెట్టాలి. ఉదయాన్నే వాము పూర్తిగా నానిపోయి, నీరు రంగు మారుతుంది. ఈ నీటిని నేరుగా లేదా గోరువెచ్చగా చేసుకుని తాగవచ్చు. బరువు తగ్గాలనుకునే వారు గోరువెచ్చగా తాగితే మంచి ఫలితాలు ఉంటాయి. మరొక పద్ధతిలో, వామును నీటిలో వేసి బాగా మరిగించి, ఆ నీటిని చల్లార్చి తాగవచ్చు. ఈ పద్ధతి ముఖ్యంగా పీరియడ్స్ నొప్పి, గొంతు నొప్పి వంటి వాటికి ఉపశమనం కలిగిస్తుంది. వాము నీరు శరీర మెటబాలిజంను పెంచుతుంది. ఆకలి లేని వారికి ఆకలిని కలిగిస్తుంది. దీర్ఘకాలంగా అనేక అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు, ముఖ్యంగా రోగనిరోధక శక్తిని పెంపొందించుకోవాలనుకునే వారికి వాము నీరు ఒక అద్భుతమైన సహజ చికిత్స.. అని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. ఉదయాన్నే ఈ నీటిని తాగడం మరిన్ని ప్రయోజనాలు చేకూరుతాయని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు.

## వంద రోగాలను తరిమికొట్టచ్చు పసుపు రంగు పుచ్చకాయ..



రోగనిరోధక శక్తి కూడా పెరుగుతుంది. ఆ రోగాలను ఇట్టే తరిమికొట్టచ్చు పసుపు రంగు పుచ్చకాయలో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. ఇది ఇన్ఫెక్షన్ల నుంచి మనల్ని కాపాడుతుంది. అలాగే, ఇమ్యూనిటీ పవర్ ను కూడా పెంచుతుంది. చర్మం, కంటి ఆరోగ్యం: దీనిలో ఉండే బీటా కెరోటిన్ చర్మం, కంటి సమస్యల కాపాడుతుంది. అందుకే, దీనిని తినాలని వైద్యులు చెబుతున్నారు

ఎరుపు రంగు పుచ్చకాయ కంటే పసుపు పుచ్చకాయ తినడమే బెస్ట్ అని వైద్యులు కూడా చెబుతున్నారు. వీటిలో విటమిన్ ఎ, సి ఎక్కువగా ఉంటాయి. అలాగే, దీని వలన హైడ్రేషన్: వీటిలో 90% కంటే నీరు ఎక్కువ ఉంటుంది. ఇది అన్ని రోగాలను నివారిస్తుంది. గుండె ఆరోగ్యం: వీటిలో పొటాషియం, మెగ్నీషియం ఉంటాయి. ఇవి బ్లడ్ ప్రజర్ ను నియంత్రిస్తాయి. జీర్ణక్రియ: వీటిలో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. ఇది జీర్ణ క్రియను పని తీరును మెరుగుపరుస్తుంది.

## రాగిజావ ఎప్పుడు తీసుకుంటే మంచిది?


రాగి జావ అపారమైన ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. ఇది క్యాల్షియం, ఐరన్, ఫైబర్, ప్రోటీన్‌లతో నిండి ఉంటుంది. జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది, బరువు తగ్గడానికి, ఎముకలు దృఢంగా ఉండటానికి, రోగనిరోధక శక్తిని పెంచడానికి దోహదపడుతుంది.. ఇంకా రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడానికి సహాయపడుతుంది. ఒత్తిడిని తగ్గించి,



పిల్లల ఎదుగుదలకు తోడ్పడుతుంది. రాగుల్లో ఎన్నో పోషకాలు దాగున్నాయి. అందుకే.. చిన్నా, పెద్దా తేడా లేకుండా ప్రతిఒక్కరూ రాగి జావ తాగాలని సూచిస్తుంటారు ఆరోగ్య నిపుణులు.. వాస్తవానికి రాగి జావ ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే సంప్రదాయ ఆహారం. దీనిని రోజుకొకసారి తీసుకోవడం వల్ల పొట్టలో చల్లదనం లభించడంతో పాటు ఆరోగ్యపరంగా అనేక లాభాలు చేకూరుతాయి. రాగులలో క్యాల్షియం, ఐరన్, ప్రోటీన్, ఫైబర్, మినరల్స్, అయోడిన్ వంటి ముఖ్యమైన పోషకాలు పుష్కలంగా ఉంటాయి. కొవ్వులు చాలా తక్కువగా ఉండటం, ముఖ్యంగా అసంతృప్త కొవ్వును కలిగి ఉండటం వల్ల ఇది చాలా సులభంగా జీర్ణమైపోతుంది. అంతేకాకుండా.. ఇది ఎముకలను బలోపేతం చేసి, తక్షణ శక్తిని అందిస్తుంది. రాగి జావ ఆరోగ్య ప్రయోజనాలు:బరువు నియంత్రణ: రాగుల్లో ట్రిప్టోఫాన్ అనే అమినో ఆమ్లం ఉండటం వల్ల ఇది ఆకలిని తగ్గిస్తుంది. ఫలితంగా, అధిక ఆహారం తీసుకోవడాన్ని నియంత్రించి, బరువును నియంత్రణలో ఉంచుతుంది. బరువు తగ్గాలనుకునే వారికి రాగి జావ లేదా సంగటి మంచి ప్రయోజనం అందిస్తుంది. ఎముకల దృఢత్వం: రాగులలో క్యాల్షియం పుష్కలంగా లభిస్తుంది. దీన్ని ప్రతిరోజూ తీసుకోవడం వల్ల ఎముకలు దృఢంగా ఉంటాయి. పిల్లల ఎదుగుదలకు కూడా ఇందులో ఉండే క్యాల్షియం తోడ్పడుతుంది.రక్తహీనత నివారణ: రాగులలో ఐరన్ మోతాదు ఎక్కువగా ఉంటుంది. రక్తహీనతతో బాధపడేవారు దీనిని తరచూ తీసుకోవడం ద్వారా మంచి ఫలితం పొందవచ్చు.రోగనిరోధక శక్తి పెరుగుతుంది: రాగి పిండిలో విటమిన్ సి కూడా ఉంటుంది. ఇది రోగనిరోధక శక్తిని పెంచడంతో పాటు చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడానికి సహాయపడుతుంది. రక్తంలో చక్కెర స్థాయిల నియంత్రణ: రాగి జావ వల్ల రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు అదుపులో ఉంటాయి. మధుమేహగ్రస్తుల్లో చక్కెర స్థాయిలను నియంత్రించడానికి ఇది సహాయపడుతుంది. ఒత్తిడి, ఆందోళన తగ్గుతుంది: రాగి పిండిలో పలు రకాల అమినో ఆమ్లాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి మానసిక ఒత్తిడి, ఆందోళనలను తగ్గించడంలో తోడ్పడతాయి.జీవక్రియల మెరుగుదల: రాగిలోని పోషకాలు కండరాల ఆరోగ్యానికి, రక్తం తయారవ్వడానికి, జీవక్రియలు సాఫీగా జరగడానికి దోహదపడతాయి.. ఫైబర్ ప్రయోజనాలు: రాగుల్లోని ఫైబర్ కడుపు నిండిన అనుభూతిని కలిగిస్తుంది. దీని వల్ల అధికంగా ఆహారం తీసుకోవడం తగ్గి, జీర్ణవ్యవస్థ పనితీరు మెరుగుపడుతుంది. రాగి జావను సులభంగా తయారు చేసుకోవచ్చు.. ముందుగా నీటిలో కొంచెం (2-3 స్పూన్ల పిండిని కలుపుకోవాలి.. ముద్దలు కాకుండా చూడాలి.. అలాగే.. రెండు, మూడు గ్లాసుల నీటిని వేడి చేసి.. దానిలో ఈ రాగి పిండి వేస్తూ కలుపుకోవాలి.. సరిపడినంత ఉప్పు వేసుకుంటే సరిపోతుంది.అయితే.. రాగి జావను ఉదయం పూట ఖాళీ కడుపుతో తీసుకోవడం అత్యంత ఆరోగ్యకరం.. టిఫిన్ గా కూడా తీసుకోవచ్చు లేదా.. టిఫిన్ కంటే ముందు కూడా రాగి జావ తాగొచ్చు.. అంతేకాకుండా.. రాత్రి నిద్రకు ముందు కూడా దీనిని తీసుకోవచ్చు. కావాలంటే.. రాగి జావలో మజ్జిగ, పెరుగు కూడా కలుపుకుని తీసుకోవచ్చు.. దీనికి తోడు కొంచెం పచ్చి మిర్చి, ఉల్లి తురుము జోడించుకుంటే.. రుచి పెరుగుతుంది.. ఇలా తీసుకోవడం వల్ల ఎండలో వేడి చేయకుండా శరీరాన్ని చల్లగా ఉంచుతుంది.

## మొటిమల్ని తగ్గించే 'కలబంద' ప్యాక్!

చర్మానికి చల్లదనాన్ని అందించడమే కాదు.. ముఖంపై ఏర్పడిన మొటిమలు, మచ్చల్ని తగ్గించడంలోనూ కలబందను మించిన ఔషధం మరొకటి లేదని చెప్పచ్చు. అందుకే దీన్ని వివిధ రకాల సౌందర్య ఉత్పత్తుల తయారీలో ఉపయోగిస్తుంటారు. ఈ క్రమంలో కలబందతో పాటు ఇంట్లో లభించే కొన్ని



పదార్థాలను కలిపి ఫేస్‌ప్యాక్ ఎలా తయారు చేసుకోవాలో చూద్దాం రండి.. కలబంద గుజ్జు – మూడు టేబుల్‌స్పూన్లు, పసుపు – రెండు టేబుల్‌స్పూన్లు, రోజ్ వాటర్ – రెండు టేబుల్‌స్పూన్లు, శెనగపిండి – టేబుల్‌స్పూన్, కలబంద గుజ్జు, పసుపు, రోజ్‌వాటర్.. ఈ మూడింటినీ గ్రైండర్‌లో వేసి మిక్సీ పట్టుకోవాలి. ఆపై ఇందులో శెనగపిండి వేసి మరోసారి మిక్సీ పట్టుకోవాలి. అవసరమైతే ఇందులో ఇంకాస్త రోజ్‌వాటర్ లేదంటే శెనగపిండి వేసుకొని పేస్ట్‌లా చేసుకోవాలి. ఇప్పుడు ఈ మిశ్రమాన్ని ముఖానికి రాసుకొని.. 20 నిమిషాల పాటు ఉంచి.. ఆపై గోరువెచ్చటి నీళ్లతో శుభ్రం చేసుకోవాలి. ఇలా తరచూ చేయడం వల్ల మొటిమల సమస్యను ఇట్టే తగ్గించుకోవచ్చంటున్నారు నిపుణులు.

## కుదుళ్లకు మసాజ్.. ఎందుకంటే?!

గోరువెచ్చని నూనెతో కుదుళ్లకు నెమ్మదిగా మర్దన చేసుకుంటుంటే ఎంత హాయిగా ఉంటుందో కదూ! అయితే దీనివల్ల కేవలం కుదుళ్లకు రక్తప్రసరణ సక్రమంగా జరగడమే కాదు.. జుట్టు ఒత్తుగానూ పెరుగుతుందంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో మర్దన చేసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలేంటో తెలుసుకుందాం రండి..



కుదుళ్ల మర్దన కోసం జొజోబా లేదా బాదం నూనె ఉపయోగించడం మంచిదంటున్నారు నిపుణులు. దీనివల్ల కుదుళ్లకు రక్తప్రసరణ సాఫీగా జరగడమే కాకుండా కురులకు పోషణ కూడా లభిస్తుంది. ఇలా తరచూ మర్దన చేయడం వల్ల జుట్టు వేగంగా ఎదిగే అవకాశం ఉంటుందట. మర్దన చేసే క్రమంలో ఎక్కువ మొత్తంలో నూనెను ఉపయోగించకూడదు. ఎందుకంటే దీనివల్ల కుదుళ్లు, ముఖం జిడ్డుగా మారి.. ఇతర సమస్యలు కొని తెచ్చుకున్నట్లవుతుందంటున్నారు నిపుణులు. మర్దన చేసే క్రమంలో స్ట్రోక్స్ సరిగా ఇవ్వకపోతే తలనొప్పి వచ్చే అవకాశం ఉంటుందట. చేతివేళ్లతో మర్దన చేసుకుంటాం కాబట్టి వాటికి గోళ్లు లేకుండా జాగ్రత్తపడాలి. లేదంటే అవి కుదుళ్లకు గీసుకుపోయే అవకాశం ఉంటుంది. నూనెతో తరచూ మర్దన చేసుకోవడం వల్ల కురులకు సహజసిద్ధమైన మెరుపు వస్తుంది. అలాగే ఒత్తుగా కూడా పెరుగుతుందంటున్నారు నిపుణులు.

## పవర్‌ఫుల్ ఎనర్జీ కావాలంటే..

మన శరీరానికి పండ్లు ప్రకృతి ప్రసాదించిన వరాలు. ముఖ్యంగా రాత్రంతా ఖాళీ కడుపుతో ఉన్న శరీరానికి ఉదయాన్నే పండ్లు అందిస్తే ఆ రోజంతా ఉత్సాహంగా ఉంటుంది. అయితే అల్పాహారంలో జామపండు తీసుకోవాలా లేక అరటిపండు తీసుకోవాలా అన్నది చాలా మందిని వేధించే ప్రశ్న. జామపండు: జామపండును పోషకాల పవర్‌హౌస్ అని అంటారు. ఇందులో ఉండే విటమిన్ సి పరిమాణం నారింజ పండు కంటే దాదాపు నాలుగు రెట్లు ఎక్కువగా ఉంటుంది. కేవలం 100 గ్రాముల జామలో 228 మి.గ్రా విటమిన్ సి లభిస్తుంది. ఇది మన రోగనిరోధక శక్తిని పెంచడమే కాకుండా సీజనల్ వ్యాధులు, ఇన్ఫెక్షన్ల నుండి మనల్ని రక్షిస్తుంది. జామపండులో తక్కువ కేలరీలు, అధిక పీచు పదార్థం ఉండటం వల్ల, బరువు తగ్గాలనుకునే వారికి, మలబద్ధకం వంటి జీర్ణ సమస్యలతో బాధపడేవారికి ఇది ఒక అద్భుతమైన ఎంపిక. దీనిలోని తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు కూడా అదుపులో ఉంటాయి. అరటిపండు: అరటిపండు తక్షణ శక్తిని ఇచ్చే ఎనర్జీ బాంబ్ లాంటిది. ఉదయాన్నే వ్యాయామం లేదా జిమ్ చేసేవారికి ఇది దివ్యౌషధంలా



పని చేస్తుంది. అరటిపండులో ఉండే సహజ చక్కెరలు, కార్బోహైడ్రేట్లు శరీరానికి వేగంగా శక్తిని అందిస్తాయి. ఇందులో పుష్కలంగా ఉండే పొటాషియం రక్తపోటును నియంత్రించడంలో గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తుంది. అంతేకాదు ఇందులోని విటమిన్ బి6 మెదడు పనితీరును మెరుగుపరుస్తూ.. రోజంతా మన మూడ్‌ని ఉత్సాహంగా, ఒత్తిడి లేకుండా ఉంచడానికి దోహదపడుతుంది. ఏది ఎంచుకోవాలి? ఈ రెండింటిలో ఏది ఎంచుకోవాలి అంటే అది పూర్తిగా ఆరోగ్య లక్ష్యాలపై ఆధారపడి ఉంటుంది. ఒకవేళ రు షుగర్ లేదా బరువు తగ్గడం వంటి అంశాలపై దృష్టి పెట్టినట్లయితే జామపండు ఉత్తమమైనది. అలా కాకుండా రోజంతా శారీరక శ్రమ చేసేవారు లేదా తక్షణమే అలసట నుండి ఉపశమనం పొందాలనుకునే వారు అరటిపండును ఎంచుకోవడం మంచిది. వాస్తవానికి శరీరానికి అన్ని రకాల పోషకాలు అందాలంటే ఒకరోజు జామ, మరొకరోజు అరటిపండు మార్చి మార్చి తీసుకోవడం అత్యుత్తమమైన పద్ధతి. ఉదయం ఖాళీ కడుపుతో పండ్లు తీసుకునేటప్పుడు కొన్ని జాగ్రత్తలు తప్పనిసరి. పండ్లు మరీ పుల్లగా లేకుండా చూసుకోవాలి, లేదంటే ఎసిడిటీ సమస్య వచ్చే అవకాశం ఉంది. అలాగే డయాబెటిస్ ఉన్నవారు అరటిపండు తీసుకునేటప్పుడు పోషకాహార నిపుణుల సలహా తీసుకోవడం మంచిది. జీవనశైలికి, శరీర తత్వానికి తగ్గట్టుగా సరైన పండును ఎంచుకుని రోజును ఆరోగ్యంగా ప్రారంభించండి.

## ఉదయాన్నే ఇలా చేస్తున్నారా?

చర్మం ఆరోగ్యంగా ఉండాలి, మెరిసిపోవాలి అనే కదా ఏ అమ్మాయైనా కోరుకునేది? అది సాధ్యమవ్వాలంటే తగిన జాగ్రత్తలూ తీసుకోవాలి. ముఖ్యంగా ఉదయం కొన్నింటిపై దృష్టిపెట్టాలి. మీ డే రొటీన్‌లో అవి ఉన్నాయేమో చూసుకోండి మరి! ఉదయాన్నే చల్లని నీటితో ముఖాన్ని శుభ్రం చేసుకోండి. నీళ్లు కొంచెం ఎక్కువ చల్లగా ఉండేలా చూసుకోవడం తప్పనిసరి. ఇది చర్మకణాలకు ఆక్సిజన్ సరఫరా, రక్తప్రసరణ మెరుగ్గా జరిగేలా చేస్తుంది.లేచిన పావుగంటలోపు ఒక గ్లాసు గోరువెచ్చని నీటిని తాగండి. గంటలపాటు నిద్రలో గడిపేస్తాం. ఈ క్రమంలో శరీరం డీహైడ్రేషన్‌కి గురవుతుంది. నీళ్లు తాగితే తిరిగి హైడ్రేట్ అవ్వడమే కాదు, మలినాలూ బయటికి పోతాయి. నిమ్మకాయ, కాస్త ఉప్పు చేర్చుకుంటే కోల్పోయిన ఎలక్ట్రోలైట్లని తిరిగి పొందొచ్చు. ఇది చర్మాన్నీ తేమగా కనిపించేలానూ చేస్తుంది. 3-5 నిమిషాలు ముఖాన్ని మసాజ్ చేయండి. ఏదైనా నచ్చిన నూనె తీసుకుని, ముఖమంతా వృత్తాకారంలో మర్దనా చేసుకున్నా మంచిదే. మాయిశ్చరైజర్ తప్పక రాయండి. విటమిన్ సి ఉన్నవి వాడితే మేలు. ఇది చర్మాన్ని మెరిపించడమే కాదు, ఎండతోనూ పోరాడుతుంది. అలాగని సన్‌స్క్రీన్‌ని మాత్రం నిర్లక్ష్యం చేయొద్దు. చర్మ ఆరోగ్యమ్మీద వ్యాయామాలు చూపే ప్రభావమూ ఎక్కువే. కాబట్టి, అల్పాహారానికి ముందు 10-15 నిమిషాలు తప్పక వ్యాయామం చేయాలి. ఇదీ చర్మానికి ఆక్సిజన్, పోషకాలు అందేలా చూడగలదు. సెల్ రిపేరింగ్‌కీ సాయపడుతుంది. చెమట ద్వారా విషపదార్థాలు బయటకు వచ్చేలానూ చేస్తుంది. చర్మంలో కొలాజెన్ ఏర్పడటానికి అమైనో యాసిడ్లు ప్రధానం. అది అందాలంటే ప్రొటీన్ ఆధారిత ఆహారం అంటే గ్రీక్ యోగర్ట్, చేప, ప్రొటీన్ స్మూతీలు, గుడ్లు వంటివి ఎక్కువగా తీసుకోవాలి. ఈ జాగ్రత్తలు తీసుకుంటారుగా మరి.



## గ్లాస్ బార్లీ తీసుకుంటే శరీరంలో జరిగే మార్పు..

బార్లీ వాటర్ తాగడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి. డైలీ ఉదయాన్నే బార్లీ నీరు తాగడం వల్ల బరువు తగ్గుతుంది. ఇంకా శరీరంలోని వేడి తగ్గుతుంది.. అధిక కొలెస్ట్రాల్ తగ్గడంతోపాటు..బాడీ క్లీన్ అవుతుంది. బార్లీ తీసుకోవడం శరీరానికి చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. బార్లీ అనేది అనేక పోషకాలను కలిగి ఉన్న ధాన్యం. బార్లీని తరచుగా తీసుకోకపోయినా, ఎండాకాలంలో బార్లీ నీరు తాగడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి. బార్లీలో ఇనుము, భాస్వరం, మెగ్నీషియం, కాల్షియం, ఫోలేట్, నియాసిన్, విటమిన్లు, సోడియం, పొటాషియం, మాంగనీస్, ప్రోటీన్, శక్తి, రాగి, జింక్ మొదలైన పోషకాలు పుష్కలంగా ఉంటాయి. అందుకే.. దీనిని గరిబోళ్ల సంజీవని.. లేదా.. పానీయంగా పేర్కొంటారు. ఎందుకంటే ఇది తక్కువ ఖర్చుతో కూడిన, అత్యంత పోషకమైన ఆరోగ్య పానీయం. ఇది శరీరానికి చలువ చేయడంతోపాటు.. పలు అనారోగ్య సమస్యలకు నివారణిగా పనిచేస్తుంది.బార్లీ నీరు తాగడం వల్ల శరీరం నుండి విషాన్ని బయటకు పంపడంలో సహాయపడుతుంది. ఇది రుచికరంగా కూడా ఉంటుంది. ఇది పేగు ఆరోగ్యానికి మద్దతు ఇస్తుంది.. జీర్ణవ్యవస్థను మెరుగుపరుస్తుంది. బరువు తగ్గాలనుకునే వారు బార్లీ నీటిని తమ ఆహారంలో చేర్చుకోవచ్చు.బార్లీ నీరు తాగడంవల్ల శరీరంలో చెడు కొలెస్ట్రాల్ తగ్గి మంచి కొలెస్ట్రాల్ పెరుగుతుంది. కు కూడా అధిక కొలెస్ట్రాల్ స్థాయిలు ఉంటే, మీరు ఈ ఆరోగ్యకరమైన నీటిని క్రమం తప్పకుండా తాగవచ్చు. మహిళలు తరచుగా మూత్ర నాళాల ఇన్ఫెక్షన్లతో బాధపడుతుంటారు. బార్లీ నీరు తాగడం వల్ల ఇతర మూత్ర సమస్యలను నివారించవచ్చు. ఇది మూత్రపిండాల ఆరోగ్యానికి కూడా చాలా ఆరోగ్యకరమైన



పానీయం. బార్లీ నీరు తాగడం వల్ల మూత్రపిండాల సమస్యలు నివారిస్తుంది. ఇంకా మూత్రపిండాల్లో రాళ్ల ప్రమాదాన్ని తగ్గించవచ్చు. బార్లీ నీటిని ఎలా తయారు చేయాలి: కొంచెం బార్లీని లేదా మూడు నాలుగు స్పూన్ల బార్లీ పొడిని తీసుకొని ఒక పెద్ద గిన్నెలో వేసి దానిలో నీళ్లు పోసి.. 7-8 నిమిషాలు ఉడకబెట్టండి. మరిగిన తర్వాత గ్యాస్ ఆఫ్ చేయండి.. అనంతరం ఒక కప్పులోకి వడకట్టి, నిమ్మరసం వేసుకుని తాగండి.. ఇంకా.. వేడిగా ఉన్నప్పుడు కూడా డీటాక్స్ నీటిని టీ లాగా నెమ్మదిగా తాగవచ్చు.

## బెండకాయ నీరు తాగితే ఆశ్చర్యపోయే ప్రయోజనాలు!

ఈ వేసవి కాలంలో బెండకాయ విరివిగా లభిస్తుంది. పిల్లలు, పెద్దలు అందరూ ఈ బెండకాయను ఇష్టపడతారు. కానీ, బెండకాయ నీరు కూడా తాగొచ్చని కు తెలుసా..? అవును, 4-5 బెండకాయలను చిన్న ముక్కలుగా కోసి రాత్రిపూట ఒక గ్లాసు నీటిలో నానబెట్టి, మరుసటి రోజు ఉదయం ఈ నీటిని తాగడం వల్ల



ఎలాంటి ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయో కు తెలుసా? విటమిన్ ఎ, సి, ఇతర యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్న బెండకాయ నీళ్లు తాగడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఫైబర్ అధికంగా ఉండే ఓక్రా వాటర్‌ను ఉదయం ఖాళీ కడుపుతో తాగడం వల్ల రక్తంలో చక్కెర స్థాయి అదుపులో ఉంటుంది. తక్కువ కేలరీలు, అధిక ఫైబర్ కలిగిన లేడీఫింగర్ వాటర్ ఉదయం ఖాళీ కడుపుతో తాగడం వల్ల ఆకలి తగ్గుతుంది. దీంతో వేగంగా బరువు తగ్గుతారు.బెండకాయలో సల్యూబుల్ ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది శరీరంలో గ్లూకోజ్ ఆకర్షణను తగ్గించి, రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. బెండకాయ నీటిని ప్రతిరోజూ తాగడం ద్వారా రక్తంలో చక్కెర స్థాయిలను స్థిరంగా ఉంచుకోవచ్చు. బెండకాయలో ఉండే రసాయనం పొట్టలోని ఆమ్లాలను తటస్థం చేయడంలో సహాయపడుతుంది, తద్వారా గ్యాస్, అజీర్ణం, కడుపు సమస్యలను నివారించవచ్చు. ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్న ఓక్రా వాటర్ తాగడం వల్ల చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది. బెండకాయ నీరు గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. విటమిన్ కె, కాల్షియం సమృద్ధిగా ఉండే ఓక్రా వాటర్ బోలు ఎముకల వ్యాధి ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఎముకలను బలపరుస్తుంది. ఓక్రా వాటర్ తాగడం వల్ల కంటి చూపు కూడా మెరుగుపడుతుంది. విటమిన్ సి, ఇతర యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్న లేడీఫింగర్ వాటర్ చర్మానికి కూడా మేలు చేస్తుంది. బెండకాయలో కరిగే, కరగని ఫైబర్ రెండూ ఉంటాయి. ఇది రక్తంలో చక్కెరను నిర్వహించడానికి సహాయపడుతుంది. ఉదయాన్నే దీన్ని తాగడం వల్ల కార్బోహైడ్రేట్ శోషణ కూడా నెమ్మదిస్తుంది. ఇది ఆరోగ్యానికి మేలు చేస్తుంది.

## నందన్ రెడ్డి స్విగ్గీకి గుడ్‌బై

ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేస్తే, ఆహారాన్ని సరఫరా చేసే ప్లాట్‌ఫామ్ స్విగ్గీ నుంచి మరో సహవ్యవస్థాపకుడు నందన్ రెడ్డి వైదొలగనున్నారు. శ్రీహర్ష మాజేటి, రాహుల్ జైమిని, నందన్ రెడ్డి కలిసి 2014 ఆగస్టులో ఈ సంస్థను స్థాపించారు. 2020లో కంపెనీ నుంచి రాహుల్ జైమిని తప్పుకుని, పెస్టో టెక్ పేరుతో సొంతంగా కంపెనీని ప్రారంభించారు. ఇప్పుడు నందన్ కూడా అదేబాట పట్టారు. సొంతంగా కొత్త అంకుర సంస్థను అభివృద్ధి చేయడంపైనే ఎక్కువ సమయం వెచ్చించాలని నందన్‌రరెడ్డి అనుకుంటున్నారని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. స్విగ్గీ గ్రూపు సీఈఓగా మరో సహవ్యవస్థాపకుడు శ్రీహర్ష మాజేటి వ్యవహరిస్తున్నారు. స్విగ్గీలో 20 శాతానికి పైగా వాటాతో అతిపెద్ద వాటాదారుగా ఉన్న ప్రోసస్ తన నామినీ డైరెక్టర్లలో మార్పులు చేయనుంది. రోజర్ క్లార్క్ రబాలియస్ నామినీ డైరెక్టరు పదవికి రాజీనామా చేస్తారు. ఈ స్థానాన్ని రెనాన్ డె కాస్ట్రో ఆల్వెస్ పింటో భర్తీ చేస్తారు. బోర్డు సభ్యుల సంఖ్యను పెంచే యోచనలోనూ స్విగ్గీ ఉంది. 2015లో స్విగ్గీలో చేరి, వైస్‌ప్రెసిడెంట్‌గా కార్యకలాపాలు నిర్వహించిన ఫణి కిషన్ అద్దేపల్లిని 2021 జులైలో కంపెనీ సహవ్యవస్థాపకుడిగా పదోన్నతి కల్పించారు. ప్రస్తుతం చీఫ్ గ్రోత్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తున్న ఫణి కిషన్, ముఖ్య ఆర్థిక అధికారి రాహుల్ బోథ్రా స్విగ్గీ బోర్డులో చేరనున్నారు. ఈ నిర్ణయానికి వాటాదార్లు అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది.




### యూపీఐ లావాదేవీల్లో ఆర్బీఐ కొత్త రూల్స్?

## గంట తర్వాతే 10వేలు జమ




యూపీఐ సేవలు.. భారతీయ ఆర్థిక రంగ ముఖచిత్రాన్నే మార్చేశాయి. రోజూ కోట్లాది లావాదేవీలు అలవోకగా జరిగిపోతున్నాయిప్పుడు. అయితే అంతే స్థాయిలో ఆన్‌లైన్ మోసాలూ పెరిగిపోతున్నాయి. అక్రమార్కుల దెబ్బకు అమాయకులు పెద్ద ఎత్తున నష్టపోతున్నదీ చూస్తూనే ఉన్నాం. నిజానికి బ్యాంక్ ఖాతాదారులు ఈ కేటుగాళ్ల బారినపడకుండా ఆర్బీఐ ఎప్పటికప్పుడు అనేక రకాల నిర్ణయాలను, చర్యలను తీసుకుంటున్నది. ఈ క్రమంలోనే ఓ కొత్త ప్రతిపాదనను చేసినట్టు సమాచారం. రూ.10,000, ఆపై నగదు మొత్తాలను గూగుల్‌పే, ఫోన్‌పే తదితర యూపీఐ వేదికల ద్వారా పంపినప్పుడు.. అది రిసీవర్ ఖాతాలో క్రెడిట్ అవ్వాలంటే గంట సమయం పట్టేలా రూల్స్‌ను మార్చాలని చూస్తున్నది. కానీ సెండర్ అకౌంట్ నుంచి వెంటనే సదరు మొత్తం డెబిట్ అయినట్టు చూపిస్తుంది. అయినప్పటికీ ఒకవేళ ఏవైనా పొరపాట్లు జరిగినా, ఒకరికి బదులుగా మరొకరికి పంపించామనుకున్నా, పంపినవారు సదరు లావాదేవీని వద్దని భావించినా లేదా మోసపోయామని గుర్తించినా. . ఆ సొమ్ము బ్యాంకర్ల సహకారంతో తిరిగి వారి ఖాతాలోకే వచ్చేలా నిబంధనల్ని మార్చాలని ఆర్బీఐ చూస్తున్నదని చెప్తున్నారు. మరోవైపు బ్యాంకులు సైతం ఈ గంట సమయంలో క్రాస్ చెక్ చేసుకోవడానికి సమయం ఉంటుందని, లావాదేవీ అసాధారణంగా కనిపించినా, ఓ కొత్త ఖాతాలోకి భారీ మొత్తం వెళ్తున్నా.. ఖాతాదారులను అలర్ట్ చేయవచ్చన్న అభిప్రాయాలూ వ్యక్తమవుతున్నాయి.




### అదానీ బిడ్‌పై

## వేదాంత సవాల్

జైప్రకాష్ అసోసియేట్స్ లిమిటెడ్ (జెఏఎల్) దివాలా పరిష్కార ప్రక్రియ (ఐబిసి)లో భాగంగా అదానీ ఎంటర్‌ప్రైజెస్ బిడ్‌ను ఎంపిక చేయడాన్ని మైనింగ్ దిగ్గజం వేదాంత గ్రూప్ ఎన్‌సిఎల్‌టిలో సవాలు చేసింది. అదానీ సమర్పించిన రూ.14,535 కోట్ల బిడ్ కంటే తమ ఆఫర్ స్థూల విలువ రూ.3,400 కోట్లు, నికర విలువలో రూ.500 కోట్లు ఎక్కువగా ఉన్నప్పటికీ రుణదాతల కమిటీ తక్కువ ధరకే మొగ్గు చూపడంపై వేదాంత తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. రుణదాతలు అనుసరించిన మూల్యాంకన పద్ధతులు పారదర్శకంగా లేవని.. ఆస్తుల విలువను గరిష్టం చేయాలనే దివాలా చట్టం ప్రధాన లక్ష్యాన్ని పక్కన పెట్టి అసంబద్ధమైన స్కోరింగ్ పద్ధతులతో తమను తప్పించారని వేదాంత తరపు న్యాయవాది వాదించారు. మరోవైపు రుణదాతల కమిటీ తమ నిర్ణయాన్ని సమర్థించుకుంటూ మొత్తం ప్రక్రియ ఐబిసి నిబంధనల ప్రకారమే జరిగిందని స్పష్టం చేసింది. కేవలం అత్యధిక ధర కోట్ చేసినంత మాత్రాన బిడ్ దక్కదని.. నగదు లభ్యత, ప్రాజెక్టును అమలు చేయగల సామర్థ్యం వంటి అనేక అంశాలను పరిగణనలోకి తీసుకున్నామని తెలిపింది. దాదాపు రూ.57,185 కోట్ల అప్పుల్లో ఉన్న జెఏఎల్ గ్రూప్‌నకు నోయిడాలో విలువైన రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులు, సిమెంట్ ప్లాంట్లు, హోటళ్లు ఉన్నాయి..

రుణదాతలు అనుసరించిన మూల్యాంకన పద్ధతులు పారదర్శకంగా లేవని.. ఆస్తుల విలువను గరిష్టం చేయాలనే దివాలా చట్టం ప్రధాన లక్ష్యాన్ని పక్కన పెట్టి అసంబద్ధమైన స్కోరింగ్ పద్ధతులతో తమను తప్పించారని వేదాంత తరపు న్యాయవాది వాదించారు.

ప్రస్తుతం ఈ వ్యవహారం ఎన్‌సిఎల్‌టిలో విచారణలో ఉండగా తుది తీర్పు వచ్చే వరకు ఈ కొనుగోలు ప్రక్రియ ట్రిబ్యునల్ పరిధిలోనే కొనసాగుతుందని ఆ వర్గాలు తెలిపాయి.

## క్లీన్ ఎనర్జీలో విస్తృతావకాశాలు




ప్రముఖ పారిశ్రామికవేత్తల అసోసియేషన్ ఫిక్కీ నెట్ జీరో ఫోరం సదస్సులో భారత క్లీన్ ఎనర్జీ లక్ష్యాలపై విస్తృతంగా చర్చించారు. శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన భారత్ 150 గిగావాట్ సౌర విద్యుత్ సామర్థ్యంతో ప్రపంచంలోనే మూడో స్థానానికి చేరిందని, రాబోయే నాలుగేండ్లలో ఈ రంగం 51 లక్షల గ్రీన్ జాబ్స్‌ను సృష్టిస్తుందని కేంద్ర పునరుత్పాదక శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి తెలిపారు. ఈ రంగంలో విస్తృతావకాశాలు ఉన్నాయన్నారు. మొత్తం విద్యుత్ సామర్థ్యంలో సుమారు 5055 శాతం పునరుత్పాదక శక్తి వనరుల నుంచే వస్తోందన్నారు. ఫిక్కీ నెట్ జీరో ఫోరం పెట్టుబడులు ఆకర్షించడంలో, భాగస్వామ్యాలను పెంపొందించ డంలో కీలక పాత్ర పోషిస్తుందని ఆయన అన్నారు. సోలార్ వాహనాల వల్ల ప్రయాణ ఖర్చు కిలో టరుకు కేవలం 60 పైసలకు తగ్గుతుందని తెలంగాణ ఇంధన శాఖ కార్యదర్శి నవీన్ మిట్టల్ వివరించారు. పర్యావరణ హిత ఇంధన వనరుల దిశగా భారత్ వేగంగా అడుగులు వేస్తోందని ఈ సదస్సు స్పష్టం చేసింది.

## ఓలా ఎలక్ట్రిక్ షేర్ల నెలలోనే 71% లాభం




ఒకప్పుడు ఎలక్ట్రిక్ టూవీలర్ మార్కెట్‌లో రారాజుగా వెలిగి, ఆ తర్వాత వరుస ఎదురుదెబ్బలతో కుదేలైన ఓలా ఎలక్ట్రిక్ మళ్ళీ ఫామ్‌లోకి వచ్చింది. గత ఆరు నెలలుగా నష్టాల ఊబిలో కూరుకుపోయిన ఈ షేరు, ఇప్పుడు రాకెట్‌లా దూసుకెళ్తోంది. కేవలం ఈ ఏప్రిల్ నెలలోనే 71 శాతం లాభపడి ఇన్వెస్టర్లకు బంపర్ ప్రాఫిట్స్ అందిస్తోంది. గత ఏడాది కాలంగా ఓలా ఎలక్ట్రిక్ షేరు భారీ ఒడిదుడుకులను ఎదుర్కొంది. కస్టమర్ల అసంతృప్తి, సర్వీస్ సమస్యలు, పోటీ పెరగడం వంటి కారణాలతో షేరు ధర భారీగా పడిపోయి ఒకానొక దశలో రూ. 21.25 (52 వారాల కనిష్ఠం) వద్దకు చేరుకుంది. అయితే, ఈ ఏప్రిల్ నెలలో సీన్ రివర్స్ అయింది. ఇవాళ ఒక్కరోజే 12.55 శాతం జంప్ చేసి రూ. 40.90 వద్ద ముగిసింది. మార్చి నెలలో కంపెనీ అమ్మకాలు ఊహించని రీతిలో పెరగడం ఇన్వెస్టర్లలో నమ్మకాన్ని పెంచింది. కస్టమర్ల ఫిర్యాదులను సీరియస్‌గా తీసుకున్న కంపెనీ, సర్వీస్ సెంటర్ల నాణ్యతను పెంచడంపై దృష్టిసారించింది. బెంగళూరు కేంద్రంగా నడుస్తున్న ఫ్యూచర్ ఫ్యాక్టరీ ద్వారా సొంతంగా బ్యాటరీ ప్యాక్స్ తయారు చేయడం కంపెనీకి పెద్ద ప్లస్ పాయింట్‌గా మారింది. ఈవీ రంగంలో ఇతర కంపెనీల కంటే ముందుండేలా టెక్నాలజీపై ఓలా పెడుతున్న పెట్టుబడులు ఫలితాలను ఇస్తున్నాయి. ఓలా ఎలక్ట్రిక్ ప్రస్తుతం సుమారు రూ. 18,030 కోట్ల మార్కెట్ విలువను కలిగి ఉంది. గత వారం రోజుల్లోనే 35 శాతం మేర లాభపడినప్పటికీ, గత రెండేళ్ల కాలంలో ఈ స్టాక్ ఇంకా 57 శాతం నష్టంలోనే ఉంది. ప్రస్తుత ర్యాలీ ఇలాగే కొనసాగితే త్వరలోనే తన 52 వారాల గరిష్ఠ ధర అయిన రూ. 71.25 దిశగా అడుగులు వేసే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## 2.22 లక్షల పన్ను వివాదాల పరిష్కారం




పన్ను చెల్లింపుదారుల వివాదాలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు ఆదాయపు పన్ను విభాగం వేగంగా అడుగులు వేస్తోంది. గత ఆర్థిక సంవత్సరంలో 2,22,540 అప్పీళ్లను పరిష్కరించినట్లు కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) పేర్కొంది. 202425లో పరిష్కరించిన వివాదాలతో పోలిస్తే, ఈ సంఖ్య 29% అధికమని సీబీడీటీ ఛైర్మన్ రవి అగర్వాల్ తెలిపారు. ఆదాయపు పన్ను సిబ్బందికి ఆయన రాసిన లేఖలో గత ఆర్థిక సంవత్సరంలో సాధించిన సమష్టి విజయాలను కొనియాడారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (202627) లోనూ పారదర్శక సమర్థ పన్నుల వ్యవస్థను అందించడమే లక్ష్యంగా పనిచేయాలని అధికారులకు సూచించారు. పన్ను ఎగవేతలకు అడ్డుకట్ట వేసేందుకు గణాంకాల విశ్లేషణ, నిఘా ఆధారిత విధానాలను పటిష్టం చేసినట్లు వివరించారు. తప్పుడు మినహాయింపుల క్లెయిములు, వ్యాపార ఆదాయాలను తగ్గించి చూపించడం వంటివి అరికట్టేందుకు, దేశవ్యాప్తంగా అంశాల ఆధారంగా దర్యాప్తులు చేపట్టినట్లు వివరించారు. డిజిటల్ రికార్డుల్లోకి స్వచ్ఛంద సంస్థలు: ధార్మిక సంస్థలు, మినహాయింపుల విభాగం కింద గత ఆర్థిక సంవత్సరంలో 1.56 లక్షల ట్రస్టులకు రిజిస్ట్రేషన్లు, పునరుద్ధరణలు కల్పించినట్లు సీబీడీటీ ఛైర్మన్ తెలిపారు. కాగితాలకే పరిమితమైన ఈ సంస్థల రికార్డులను ఐటీ శాఖ డిజిటల్ రూపంలోకి మార్చింది. 2026 ఐటీ విభాగానికి ఎంతో కీలకమని రవి అగర్వాల్ స్పష్టం చేశారు. నూతన ఆదాయపు పన్ను చట్టం2025 అమల్లోకి రావడమే ఇందుకు కారణమన్నారు.






## వైశాలి 'క్యాండిడేట్స్' సాధిస్తుందా?

వైశాలి పాఫోస్ (సైప్రస్): క్యాండిడేట్స్ చెస్ టోర్నీలో ప్రజ్ఞానంద ఫేవరెట్‌గా బరిలో దిగాడు. కానీ అతడు విజేతగా నిలిచే అవకాశాలు దాదాపుగా లేనట్లే. కానీ మహిళల విభాగంలో అతడి సోదరి వైశాలి రమేశ్ టైటిల్‌కు గట్టి పోటీదారుగా నిలిచింది. అంచనాలు లేకుండా బరిలో దిగిన ఆమె.. దూకుడైన ఆటతీరుతో ఆకట్టుకుంటోంది. 10 రౌండ్లు అయ్యేసరికి మూడు విజయాలు, ఆరు డ్రాలతో.. 6 పాయింట్లు సాధించి అగ్రస్థానంలో ఉంది. ఒక్క గేమ్‌లో మాత్రమే ఓడింది. మరో నాలుగు రౌండ్లు మిగిలిన ఉన్న ఈ టోర్నీలో జోరు కొనసాగించి టైటిల్ గెలవాలని ఆమె చూస్తోంది. వైశాలి తర్వాతి గేమ్‌ల్లో వరుసగా అలెగ్జాండ్రా (రష్యా), జు జినర్ (చైనా), టాన్ జోంగ్‌యి (చైనా), కేథరీనా (రష్యా)లతో తలపడనుంది. జు జినర్ (5.5 పాయింట్లు), అనా ముజ్‌చుక్ (5.5, ఉక్రెయిన్)ల నుంచి ఆమెకు గట్టిపోటీ ఎదురవుతోంది. అలెగ్జాండ్రా, బిబిసారా (కజకిస్థాన్), కేథరీనాలు తలో 5 పాయింట్లతో రేసులోనే ఉన్నారు.

### వైభవ్ సూర్య వంశీకి

## విరాట్ కోహ్లీ స్పెషల్ గిఫ్ట్!




రాజస్థాన్ రాయల్స్ కింగ్ వైభవ్ సూర్య వంశీ రికార్డుల ద రికార్డులు సృష్టిస్తున్నాడు. తాజాగా ఆర్సీబీతో జరిగిన మ్యాచ్‌లో చెలరేగిపోయాడు. స్టార్ బౌలర్లకు చుక్కలు చూయించాడు. కేవలం 26 బంతుల్లోనే 8 ఫోర్లు, 7 సిక్సర్లతో 78 పరుగులు చేసి 300 స్ట్రైక్ రేట్‌తో ఆర్సీబీ బౌలింగ్ విభాగాన్ని చిన్నాభిన్నం చేశాడు. వైభవ్ బ్యాటింగ్‌పై ప్రశంసల వర్షం కురుస్తోంది. ఈ సందర్భంగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మాజీ కెప్టెన్, కింగ్ కోహ్లీ ఈ కుర్రాడి నైపుణ్యాన్ని కొనియాడుతూ క్రేజీ గిఫ్ట్ ఇచ్చాడు. మైదానంలో వైభవ్ బ్యాటింగ్ పవర్‌ను స్వయంగా చూసిన కోహ్లీ, మ్యాచ్ ముగిసిన తర్వాత అతనికి ఒక మధుర జ్ఞాపకాన్ని అందించాడు. వైభవ్ అభ్యర్థన మేరకు కోహ్లీ రాజస్థాన్ రాయల్స్ క్యాప్‌పై ఆటోగ్రాఫ్ ఇచ్చాడు. అంతేకాకుండా 'డియర్ వైభవ్, వెల్ డన్' అంటూ ఒక ప్రత్యేక సందేశాన్ని కూడా ఆ క్యాప్‌పై రాశాడు. దీనికి సంబంధించిన ఫోటోలు ప్రస్తుతం సోషల్ డియాలో వైరల్ అవుతున్నాయి. ఇక.. ఈ అద్భుత ఇన్నింగ్స్‌తో వైభవ్ కేవలం 4 మ్యాచ్‌ల్లోనే 200 పరుగులు పూర్తి చేసి, ప్రస్తుత సీజన్‌లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా 'ఆరెంజ్ క్యాప్' దక్కించుకోవడం విశేషం. 203 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో వైభవ్ (78), ధ్రువ్ జురెల్ (నాటౌట్ 81) మెరుపులు రాజస్థాన్‌ను సునాయాసంగా గెలిపించాయి. మరోవైపు రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ రియాన్ పరాగ్ తన యువ ఓపెనర్ గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నాడు. 'వైభవ్‌కు బయట తిరగడం, రకరకాల వంటకాలు తినడం అంటే చాలా ఇష్టం. అతను ఇలాగే బ్యాటింగ్ చేస్తూ ఉంటే, అతనికి కావాల్సినవన్నీ మేము సమకూరుస్తాం. అతను ఇంకా చిన్న పిల్లాడే, అప్పుడప్పుడు అల్లరి పనులు చేస్తూ అందరినీ నవ్విస్తుంటాడు. అతనికి బ్యాటింగ్ అంటే పిచ్చి, అందుకే అతనికి సాధ్యమైనంత ఎక్కువ సమయం క్రీజులో గడిపేలా మేము ప్రోత్సహిస్తున్నాం' అని పరాగ్ సరదాగా పేర్కొన్నాడు.

## లంక బోర్డుకు తుషార క్షమాపణలు

ఐపీఎల్‌లో ఆడేందుకు తనకు నిరభ్యంతర పత్రం (ఎన్వోసీ) ఇవ్వనందుకు శ్రీలంక క్రికెట్ (ఎస్ఎల్‌సీ)పై కోర్టుకెక్కిన ఆ దేశ ఫాస్ట్‌బౌలర్ నువాన్ తుషార..వెనక్కి తగ్గాడు. కేసును వాపస్ తీసుకోవడమే కాక, బోర్డుకు క్షమాపణ కూడా చెప్పాడు. బోర్డుకు ఇబ్బంది కలిగించి ఉంటే మన్నించాలంటూ అతను ఈమెయిల్ పంపాడు. తన పట్ల పారదర్శకతతో వ్యవహరించలేదని, తనకు న్యాయం జరగాలన్నదే అభిమతమని తుషార పేర్కొన్నాడు. ఈసారి తమ ఆటగాళ్ల ఫిట్‌నెస్ పరీక్షలు పాసయ్యాకే ఐపీఎల్‌కు అనుమతించేలా శ్రీలంక బోర్డు షరతు పెట్టింది. అయితే తుషార ఫిట్‌నెస్ నిరూపించుకోకపోవడంతో అతడికి ఎన్వోసీ ఇవ్వలేదు. 31 ఏళ్ల తుషార 2024లో ముంబయి ఇండియన్స్ తరఫున ఐపీఎల్ అరంగేట్రం చేశాడు. గత సీజన్ నుంచి అతను రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు.

## 15 ఏళ్ల కుర్రాడు ఇలా చితక్కొడుతాడనుకోలేదు




ఐపీఎల్ 2026లో రాజస్థాన్ రాయల్స్ యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ మరోసారి తన అద్భుత బ్యాటింగ్‌తో అందరి దృష్టిని ఆకర్షించాడు. శుక్రవారం బర్సపారా క్రికెట్ స్టేడియంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో జరిగిన మ్యాచ్‌లో కేవలం 26 బంతుల్లో 78 పరుగులు చేసి ప్రత్యర్థి బౌలర్లను చితక బాదాడు. 8 ఫోర్లు, 7 సిక్సర్లతో 300 స్ట్రైక్ రేట్‌తో ఆడిన ఈ ఇన్నింగ్స్ మ్యాచ్ దిశనే మార్చేసింది. వైభవ్ దూకుడుతో రాజస్థాన్ మరో రెండు ఓవర్లు ఉండగానే 200+ లక్ష్యాన్ని ఛేదించింది. ఈ ఇన్నింగ్స్‌తో వైభవ్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్నాడు.

మ్యాచ్ అనంతరం జరిగిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో ఆర్సీబీ సీనియర్ పేసర్ భువనేశ్వర్ కుమార్ వైభవ్ సూర్యవంశీ ప్రదర్శనను కొనియాడాడు. పవర్‌ప్లేలో భువీ రెండు ఓవర్లలో 26 పరుగులు ఇచ్చాడు. తొలి ఓవర్‌లోనే రెండు ఫోర్లు బాదిన వైభవ్.. ఐదో ఓవర్‌లో వరుసగా సిక్సులు, ఫోర్లతో 17 పరుగులు సాధించి కేవలం 15 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. ఈ సీజన్‌లో భువనేశ్వర్ మాత్రమే కాదు.. జస్ప్రీత్ బుమ్రా, జోష్ హేజిల్‌వుడ్ లాంటి టాప్ బౌలర్లటటను కూడా చితకొట్టాడు. ముంబైపై మ్యాచ్‌లో బుమ్రా బౌలింగ్‌లో 5 బంతుల్లో 13 పరుగులు చేయగా.. అందులో రెండు సిక్సులు ఉన్నాయి. హేజిల్‌వుడ్ బౌలింగ్‌లో ఒకే ఓవర్‌లో 19 పరుగులు సాధించి తన దూకుడును చాటుకున్నాడు. 'ఇది టీ20 ఫార్మాట్. వైభవ్ సూర్యవంశీ చిన్నవాడే అయినా అద్భుతంగా ఆడుతున్నాడు. చాలా పరిణతి చూపించాడు. వైభవ్ మా బౌలింగ్‌లో ఇలా చితక్కొడుతున్నాడని అనుకోలేదు. 15 ఏళ్ల వయసులో ఇలా ఆడటం గొప్ప విషయం. ఇక్కడ ఎవరినీ తక్కువగా అంచనా వేయం. మా ప్లాన్‌లను సరిగ్గా అమలు చేయలేకపోయాం. టీ20లో గెలుపోటములు భాగమే, పెద్దగా ఆందోళన అవసరం లేదు. విజయం కోసం మేము మా వంతు ప్రయత్నం చేశాం. ఫాస్ట్ బౌలర్లు విభిన్నంగా బౌలింగ్ చేశారు. కానీ వైభవ్ మంచి షాట్లు ఆడాడు. పవర్‌ప్లేలో స్పిన్నర్లతో బౌలింగ్ చేయించడం కష్టం. మాకు ఒకే లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ ఉండడంతో ఆప్షన్లు ఎక్కువగా లేవు. అందుకే మేము చేయగలిగింది చేశాం' అని వైభవ్ సూర్యవంశీ చెప్పాడు. వైభవ్ బ్యాటింగ్ స్టైల్‌పై భువీ ప్రశంసలు కురిపించాడు. 'వైభవ్ సూర్యవంశీ బ్యాటింగ్‌ను తక్కువ చేయడానికి లేదు. అతడు సరైన క్రికెట్ షాట్లు ఆడుతున్నాడు. 15 ఏళ్ల వయసులో ఇంత మెచ్యూరిటీ చాలా అరుదు. రాజస్థాన్ విజయంలో అతడికే పూర్తి క్రెడిట్ ఇవ్వాలి' అని కొనియాడాడు. వైభవ్ ఇన్నింగ్స్ 9వ ఓవర్‌లో ముగిసింది. కృనాల్ పాండ్య బౌలింగ్‌లో లాంగ్ ఆన్ వైపు షాట్ ఆడగా.. విరాట్ కోహ్లీ అద్భుత క్యాచ్ పట్టాడు. అవుట్ అయ్యి తిరిగి వెళ్తుండగా స్టేడియంలో ప్రేక్షకులు, సహచర ఆటగాళ్లు నిలబడి అభినందనలు తెలియజేయడం అతని ఇన్నింగ్స్ ఎంత విలువైందో అర్థం చేసుకోవచ్చు. మొత్తానికి వైభవ్ తన ప్రతిభతోనే కాదు, మెచ్యూరిటీతో కూడా క్రికెట్ ప్రపంచాన్ని ఆకట్టుకుంటున్నాడు.

## ఆదుకున్న పాటిధర్, వెంకటేశ్ అయ్యర్



రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) కెప్టెన్ రజత్ పాటిదార్ (63) అర్ధ శతకానికి తోడు చివర్లో వెంకటేశ్ అయ్యర్ మెరుపులు మెరిపించారు. దీంతో తొలిగా బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి 201 పరుగుల భారీస్కోర్ చేసింది. ఓవైపు వికెట్లు పడుతున్నా అటాకింగ్ గేమ్‌తో విరుచుకుపడిన పాటిదార్ భారీ స్కోర్‌కు బాటు వేశాడు. విరాట్ కోహ్లీ (32), రొమారియో షెపర్డ్ (22), ఇంప్యాక్ట్ సబ్ వెంకటేశ్ అయ్యర్ (29 నాటౌట్) చివరి ఓవర్లో 4, 6, 6 బాదడంతో ఆర్సీబీ 201 పరుగులు చేసింది. వర్షం కారణంగా ఆలస్యంగా ప్రారంభమైన మ్యాచ్‌లో ఆర్సీబీకి శుభారంభం దక్కలేదు. ఇన్నింగ్స్ తొలి ఓవర్లోనే ఫిలిప్ సాల్ట్ (0)ను జోఫ్రా ఆర్చర్ వెనక్కి పంపాడు. బౌండరీలతో చెలరేగిన దేవ్‌దత్ పడిక్కల్ (14)ను హిట్‌మైర్ డైవింగ్ క్యాచ్‌తో పెవిలియన్ పంపగా.. రవి బిష్ణోరు ఓవర్లో షాట్‌కు యత్నించిన విరాట్ కోహ్లీ (32) క్లీన్‌బౌల్డయ్యాడు. దీంతో పవర్ ప్లే 6ఓవర్లలో బెంగళూరు 58 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయింది. ఆ దశలో కెప్టెన్ రజత్ పాటిదార్ (63), కృనాల్ పాండ్యా (1)తో భాగస్వామ్యం నిర్మించాలనుకున్న దశలో కనాల్ పాండ్యాను బిష్ణోరు డగౌట్ చేర్చాడు. అతడి ఓవర్లో బిగ్ షాట్ ఆడబోయి హిట్‌మైర్‌కు దొరికిపోయాడు. బిగ్ హిట్టర్ టిమ్ డేవిడ్ కూడా నేరుగా హిట్‌మైర్ చేతుల్లో చిక్కి ఔటవ్వగా.. బిష్ణోరు ఓవర్లో సిక్సర్‌తో రొమారియో షెపర్డ్ (22) సిక్సర్‌తో బెంగళూరు స్కోర్ వంద దాటింది. బౌండరీలతో ప్రమాదకరంగా మారిన రొమారియో షెపర్డ్ (22)ను జడేజా బోల్తా కొట్టించగా ఆర్సీబీ ఏడో వికెట్ పడింది. అర్ధ శతకంతో రాణించిన పాటిదార్‌ను సందీప్ శర్మ ఔట్ చేశాక ఆర్సీబీ స్కోర్ వేగం మందగించింది. సందీప్ శర్మ వేసిన 20వ ఓవర్లో ఇంప్యాక్ట్ సబ్ వెంకటేశ్ అయ్యర్ (29 నాటౌట్) వరసగా 4, 6. 6 బాదడంతో బెంగళూరు భారీస్కోర్ చేసింది. రాజస్తాన్ రాయల్స్ బ్యాటర్లు బ్రిజేశ్ శర్మ, ఆర్చర్, బిష్ణరుకు రెండేసి, సందీప్ శర్మ, జడేజాకు ఒక్కో వికెట్ దక్కాయి. భారీ ఛేదనలో భాగంగా రాజస్తాన్ రాయల్స్ జట్టు పవర్‌ప్లే 6ఓవర్లు ముగిసేసరికి వికెట్ నష్టానికి 97పరుగులు చేసింది. ఇక 15ఏళ్ల యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీ 15బంతుల్లోనే అర్ధ సెంచరీ కొట్టి భారీ లక్ష్యాన్ని మరింత కుదించాడు.



## సెస్‌కు ఆయుష్

## క్వార్టర్స్‌లో జొనాథన్ క్రిస్టీకి షాక్

బ్యాడ్మింటన్ ఆసియా చాంపియన్‌షిప్స్‌లో యువ షట్లర్ ఆయుష్ శెట్టి సంచలనాలు కొనసాగుతున్నాయి. అంచనాలే లేకుండా బరిలోకి దిగి తనకంటే మెరుగైన ర్యాంకర్లకు షాకులిస్తున్న ఈ మంగళూరు కుర్రాడు.. శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్స్‌లోనూ మరో టాప్‌సీడ్ షట్లర్‌ను ఇంటిబాట పట్టించాడు. క్వార్టర్స్ పోరులో ఆయుష్.. 2321, 2117తో నాలుగో సీడ్ జొనాథన్ క్రిస్టీ (ఇండోనేషియా)ని చిత్తు చేసి సెస్ చేరాడు. తన కెరీర్‌లో తొలిసారి క్రిస్టీతో ఆడిన ఆయుష్.. ప్రత్యర్థిపై రెండు గేమ్స్‌లోనూ సంపూర్ణ ఆధిపత్యం కనబరిచి విజయాన్ని సొంతం చేసుకున్నాడు. పదునైన స్మాష్‌లకు తోడు పటిష్టమైన డిఫెన్స్‌తో ఆకట్టుకున్నాడు. తొలి గేమ్ ఆరంభం నుంచే 53 ఆధిక్యంతో ఉన్న ఆయుష్.. మధ్యలో క్రిస్టీ దానిని 1613కు తగ్గించి, ఒక దశలో 1818తో స్కోర్లు సమమై అతడికి గేమ్‌పాయింట్ దక్కినా ఇండోనేషియా షట్లర్ చేసిన తప్పిదంతో గేమ్ భారత కుర్రాడి వశమైంది. రెండో గేమ్ మరింత రసవత్తరంగా మారగా స్కోర్లు 1718గా ఉన్న సమయంలో మూడు మ్యాచ్ పాయింట్లు సాధించిన ఆయుష్.. సెస్ స్థానాన్ని ఖాయం చేసుకున్నాడు. ఈ టోర్నీలో ఆయుష్ ఒక్క గేమ్ కూడా కోల్పోకుండా సెస్ చేరుకోవడం గమనార్హం. ఫైనల్‌లో అతడు టాప్ సీడ్ కున్లావత్ విదిత్సరన్ (థాయ్‌లాండ్)ను ఢీకొననున్నాడు.

## భారత్ ప్లేఆఫ్స్ ఆశలు సజీవం



బిల్లీ జీన్ కింగ్ కప్ ఆసియా ఓసియానియా గ్రూప్1 టెన్నిస్ టోర్నీలో భారత్ పుంజుకుంది. తెలుగమ్మాయి సహజ యమనపల్లి, జీల్ దేశాయ్ రాణించడంతో శుక్రవారం 30తో మంగోలియాను చిత్తు చేసింది. తొలి సింగిల్స్‌లో జీల్ దేశాయ్ 60, 60తో గంటోర్‌ను ఓడించగా.. రెండో సింగిల్స్‌లో సహజ 60, 60తో జర్గాల్‌పై నెగ్గి ఆధిక్యాన్ని రెట్టింపు చేసింది.

డబుల్స్‌లో వైష్ణవి అద్కర్‌రుతుజ భోస్లే జంట 61, 60తో కాంగ్రోజుల్‌జర్గాల్ జోడీపై గెలవడంతో భారత్ ఘన విజయం సాధించింది. 4 మ్యాచ్‌ల్లో 2 పాయింట్లతో ఉన్న భారత్.. శనివారం కీలక మ్యాచ్‌లో కొరియాతో తలపడనుంది. ప్లేఆఫ్స్ చేరాలంటే భారత్ ఈ పోరులో తప్పక నెగ్గాలి. ఇతర మ్యాచ్‌ల ఫలితాలు అనుకూలంగా రావాలి. ఇండోనేషియా నాలుగు పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా.. కొరియా, థాయ్‌లాండ్ చెరో 3 పాయింట్లతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

టాప్2 జట్లు ప్రపంచ గ్రూప్ ప్లేఆఫ్స్‌కు అర్హత సాధిస్తాయి.

# వుదయం సినిమా

MOVIE TIME!

## కాలగమనం ప్రీ రిలీజ్ ఈవెంట్



పిపిఆర్ ఫిలిమ్స్ పతాకంపై రాజా బిరుదుల, లావణ్య రామారావు, చినబాబు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం "కాలగమనం". సుధాకర్ బుర్రి దర్శకత్వం వహిస్తూ, నిర్మిస్తోన్న ఈ లవ్ అండ్ యూత్ ఫుల్ ఎంటర్ టైన్ మెంట్ చిత్రం ఈనెల 17న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు వస్తోంది. శుక్రవారం సాయంత్రం హైదరాబాద్ లో "కాలగమనం" సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ ఘనంగా నిర్వహించారు. మ్యూజిక్ డైరెక్టర్ రాజేష్ రాజ్ తేలు మాట్లాడుతూ "కాలగమనం" సినిమాను మా డైరెక్టర్ సుధాకర్ బుర్రి గారు బ్యూటిఫుల్ గా తెరకెక్కించారు. నేను పోస్ట్ ప్రొడక్షన్ చేసే టైమ్ లో అనేక సార్లు ఈ చిత్రాన్ని చూశాను. నాకు బాగా నచ్చింది. ప్రేక్షకులు కూడా మా మూవీని ఇష్టపడతారని, సక్సెస్ చేస్తారని నమ్ముతున్నా.

# తారల అసలు పేర్లు

## శ్రీదేవి



అందాల తారగా అద్భుత నటిగా గుర్తింపు పొందిన శ్రీదేవి అసలు పేరు శ్రీ అమ్మ యంగర్ అయ్యప్పన్.మద్రాసు సమీపంలో మీనం పట్టిలో లాయర్ అయ్యప్పన్, రాజేశ్వరి దంపతులకు 1381963న జన్మించింది. తెలుగు తమిళ మలయాళ కన్నడ హిందీ చిత్రాల్లో మొత్తం మీద 300 చిత్రాలకు పైగా నటించి భారతీయ చిత్ర పరిశ్రమలో తొలి మహిళా సూపర్ స్టార్ అనిపించుకుంది.అత్యధిక పారితోషికం తీసుకున్న నటిగా పేరు వుంది.2013లో పద్మశ్రీ లభించింది.జాతీయ స్థాయిలో ఒక అవార్డు, నంది అవార్డు, తమిళనాడు ప్రభుత్వ ఫిల్మ్ అవార్డు కేరళ రాష్ట్ర ఫిల్మ్ అవార్డు ఇంకా అనేక అవార్డులు తన యాభై ఏళ్ళ సినీ ప్రస్థానంలో కైవసం చేసుకుంది.

తన నాలుగో ఏట బాల నటిగా 1966లో కందన్ కరునై సినిమాలో బాల మురుగన్ (బాల సుబ్రహ్మణ్యం)గా బేబీ శ్రీదేవిగా కెరీర్ ప్రారంభించింది. బాలనటిగా తెలుగులో 1969లో మా నాన్న నిర్దోషి, హిందీలో 1972లో రాణి మేరా నామ్ తో పరిచయమయింది. బడిపంతులు లో (బూచాడమ్మా బూచాడు బుల్లి పెట్టిలో వున్నాడు...పాటతో పాప్యులర్) మున్నగు అనేక చిత్రాల్లో నటించింది.

మూండ్రు ముడిచ్చు సినిమాలో తన 13వ ఏట 1967లో కథానాయిక అయింది. 16 వయదినిలే, పదహారేళ్ళ వయసు, మీండుం కోకిల, ఆకలి రాజ్యం, ప్రేమాభిషేకం, ఆఖరి పోరాటం, క్షణం క్షణం, జగదేక వీరుడు అతిలోక సుందరి, జస్టిస్ చౌదరి బాగా పేరు తెచ్చాయి.

సద్మా, ఖుదా గవా, నగీనా, జుదాయి వంటి సినిమాల్లో నటనకు మంచి పేరు వచ్చింది. ఇంగ్లీష్ వింగ్లీష్ సినిమాలో నటన, పండించిన హాస్యం అంతా ఇంతా కాదు. 2017లో విడుదలైన మామ్ సినిమాలోని నటనకు జాతీయ స్థాయిలో ఉత్తమ నటి అయింది. మాలిని అయ్యర్ ద్వారా టెలివిజన్ ప్రేక్షకులకు మరింత చేరువైంది. దుబాయ్ లో ఒక ఫంక్షన్ కు వెళ్లి హోటల్ లోని బాత్ టబ్ లో 2422018న ఉహించని విధంగా మృతి చెందింది. చివరి క్షణం వరకు అందంగానే అందరికీ కనిపించా లనే తపించింది.

## నూతన్ ప్రసాద్



'దేశం చాలా క్లిష్టపరిస్థితిలో ఉంది' 'నూటొక్క జిల్లాల అందగాడిని' అనే డైలాగులు ఆ పలికిన శైలి 'కొత్తా దేవుడండి కొంగొత్త దేవుడండి ' పాట గుర్తుకు వచ్చాయా? అలా ప్రతినాయకుని పాత్రల్లో ప్రత్యేక శైలిలో విభిన్న తరహా సంభాషణ లతో అలరించిన నూతన్ ప్రసాద్ అసలు పేరు తాడినాడ వరప్రసాద్. కృష్ణా జిల్లా కైకలూరులో 12-12-1945న పుట్టారు.

హైదరాబాదులో ప్రభుత్వోద్యోగం చేస్తూ 1973 లో తన ఉద్యోగానికి రాజీనామా చేసి బాపు దర్శకత్వంలో అక్కినేని 'అందాల రాముడు' తో చిత్ర రంగ ప్రవేశం చేశాడు. నీడ లేని ఆడది మొదలైన చిత్రాలలో నటించినా, సిసలైన గుర్తింపు బాపు 'ముత్యాల ముగ్గు ' లో రావు గోపాల రావు నేతృత్వంలో అనేక పెళ్లిళ్లు చేసుకొనే ప్రతి నాయకునిగా నటించడంతో వచ్చింది. సైతాన్ గా నటించిన 'రాజాధిరాజు 'చిత్రంతో ఈయన నట జీవితం తారాస్థాయికి చేరుకొంది.

తొలుత తల్లి శ్యామలా దేవి ప్రోత్సాహంతో నాటకాల్లో నటించాడు. నా ఊరు నాటకం మంచి పేరు తెచ్చింది. విజయవాడలో 1971లో రాష్ట్ర స్థాయి నాటక పోటీల్లో కమేడియన్ గా వచ్చిన పేరు సినిమాల్లోకి అడిగిడే అవకాశం కల్పించింది. మా వారి మంచితనంలో నటన కారణంగా ఎన్.టి.ఆర్. ప్రోత్సాహం మరింత లభించిందని నూతన్ తరుచు చెప్పేవారు.

1989లో మద్రాసులో బామ్మ మాట బంగారు బాట సినిమా షూటింగులో " చచ్చానా దేవుడా నా వెన్నుపూస విరిగింది" అనే డైలాగ్ తో కారు మీద నుంచి పడిపోతే విజయ ఆసుపత్రిలో జేర్చాక పలకరించ డానికి వెడితే కాళ్ళు దెబ్బ తిన్న తన శరీర దీన పరిస్థితి చూపి కన్నీళ్లతో 'సినిమా వాళ్లెవరూ వచ్చి పలకరించనందుకు చాలా బాధగా వుంది ' అని అంటూ గుండె పాము కోవడం ఇప్పటికీ మరుపురాదు. విజయ్ లో పులి గోళ్ళ పరమేశ్వర రావు ధ్రువ నక్షత్రం లో మట్టిగడ్డల మాణిక్యాల రావు ప్రేమించి చూడు లో డేవిడ్ గోపాల్ రావు,చెన్నపట్నం చిన్నోళ్లు లో కోకో (కోనసీమ కోదండం ) రాష్ట్ర రౌడీలో బంక మట్టి భాస్కర్ రావు,మంచి కుటుంబం లో ఆదమరపు ఆత్మానందం,ముఠా నాయకుడులో హోం మంత్రి గాలి సుబ్బారావు ఇలా పలు సినిమాల్లో తన పాత్రల పేర్లు నటన కూడా వెరైటీనే! శ్రీ వారికి ప్రేమలేఖ,ఖైదీ, మగ మహారాజు, చలి చీమలు, ప్రెసిడెంటు పేరమ్మ, అహ నా పెళ్లంట, తాతయ్య ప్రేమ లీలలు, దొంగ కోళ్లు, కర్తవ్యం ఇలా యాక్సిడెంటుకు ముందు 350 సినిమాల్లో తరువాత వీల్ చైర్ పై 101కి పైగా చిత్రాల్లో తన నటనతో ఆకట్టుకున్నాడు.

ఉత్తమ సహాయ నటుడుగా 'సుందరి సుబ్బారావు' కు, 'వసుంధర' కు, ఉత్తమ విలన్ గా' ప్రజాస్వామ్యం ', 'నవ భారతం ' సినిమాలకు నంది అవార్డులు లభించాయి. 2005లో ఎన్.టి.ఆర్. నేషనల్ అవార్డు వచ్చింది. డబ్బింగ్ ఆర్టిస్టుగా పలువురి నటులకు గాత్రం ఇచ్చారు. ఈటీవీ కూడా బాగా ఆదుకుంది.హైదరాబాద్ లో రవీంద్ర భారతి ఇన్ చార్జ్ గాను సేవలు అందించి 30-3-2011న మృతి చెందారు.

## గీతాంజలి



హీరోయిన్ గా ప్రవేశించి కొన్ని చిత్రాలు చేసాక హాస్య నటిగా గుర్తింపు పొందిన గీతాంజలి అసలు పేరు మణి. రాజమండ్రి లో శ్యామలాంబ శ్రీరామ మూర్తిలకు 1947లో పుట్టిన తమ పిల్లలను సినిమాల్లో జేర్చాలని మద్రాసు తీసుకెళ్లి వెంపటి సత్యం వద్ద నాట్యం నేర్పించసాగారు. రాణి రత్నప్రభ సినిమా కోసం నాట్యం చేసే పిల్లలను దర్శకుడు బి ఎ సుబ్బారావు అడిగితే తనతో బాటు అక్క స్వర్ణ ఇంకో ఇద్దరిని సత్యం మాష్టారు పంపారు. అపుడు ఎన్ టి ఆర్ దృష్టిలో పడి 'సీతారామ కళ్యాణం'లో హరనాథ్ సరసన సీతగా నటించే ఛాన్స్ స్వర్ణకు శూర్పణక పాత్ర దక్కింది.గులేబకావళి కథలో కూడా నటించాక ఇల్లాలు లో టైటిల్ పాత్రతో రౌడీ పాత్ర కూడా ద్విపాత్రాభినయంగా ఎల్.వి.ప్రసాద్ ఇస్తే బాగా చేసింది. పొట్టి ప్లీడరు, పంతాలు పట్టింపులు సినిమాల్లో హీరోయిన్. బొబ్బిలి యుద్ధం ,డాక్టర్ చక్రవర్తి,దేవత, మురళీ కృష్ణల్లో మంచి పేరు వచ్చింది. బాబూ బాయ్ మిస్త్రి దర్శకత్వం వహించిన 'పారస్ మణి ' హిందీ సినిమాలో ఆమె అసలు పేరు మణిని ఆయన 'గీతాంజలి'గా 1963లో మార్చడంతో అలాగే కొనసాగింది. నటుడు రామకృష్ణతో తోడు నీడ లో నటించాక ఆ యాత్ర కొనసాగి 1581974 లో పెళ్లి చేసుకుని ఒకరికి ఒకరు తోడు నీడ అయ్యారు. మద్రాసు పానగల్ పార్క్ సమీపంలో ఒక ప్రివ్యూ థియటర్ నిర్మించారు.

మా వూరు మదరాసు నా పేరు రాందాసు అనే వాక్యంకి మా ఊరు బొంబాయి నా పేరు రాధా బాయి అని జవాబు ఇచ్చే గీతం, పొరుగింటి మీనాక్షమ్మని చూసారా! వాళ్ళాయన చేసే ముద్దు ముచ్చట విన్నారా అనే గడసరి మాటల హాస్యపు పాట, నీవు నా ఊహలందే నిలిచావు అనే ఆర్తి ధ్వనించే గీతంలో గీతంజలి నటన ఇలా ఆమె అభినయంకి చాలా మార్కులు పడ్డాయి.

సంబరాల రాంబాబు, మట్టిలో మాణిక్యం, అబ్బాయిగారు అమ్మాయి గారు, మంచి రోజులు వచ్చాయి, పెళ్లయిన కొత్తలో, నేరము శిక్ష, ఆలయం, గోపి గోపిక, దమరుకం, గోదావరి, గ్రీకు వీరుడు ఇలా పలు సినిమాల్లో నటించింది. టెలి సీరియల్స్ లో కూడా నటించింది. 31-10-2019న మృతి చెందింది.

(ఇంకా వున్నారు )

-వి.ఎస్.ఆర్.కేశవరావు
సెల్ : 9989235320

# సంగీత ప్రియులకు పండగే

### 26న హైదరాబాద్‌లో హారిస్ జయరాజ్ మ్యూజిక్ కాన్సర్ట్



హైదరాబాద్‌లోని సంగీత ప్రియులను ఉర్రూతలూగించేందుకు ప్రముఖ సంగీత దర్శకుడు హారిస్ జయరాజ్ సిద్ధమయ్యారు. ఆయన నేతృత్వంలో జరగనున్న భారీ లైవ్ కాన్సర్ట్ ఏప్రిల్ 26న నగరంలోని బౌల్డర్ హిల్స్ వేదికగా అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఈ వేడుకకు సంబంధించిన వివరాలను వెల్లడించేందుకు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హారిస్ జయరాజ్ మరియు సింగర్ కారుణ్య పాల్గొని ఆసక్తికర విశేషాలను పంచుకున్నారు.

చాలా కాలం తర్వాత హైదరాబాద్‌లో షో నిర్వహిస్తుండటంపై స్పందిస్తూ, 'ఆరెంజ్' సినిమా రీరిలీజ్ సమయంలో తెలుగు ప్రేక్షకులు చూపించిన అపారమైన ప్రేమ, స్పందన చూసి ఆశ్చర్యపోయానని, అదే ఉత్సాహంతో ఈ ప్రత్యేక ప్రదర్శనను ప్లాన్ చేశానని హారిస్ జయరాజ్ తెలిపారు. ముఖ్యంగా ఆరెంజ్, వాసు, మరియు ఘర్షణ వంటి చిత్రాల్లోని ఎవర్‌గ్రీన్ పాటలు ఈ కాన్సర్ట్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం యొక్క మరో ప్రధాన విశేషం ఏమిటంటే, సుమారు 13 మంది ప్రముఖ గాయనీగాయకులు ఇందులో పాల్గొంటున్నారు, వీరంతా తాము పాడిన ఒరిజినల్ సాంగ్స్‌నే వేదికపై ప్రత్యక్షంగా పాడనుండటం విశేషం. ఇంత మంది దిగ్గజ గాయకులను ఒకే వేదికపైకి తీసుకురావడం మరియు వేల పాటల నుంచి కొన్నిటిని ఎంపిక చేయడం సవాలుతో కూడుకున్న పని అని ఆయన పేర్కొన్నారు. జోరా క్లబ్ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఈ వేడుకను అంతర్జాతీయ సాంకేతిక ప్రమాణాలతో, ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇచ్చేలా తీర్చిదిద్దుతున్నారు. ఈ ప్రెస్ మీట్‌లో జరిగిన క్యూ అండ్ ఏ సెషన్ అభిమానుల్లో మరింత ఆసక్తిని పెంచగా, ప్రస్తుతం ఈ కాన్సర్ట్ టికెట్లు 'డిస్ట్రిక్ట్ బై జోమాటో' యాప్‌లో అందుబాటులో ఉన్నాయి. ఎంతో ప్రతిష్ఠాత్మకంగా జరుగుతున్న ఈ సంగీత విభావరి నగర చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోతుందని నిర్వాహకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

## శ్రీకాకుళంలో సిల్వర్ జ్యువెలరీ
# గోయాజ్ ప్రారంభం

### నటి నేహా శెట్టి చేతుల మీదుగా గోయాజ్ 25వ స్టోర్ ప్రారంభోత్సవం





భారతదేశంలోనే అతిపెద్ద లగ్జరీ సిల్వర్ జ్యువెలరీ బ్రాండ్ అయిన 'గోయాజ్', తన విజయయాత్రలో భాగంగా 25వ మైలురాయిని చేరుకుంది. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళంలో తన సిల్వర్ జూబ్లీ స్టోర్‌ను అత్యంత వైభవంగా ప్రారంభించింది. ఈ నూతన స్టోర్‌ను ప్రముఖ సినీ నటి నేహా శెట్టి ఈరోజు (ఏప్రిల్ 11) ఉదయం 10:41 గంటలకు ప్రారంభించారు. దక్షిణ భారతదేశంలో శరవేగంగా విస్తరిస్తున్న గోయాజ్, వెండి ఆభరణాల రంగంలో సరికొత్త ఒరవడిని సృష్టిస్తోంది. సుమారు 1400 చదరపు అడుగుల విస్తీర్ణంలో, అత్యంత విలాసవంతంగా తీర్చిదిద్దిన ఈ స్టోర్ వినియోగదారులకు సరికొత్త షాపింగ్ అనుభూతిని అందిస్తుంది. అద్భుతమైన డిజైన్లు, మునుపెన్నడూ చూడని కలెక్షన్లతో ఈ స్టోర్ శ్రీకాకుళం వాసులను మంత్రముగ్ధులను చేయనుంది.

### ప్రత్యేక ప్రారంభోత్సవ ఆఫర్లు
### (ఏప్రిల్ 11 నుండి ఏప్రిల్ 16 వరకు)

**₹1,00,000 విలువైన వెండి ఆభరణాల కొనుగోలుపై ₹30,000 విలువైన గిఫ్ట్ వోచర్ ఉచితం.**
**₹50,000 విలువైన వెండి ఆభరణాల కొనుగోలుపై ₹15,000 విలువైన గిఫ్ట్ వోచర్ ఉచితం.**
**₹25,000 విలువైన వెండి ఆభరణాల కొనుగోలుపై ₹7,500 విలువైన గిఫ్ట్ వోచర్ ఉచితం.**
**₹10,000 విలువైన వెండి ఆభరణాల కొనుగోలుపై ₹3,000 విలువైన గిఫ్ట్ వోచర్ ఉచితం.**
**త్వరలోనే మరిన్ని నగరాల్లో తన సేవలను విస్తరించనున్న గోయాజ్, నాణ్యతకు మరియు వైవిధ్యానికి మారుపేరుగా నిలుస్తోంది. మరి ఇంకెందుకు ఆలస్యం?**
**భారతదేశపు అతిపెద్ద సిల్వర్ జ్యువెలరీ బ్రాండ్‌ను అనుభవించడానికి సిద్ధంగా ఉండండి!**

## కొరియన్ కనకరాజు నుంచి కమ్మాహంనిదా



మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ 'కొరియన్ కనకరాజు' వేగంగా చిత్రీకరణ జరుపుకుంటోంది, మేర్లపాక గాంధీ దర్శకత్వం వహిస్తున్న ఈ ప్రాజెక్ట్‌ను చివరి దశకు చేరుకుంది. యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై తెరకెక్కుతున్న ఈ చిత్రం, భారతీయ, కొరియన్ నేపథ్యాలలో హారర్, కామెడీ,క్రాస్ కల్చర్ మేళవింపుతో ఫుల్ లెంత్ ఎంటర్టైనర్ గా రూపొందుతోంది. ఈ క్యారెక్టర్ కోసం అద్భుతమైన మేకోవర్ అయిన వరుణ్ తేజ్, మునుపెన్నడూ చూడని పాత్రతో ప్రేక్షకులను సర్ ప్రైజ్ చేయడానికి సిద్ధంగా ఉన్నాడు. చిత్ర బృందం ఇప్పుడు ఈ ఫస్ట్ మొదటి సింగిల్ 'కమ్మాహంనిదా'ను విడుదల చేసింది.

## CASTE మూవీ ఫస్ట్ లుక్




ఎకె జంపన్న రచన & దర్శకత్వంలో గోల్డెన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై తోట లక్ష్మీ కోటేశ్వరరావు ఓ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి 'CASTE' అనే పవర్‌ఫుల్ టైటిల్ పెట్టారు. ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను బ్లాక్‌బస్టర్ డైరెక్టర్ వివి వినాయక్ విడుదల చేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ వివి వినాయక్ మాట్లాడుతూ.. దర్శకుడు జంపన్న నాకు బాగా పరిచయం ఉన్న వ్యక్తి. ఆయనకు దర్శకుడిగా అవకాశం ఇచ్చిన లక్ష్మీ కోటేశ్వరరావు గారికి ధన్యవాదాలు తెలుపుతున్నాను. ఈ సినిమా మంచి హిట్ సాధించి జంపన్నకు మంచి పేరు, నిర్మాతకు మంచి లాభాలు రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. టీమ్ అందరికీ నా బెస్ట్ విషెస్.



# హరుడు ట్రైలర్ లాంచ్

### మే8న తప్పకుండా థియేటర్స్ లో చూడండి ఖచ్చితంగా ఎంజాయ్ చేస్తారు: ట్రైలర్ లాంచ్ ఈవెంట్ లో హీరో వెంకట్




శ్రీ సీతా రాముల కల్యాణం చూతము రారండి, అన్నయ్య, ప్రేమ కోసం, శివ రామరాజు లాంటి బ్లాక్ బస్టర్ సినిమాలతో అలరించిన హీరో వెంకట్ సినిమాల్లోకి కమ్ బ్యాక్ ఇస్తున్నారు. విఆర్ ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ లో వెంకట్ హీరోగా రూపొందుతున్న మాస్ కమర్షియల్ ఎంటర్ టైనర్ 'హరుడు'. రాజ్ తాళ్లూరి దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. సమ్మర్ స్పెషల్ గా మే 8న ఈ సినిమా వరల్డ్ వైడ్ రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ట్రైలర్ లాంచ్ చేశారు. ట్రైలర్ లాంచ్ ఈవెంట్ లో హీరో వెంకట్ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. 'హరుడు' సినిమాను పూర్తి చేయడానికి నేను యాక్టింగ్‌తో పాటు ప్రొడ్యూసర్ బాధ్యతలు కూడా తీసుకోవాల్సి వచ్చింది. సినిమాను ప్రజల వద్దకు తీసుకెళ్లాలని మీడియా మిత్రులని కోరుతున్నాను. చాలా మంచి నటీనటులు ఈ సినిమాలో కీలక పాత్రలు పోషించారు. ఇందులో విలన్‌గా శ్రీహరి పైలా అనే కొత్త ఆర్టిస్ట్‌ను పరిచయం చేస్తున్నాం. దర్శకుడు రాజ్ తాళ్లూరి అద్భుతంగా సినిమాను తీశారు. ఈ సినిమాలో ప్రతి పాత్రకు ప్రాముఖ్యత ఉంటుంది. మణి జిన్న అద్భుతమైన మ్యూజిక్ అందించారు. ఒక రొమాంటిక్ సాంగ్‌ను గోవాలో షూట్ చేశాం ఆ పాట చాలా బాగా వచ్చింది. రిలీజ్ తర్వాత అది ఇంకా హిట్ అవుతుంది. హైదరాబాద్ మాస్ సాంగ్ కూడా చిత్రీకరించాం అది థియేటర్లలో అలరిస్తుంది. మంచి యాక్షన్ ఎపిసోడ్స్ ఉన్నాయి. గోవా, ముంబైలో పాటలు చిత్రీకరించాం. మంచి బడ్జెట్‌తో, మంచి లొకేషన్స్‌లో సాంగ్స్ తీశాం. మా డిఓపీ ఆనంద్ చాలా సపోర్ట్ చేశారు. సినిమా చాలా అద్భుతంగా వచ్చింది. నన్ను యాక్షన్ హీరోలా చూపించారు. ఇది మంచి కమర్షియల్ ఎంటర్‌టైనర్. మే 8న విడుదల చేస్తున్నాం. మీ అందరి సపోర్ట్ ఆశీర్వాదాలు మాతో ఉండాలని కోరుకుంటున్నాను. థాంక్యూ."

## పాపం ప్రతాప్ ట్రైలర్ లాంచ్



టాలీవుడ్ వెర్సటైల్ యాక్టర్ తిరువీర్ హీరోగా, ఎస్.పి. దుర్గ నరేష్ దర్శకత్వంలో రూపొందిన ఫ్యామిలీ ఎంటర్టైనర్ 'పాపం ప్రతాప్'. కృషి ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రాకేశ్ రెడ్డి గడ్డం, రుద్రదేవ్ మదిరెడ్డి సంయుక్తంగా నిర్మించారు. వరుస బ్లాక్ బస్టర్స్‌తో ఆడియన్స్‌ను అలరిస్తున్న ఈటీవి విన్ ఒరిజినల్ ప్రొడక్షన్ నుంచి రాబోతున్న ఈ సినిమా నుంచి రీసెంట్‌గా రిలీజైన టీజర్,సాంగ్స్ కు మంచి అప్లాజ్ వస్తోంది. ఏప్రిల్ 17న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో మేకర్స్ ట్రైలర్ లాంచ్ చేశారు. హీరో అల్లరి నరేష్, డైరెక్టర్ హరీష్ శంకర్ ముఖ్య అతిథులుగా హాజరైన ఈ వేడుక గ్రాండ్ గా జరిగింది.



## స్వయంభూ నుంచి రా రా ధీవర

'కార్తికేయ 2'తో పాన్ ఇండియా విజయాన్ని అందుకున్న నిఖిల్ సిద్ధార్థ, ఇప్పుడు తన అత్యంత ప్రతిష్ఠాత్మక చిత్రం 'స్వయంభూ'తో రాబోతున్నారు. భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో, పిక్సెల్ స్టూడియోస్ భువన్, శ్రీకర్ నిర్మాణంతో, టాగోర్ మధు సమర్పణలో రూపొందిన ఈ చిత్రాన్ని ఒక భారీ చారిత్రక యాక్షన్ చిత్రంగా తీర్చిదిద్దారు.రవి బస్రూర్ సంగీతం అందించగా, ఈ చిత్రం ఫస్ట్ సింగిల్ 'రా రా ధీవర' ఏప్రిల్ 16న విడుదల కానుంది. ఈ విషయాన్ని చిత్ర నిర్మాతలు ఒక పవర్‌ఫుల్ పోస్టర్ ద్వారా ప్రకటించారు. ఈ పోస్టర్‌లో నిఖిల్ ఒక యోధుడి అవతారంలో, దట్టమైన అడవిలో నిలబడి, ఈటెను విసరడానికి సిద్ధంగా ఉన్నట్లుగా కనిపించారు. ఈ పాట ఎంత గ్రాండ్‌గా, అద్భుతంగా, కళ్లు చెదిరేలా ఉండబోతోందో ఈ పోస్టర్ సూచిస్తుంది.

## ది ప్యారడైజ్ నుంచి ఫస్ట్‌లుక్

నేచురల్ స్టార్ నాని పీరియడ్ యాక్షన్ డ్రామా 'ది ప్యారడైజ్' పై అంచనాలు ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 'ఆయా షేర్' సింగిల్ విడుదల తర్వాత నెక్స్ట్ లెవల్ కి చేరుకున్నాయి. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో, ఎస్ఎల్వి సినిమాస్ బ్యానర్ పై సుధాకర్ చెరుకూరి నిర్మించిన ఈ చిత్రం ప్రతి పాత్ర రివల్ తో ఆసక్తిని మరింత పెంచుతోంది. అభిమానులకు ఒక ప్రత్యేకమైన సర్‌ప్రైజ్‌గా, హీరోయిన్ కయాదు లోహర్ పుట్టినరోజును పురస్కరించుకుని, చిత్ర నిర్మాతలు ఈరోజు ఆమె ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. కయాదు లోహర్ 'ది ప్యారడైజ్' ప్రపంచంలోకి సుబ్బలక్ష్మి (సుబ్బు)పాత్రలో అడుగు పెట్టింది. సినిమా మొత్తం రగ్డ్, ఇంటెన్స్ ప్రపంచంలో సాగుతున్నప్పటికీ, ఆమె పాత్ర ఆ కథకు ఓ సాఫ్ట్ టచ్ అందించనుందని పోస్టర్ సూచిస్తోంది.

Printed, Published & Owned by SIRIKONDA MARIA, Printed at ASHISH PUBLICATIONS H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-7-25/5, Risalagadda,RTC X Roads, Hyderabad - 500020, Telangana.
Editor : SIRIKONDA AUGUSTIN. RNI No.: TELTEL/2000/00272. E-mail : voodayam2007@gmail.com, Cell : 9247698676. Telefax: 040-27678676.